
ఆదివారం 14-5-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 52



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 14-5-2023

వైరల్

ఈ పిల్లి 'మామ్' అంటుంది!



ఈ పిల్లి 'మ్యావ్' అంటుందా? 'మామ్' అంటుందా? అనే విషయం కాస్త కన్‌ఫ్యూజ్‌గా ఉన్నప్పటికీ 'మామ్' అంటుందనే శబ్దభ్రమను కలిగిస్తుంది. ముంబైకి చెందిన ఒక మహిళ పిల్లిని పెంచుకుంటుంది. ఆమె పేరేమిటో తెలియదుగానీ పిల్లి పేరు జగ్గు. ఒక విధంగా చెప్పాలంటే ఈ జగ్గు ఆమెకు కన్న కొడుకుగా మారి పోయి, ఆమెను నీడలా అనుసరిస్తోంది. వీరి బంధాన్ని ప్రతిబింబించే వీడియో ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అయింది. ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'జగ్గు పాటిల్'లో జగ్గు ప్రతి మూమెంట్‌ను డాక్యుమెంట్ చేశారు. 'మదర్స్ లవ్ ఈజ్ యూనివర్సల్' 'ఎందరో తల్లులు. ప్రేమ మాత్రం ఒక్కటే' 'భావోద్వేగాలు మనుషులకు మాత్రమే పరిమితమైనవి కావు' 'ఇలాంటి ప్రేమ మన దేశంలోని తల్లులకు మాత్రమే సాధ్యపడుతుంది. భగవంతుడు కోరుకునేది ఇదే' 'నిజమైన ప్రేమకు నిలువెత్తు సంతకం... తల్లి'... అంటూ నెటిజనులు స్పందించారు.

ఒక తల్లి అడిగిన మదర్స్ డే గిఫ్ట్‌లు



మదర్స్ డే సందర్భంగా తల్లికి గిఫ్ట్‌లు ఇవ్వడానికి పిల్లలు రకరకాలుగా ప్లాన్‌లు చేస్తుంటారు. అయితే ఈ పంజాబీ మహిళ మాత్రం 'మీరు ఇచ్చే గిఫ్ట్‌లు నాకు వద్దుగాక వద్దు' అంటోంది. 'అదేమిటి!' అని ఆశ్చర్యపోయేలోపే 'నేను అడిగిన గిఫ్ట్‌లు మాత్రం ఇవ్వాలి' అన్నది. ఆమె అడిగిన గిఫ్ట్‌లు...● సెల్‌ఫోన్‌తో గంటలు గంటలు గడపవద్దు. అదే లోకంగా బతకవద్దు ● పొద్దుపోయాక బద్దకంగా నిద్ర లేవడం కాదు, ఉదయాన్నే హుషారుగా లేవాలి ● ఆన్‌లైన్ ఫుడ్ పార్శిల్స్ వద్దు. ఇంటి తిండే ముద్దు. 'ఇవి డిమాండ్సా? గిఫ్ట్‌లా?' అని ఒక యూజర్ సందేహం రైజ్ చేస్తే, మరో యూజర్ ఇలా స్పందించాడు... 'డిమాండ్స్‌కు పిల్లలు ఓకే అంటే అవే గిఫ్ట్‌లుగా మారిపోతాయి. పిల్లల మంచి భవిష్యత్‌కు మించి తల్లికి కావల్సిన గొప్ప గిఫ్ట్ ఏదీ లేదు!' సోనియా కత్రి అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అవుతోంది.

అమ్మా... నేను ఉన్నాను కదా... డోన్ట్ వర్రీ



'అయ్యో! అప్పుడే మన్‌డే వచ్చేసిందా' అని మన్‌డే బ్లూస్‌కు గురయ్యే ఉద్యోగులు చాలామందే ఉంటారు. ఒక మహిళా ఉద్యోగి 'ఈరోజు నాకు ఆఫీసుకు వెళ్లాలని లేదు' అని భయం నటిస్తూ తన చిట్టికొడుకు యువాన్ష్ భరద్వాజ్‌తో అన్నది. మామూలుగానైతే పిల్లలు పెద్దగా స్పందించరు. అయితే యువాన్ష్ మాత్రం పెద్దరికం అద్దె తెచ్చుకొని 'అలా అంటే ఎలా?' అన్నట్లుగా ఫేస్ ఫీలింగ్ ఇచ్చాడు. అంతే కాదు. 'అలా అనవద్దు. ఆఫీసుకు వెళ్లక తప్పదు కదా!' అన్నాడు తల్లికి ధైర్యం చెబుతూ. వైరల్ అవుతున్న ఈ వీడియో ఇప్పటికే డెబ్బైలక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'రివర్స్ గేర్. మామూలుగానైతే పిల్లలు బడికి పోను అని మారాం చేస్తుంటే తల్లులు బుజ్జగిస్తారు. ఇక్కడ మాత్రం కొడుకు తల్లిని బుజ్జగిస్తున్నాడు. పిల్లాడిలో ఎంత పెద్దరికం కనిపిస్తుందో. శభాష్' అంటూ నెటిజనులు స్పందించారు.

నవ్వితే పోయేదేమీ లేదు... 100 టన్నుల టెన్షన్ తప్ప!



'మనకు నవ్వు తప్ప అన్నీ గుర్తుండి పోతున్నాయి. మనకు నవ్వు తప్ప అన్నీ ముఖ్యం అవుతున్నాయి' అంటూ మనం నవ్వుకు దూరం అవుతున్న తీరుపై, నవ్వు ప్రాముఖ్యతపై నయబ్ మిదా అనే యువతి చేసిన కవితాగానం వీడియో సోషల్ మీడియాలో 'వాహ్వా వాహ్వా' అంటూ వైరల్ అయింది.'మరిచిపోయిన నవ్వును మళ్లీ గుర్తు చేసింది' అని ప్రశంసిస్తూ ఈ వీడియోను రైల్వే ఉన్నతాధికారి అనంత్ రూపన్‌గూడి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

నవ్వు గురించి నయబ్ తన కవిత్వంలో ఇలా అంటోంది...

'హాయిగా నవ్వండి... మీరు ఏదైనా కోల్పోయినప్పుడు.

ఎందుకంటే... మీరు కోల్పోయింది అవసరంలో ఉన్నవారికి దొరికి ఉండవచ్చు!'

'హాయిగా నవ్వండి... ఓటమి ఎదురైనప్పుడు.

ఎందుకంటే ఆ విజయం నీ కంటే అతడికే ఎక్కువ అవసరం కావచ్చు!'

'మీ గ్లాస్ ఖాళీగా ఉందా? మీ నవ్వులతో దాన్ని నింపండి!'

మై డియర్ పప్పీ... నా మాట వింటావా!



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎంత బిజీగా ఉన్నాసరే వ్యాయామానికి మాత్రం విరామం ఇవ్వరు. తన ముద్దుల పప్పీని చేతుల్లోకి తీసుకొని, దాని కళ్లల్లోకి కళ్లు పెట్టి మాట్లాడుతూ ట్రెడ్‌మిల్‌పై వాకింగ్ చేస్తున్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేసింది.

ఇరవైనాలుగు గంటల లోపే ఈ వీడియో వేలాది లైకులు, వందలాది షేర్‌లను సొంతం చేసుకుంది.

'కొన్ని సమయాల్లో మనకు అదనపు ప్రేరణ అవసరం' అంటూ ఈ వీడియోకు కాప్షన్ ఇచ్చింది దీదీ. 'మాకు తెలుసు. ఆ ప్రేరణ, శక్తి మీకు రోజువారి వ్యాయామం నుంచే వస్తుందని'

'మమతాజీ, పప్పీతో ఏదో మాట్లాడుతుంది. ఎప్పుడూ మడమ తిప్పవద్దు అని పప్పీకి చెబుతుందేమో!'

'ఎంత ఫైర్‌బ్రాండ్ అయినా సరే, చేతిలో ముద్దుల పప్పీ ఉంటే కూల్ కావల్సిందే'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో యూజర్స్ నుంచి వచ్చాయి.

ధోని కుమారీ... విరాట్ రాణి



ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ ఉన్నట్టుండి అందమైన అమ్మాయిలుగా మారితే? 'అదెట్లా సాధ్యమండీ' అనే సౌండ్ రాకముందే- 'ఇదిగో ఇట్లా' అని ఆర్టిస్ట్ అబూ షాహిద్ ఏఐ టెక్నాలజీతో వారిని అందమైన అమ్మాయిలుగా మార్చాడు. ఈ ఫొటో ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది. ఈ అందమైన పోస్ట్‌ను లైక్ చేస్తూ యూజర్‌లు 'కలయా నిజమా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

రాణివాసం కన్నా... సమాజమే మిన్న...

భంజ్ యువరాణులు **మృణాళిక, అక్షిత**లు రాజవంశంలో పుట్టినా సాధారణ యువతుల్లాగే భిన్న రంగాల్లో తమను తాము నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. వీరిద్దరూ ఫిక్కీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు పంచుకున్న విశేషాలు వారి మాటల్లోనే...



మా ప్యాలెస్...టూరిస్ట్ ప్లేస్‌గా...

మా జిల్లా గురించి గొప్పగా చెప్పుకోలేని పరిస్థితే మా ప్రాంతాన్ని తీర్చిదిద్దే వైపు మమ్మల్ని పురికొల్పింది. అందులో భాగంగా స్థానికుల్ని స్వయం ఉపాధి దిశగా నడిపించడం, స్థానిక హస్తకళలకు చేయూత అందించడం.. వంటివి చేశాం. మా హస్తకళల బ్రాండ్ హసా అటెలియర్ సబాయి గడ్డితో చేసిన సంచుల విక్రయాలకు పేరు. వీటిని తరచు డోక్రాతో (ఒడిశాలోని గిరిజనులు చేసే ఓ రకమైన మెటల్‌వర్క్) జత చేసి విక్రయిస్తాం. ఇలా స్థానికులకు ఉపాధితో పాటు స్థానిక కళలకు కూడా ఖ్యాతి దక్కుతోంది. అదే క్రమంలో 20 ఎకరాల్లో ఉన్న మా ప్యాలెస్‌ను 11 గదుల బోటిక్ హోటల్‌గా మార్చాలని నిర్ణయించుకున్నాం. మా ఇంటిని టూరిస్ట్ ప్లేస్‌గా తీర్చిదిద్దే క్రమంలో మా తండ్రిగారిని ఒప్పించి ఆయన సూచనలు, సహకారంతో ఒక్క ఇటుక కూడా కొత్తగా జోడించకుండా, చారిత్రక ఆనవాళ్లేమీ చెరిగిపోకుండానే ప్యాలెస్‌ను ఆధునికంగా తీర్చిదిద్దాం. మేం దీనిని ప్రారంభించిన కొద్ది కాలానికే కోవిడ్ వచ్చింది. అయితే కోవిడ్ అనంతరం ప్రారంభమైన రివెంజ్ ట్రావెల్... మాకు అనూహ్యమైన ప్రోత్సాహాన్నిచ్చింది. మా జిల్లాకు ఒక మారుమూల అటవీ ప్రాంతంగా కాకుండా ఓ మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు వచ్చింది. అయితే ఈ పయనం మాకెన్నో మెలకువలు, పాఠాలూ నేర్పింది.

హైదరాబాద్‌లో ఫలక్‌నుమా ప్యాలెస్ ఉంది, రాజస్థాన్‌లో ఉదయ్‌పూర్ ప్యాలెస్ ఉంది... మరి మయూర్‌భంజ్‌లోని మా ప్యాలెస్‌కే ఎందుకు రావాలి.. అనే ప్రశ్నకు సమాధానంగా మేం మా చరిత్రను కథగా మలచి అతిథులకు పంచుతున్నాం. ప్రత్యేకంగా వికలాంగులకు అనుకూలమైన మరో రెండు గదులను ఇటీవలే జోడించాం. ప్రతి అడుగూ చరిత్రకు అద్దం పట్టేలా తీర్చిదిద్దాం'' అంటూ తమ విజయగాథను పంచుకున్నారు..

ఇదేకాదు.. ఒకరు యోగా టీచర్‌గా రాణిస్తుంటే మరొకరు రచయిత్రిగా... ఇలా భిన్న రంగాల్లో తమను తాము నిరూపించుకుంటున్నారు ఈ యువరాణులు.

మా ప్రాంతానికి 'కళ'తేవాలని...

మా కుటుంబానికి దాదాపు 1000 సంవత్సరాలు పైబడిన చరిత్ర ఉంది. అయితే ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో ఉన్న 200 ఏళ్ల నాటి పూర్వీకుల ఇల్లు బెల్గాడియా ప్యాలెస్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం దగ్గర నుంచి చేసిన ప్రతి పనీ మేం రాజకుటుంబ వారసత్వం అనే పరదాల నుంచి బయటకు వచ్చి చేసినవే. అంతర్జాతీయ కళాకారులను ఆహ్వానిస్తూ మయూర్ భంజ్ ఆర్ట్స్ - కల్చర్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తున్నాం. మా ప్యాలెస్‌ని ఆర్టిస్ట్ రెసిడెన్సీగా మార్చాం.

-మృణాళిక, అక్షిత

- సాక్షి హైదరాబాద్ సిటీ బ్యూరో
ఫొటో: మోహనాచారి

హెల్త్

పెదవులు పదిలం?



ఎన్నో రకాల వ్యాధుల గురించి తెలుసుకుంటాం కానీ... రోజూ కనిపించే పెదవుల గురించి అంతగా పట్టించుకోం. ఏ చలికాలంలోనో పెదవులు పగిలితే కాస్త వాజిలెన్ రాసుకుంటాం తప్ప... వాటి ఆరోగ్యంపై పెద్దగా అవగాహన పెంచుకోం. కానీ పెదవులకూ చాలా సమస్యలొస్తుంటాయి. ఆరోగ్యపరంగానే కాదు... కొన్ని లుక్స్‌నూ తగ్గించేస్తాయి. పెదవులకు సంబంధించిన వైద్యసమస్యల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఉపయోగపడేదే ఈ కథనం.

కొన్ని ఆరోగ్య సమస్యల తాలూకు లక్షణాలు పెదవుల ద్వారా వ్యక్తమైతే మరికొన్ని నేరుగా పెదవులకే వస్తాయి. ఆ సమస్యల్లో కీలకమైన కొన్ని ఇవి...

నేరుగా పెదవులకే వచ్చేవి...

▸ **కాంటాక్ట్ కీలైటిస్ :** కొందరు మహిళలు లిప్‌స్టిక్, లిప్‌గ్లాస్ వాడుతుంటారు. కొందరికి అవి సరిపడవు. అప్పుడు పెదవులు పొడిబారిపోయి చీలిపోతూ ఉంటాయి. ఈ సమస్యను అధిగమించడానికి తమకు సరిపడే లిప్‌స్టిక్‌నే కొనుక్కోవాలి.

▸ **యాక్టినిక్ కీలైటిస్ :** కొందరి పెదవులు నేరుగా సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ అయినప్పుడు అలర్జీ వస్తుంది. పెదవులు పొడిబారతాయి, పెదవులపై పొట్టులా రాలడం, పొక్కులూ రావచ్చు. వీళ్ల నేరుగా సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ కాకూడదు.

▸ **యాంగ్యులార్ కీలైటిస్ :** కొందరిలో పెదవుల చివరల్లో ఎర్రబారి, పెదవుల మూలల్లో చీలినట్లుగా అవుతుంది. ఈ సమస్య చాలావరకు పోషకాహార లోపంతోనే అందునా విటమిన్లు లోపించడం వల్ల వస్తుంది. కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు అంటే... క్యాండిలా, స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాక్సి వంటి వాటి వల్ల కూడా రావచ్చు. ఈ సమస్య ఏ కారణంగా వచ్చిందో తెలుసుకుని దానికి తగిన చికిత్స చేయాలి.

▸ **లిప్ లికింగ్ డర్మటైటిస్ :** ఈ సమస్య చిన్న పిల్లల్లో ఎక్కువ. ప్రధానంగా చలికాలంలో! పిల్లలు తమ పెదవుల్ని నాలుక సాయంతో పదేపదే లాలాజలంతో తడుపుకోవడం వల్ల పెదవుల చుట్టూ ఎర్రగా, అంచుల చుట్టూ పొడిగా, తర్వాత నల్లగా మారుతుంది. నివారణ కోసం పెదవులు పొడిబారనివ్వకూడదు.

▸ **ఎక్స్‌ఫోలియేటివ్ కీలైటిస్ :** ఇది కూడా చలికాలంలో వచ్చే సమస్యే గానీ అందర్లోనూ కనిపిస్తుంది. పెదవులు పొడిబారి, ఎర్రగా మారి, చర్మం పొట్టులా పొరలు పొరలుగా రాలిపోతుంటుంది. కొందరు లాలాజలంతో తడిచేస్తూ ఉంటారు. దాంతో మరింత పొడిబారతాయి. ఈ సమస్య నివారణకు కొందరు పెదవులకు కొబ్బరినూనె కూడా రాస్తుండే విషయం తెలిసిందే. అలాగే వెన్న, పెట్రోలియం జెల్లీ, లిప్ బామ్ రాయడం కూడా దీన్ని నివారిస్తుంది.

ఇతర కారణాలతో సమస్య వచ్చి పెదవులపై వ్యక్తమయ్యేవి...

▸ **హెర్పిస్ సింప్లెక్స్ :** ఈ సమస్య హెర్పిస్ అనే వైరస్ వల్ల వస్తుంది. ఇదో అంటువ్యాధి కూడా. ఈ సమస్య ఉన్నవారిలో పెదవుల మీద చిన్న చిన్న నీటి చుక్కల్లా, ఎర్రగా, నొప్పిగా ఉండే పొక్కులు వస్తాయి. మొదటిసారి జ్వరంతో వస్తుంది. మళ్లీ మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది. కానీ జ్వరం ఉండదు. ఒకే టవల్ వాడుతుండటం, కప్పులు, ప్లేట్లతోనూ వ్యాపిస్తుంది. యాంటీవైరల్ చికిత్సతో ఇది తగ్గుతుంది.

▸ **హెర్పిస్ జోస్టర్ :** చికెన్‌పాక్స్ వైరస్ వల్ల ఇది వస్తుంది. ఇందులో పెదవుల మీద నీటిగడ్డల్లా కనిపిస్తుంటాయి. నొప్పి ఉంటుంది. చికెన్‌పాక్స్ లాగే ఇదీ జీవితంలో ఒక్కసారే వస్తుంది. కానీ... వ్యాధినిరోధక శక్తి తగ్గినవారిలో రెండోసారీ రావచ్చు. దీనికి యాంటీవైరల్ చికిత్స అవసరం.

▸ **యాంజియోన్యూరోటిక్ ఎడిమా :** ఒక్కోసారిగా పెదవుల్లో వాపు రావడంతో పాటు చర్మం మీద కూడా దద్దుర్లు వస్తాయి. ఆహారంతో అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, ఒత్తిడి వల్ల ఈ సమస్య వస్తుంది. చాలా అరుదుగా ఇది ప్రమాదకారిగా మారి హాస్పిటల్‌లో చేరాల్సి రావచ్చు.

▸ **స్టీవెన్ జాన్సన్ సిండ్రోమ్ :** కొన్ని మందులు సరిపడకపోవడం వల్ల వచ్చే సమస్య ఇది. వీళ్లలో చర్మం మీద, అరచేతులు, పాదాలు, పెదవుల మీద పెద్ద నీటి బుగ్గలు వస్తాయి. ఒక్కోసారి ప్రమాదకరం కూడా. అందుకే మందులు వాడే ముందు అవి సరిపడతాయా లేదా అని కూడా తెలుసుకోవాలి.

▸ **ఫిక్స్‌డ్ డ్రగ్ ఎరప్షన్స్ :** ఇది కూడా మందులు సరిపడకపోవడం వల్ల వచ్చే సమస్యే. నిర్దిష్టమైన మందులతోనే ఇలా జరుగుతుంటుంది. కాబట్టి విషయం తెలిసిన డాక్టర్లు మళ్లీ అదే తరహా మందుల్ని సూచించరు.

▸ **లిప్ విటిలిగో :** బొల్లి మచ్చలు చర్మం మీదనే కాకుండా పెదవులపైనా వస్తాయి. చికిత్స తర్వాత మిగతా మచ్చలు తగ్గినప్పటికీ, పెదవులపై మాత్రం ఒక పట్టాన తగ్గవు.

▸ **కీలైటిస్ గ్రాండ్యులారిస్ :** పెదవుల్లో వాపు వస్తూ పోతూ ఉంటుంది. కొన్నాళ్ల తర్వాత ఆ వాపు ఎప్పటికీ ఉండిపోతుంది. లాలాజల గ్రంథులతో పాటు కనిపించే సమస్య ఇది.

▸ **లైకెన్ ప్లానస్ :** ఈ సమస్య ఉన్న కొందరిలో నోట్లో, పెదవులపై పర్పుల్ రంగు మచ్చలు వస్తాయి.

▸ **పెదవులపై కణుతులు:** మిగతా శరీర భాగాల్లోలాగే కొందరిలో పెదవులపైనా కణుతులు పెరగవచ్చు. అవి ఫైబ్రోమావంటి క్యాన్సర్ కణుతులయ్యే అవకాశాలూ ఎక్కువే,

▸ **పెదవుల క్యాన్సర్ :** పెదవుల విషయంలో స్క్వామోజా సెల్ కార్సినోమా, బేసల్ సెల్ కార్సినోమా వంటి క్యాన్సర్లు కనిపిస్తుంటాయి.

పైన పేర్కొన్న సమస్యల్లో కొన్నింటికి కారణాన్ని బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది.


డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెదవుల విషయంలో సాధారణ జాగ్రత్తలివి...

● ఆరెంజ్ జ్యూస్, పైనాపిల్ జ్యూస్ తాగిన తర్వాత పెదవులపై కాస్త దురదగా అనిపించడం చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే. ఇలాంటి జ్యూస్‌లు తాగాల్సివచ్చినప్పుడు సాధ్యమైనంతగా పెదవులకు అంటకుండా జాగ్రత్త వహించాలి. అంటే స్ట్రా వాడటం మంచిది. ● లిప్‌స్టిక్‌లోని ప్రొపైల్ గ్యాలేట్ అనే పదార్థం వల్ల అలర్జీలు వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే లిప్‌స్టిక్ కొనుగోలు సమయంలోనే అందులో ఈ ఇన్‌గ్రేడియెంట్ లేదని నిర్ధారణ చేసుకోవడం మంచిది. ● కొన్ని రకాల టూత్‌పేస్ట్‌లు సరిపడక కూడా కొందరిలో పెదవులపై దురద రావచ్చు. అప్పుడు అవి కాకుండా వేరే బ్రాండ్స్ వాడాలి. ● సిగరెట్లు తాగేవారిలో పెదవులు నల్లగా మారడం తెలిసిందే. పొగతాగడం అన్నది పెదవులకే కాకుండా ఆరోగ్యానికీ హానికరం. ఆ అలవాటు పూర్తిగా మానేయాలి.

పెదవుల ఆరోగ్యం కోసం...

● అన్ని పోషకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగుతూ, హైడ్రేటెడ్‌గా ఉండాలి. ● పెదవులు తడి ఆరిపోకుండా చూసుకోవాలి. అయితే నాలుకతో తడి చేయకూడదు. ● బాగా చలి వాతావరణానికి, బాగా వేడిగా ఉన్న వాతారణానికి నేరుగానూ, తక్షణం ఎక్స్‌పోజ్ కాకూడదు. ● లిప్‌స్టిక్ రాసుకునే వారు నిద్రకు ఉపక్రమించే ముందు శుభ్రంగా కడుక్కోవాలి.

అవాంఛిత రోమాలు కనిపిస్తుంటే..?



టీనేజీ యువతుల్లో వెంట్రుకలకు సంబంధించిన రుగ్మతలు ప్రధానంగా హార్మోన్లు, దేహంలో విడుదలయ్యే జీవరసాయనాల్లో హెచ్చుతగ్గుల వల్ల, జీవక్రియల్లో (మెటబాలిక్) మార్పుల కారణంగా ఎక్కువగా కనిపిస్తుంటాయి.

'హిర్సుటిజమ్' కండిషన్ ఉన్నవారిలో ప్రధానంగా ముఖం మీద... అలాగే గడ్డం, రొమ్ము, కడుపు మీద కూడా వెంట్రుకలు పెరుగుతుంటాయి. దాదాపు 10 శాతం మంది మహిళల్లో ఈ కండిషన్ కనిపిస్తుంటుంది. ఇది తీవ్రమైన జబ్బుకు సూచన కానప్పటికీ, యుక్తవయసు(ప్యూబర్టీ)కు ముందుగా ఇలా అవాంఛిత రోమాలు కనిపిస్తుంటే దీనికి కారణాన్ని తెలుసుకోవాలి. హిర్సుటిజమ్ లక్షణాలు కనిపించడాన్ని సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం లేదుగానీ... ఈ లక్షణాలతో పాటు రుతు సంబంధమైన సమస్యలుగాని, స్థూలకాయం పెరుగుతున్నా, పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్), హైపోథైరాయిడిజమ్ ఉన్నా, కొద్ది వ్యవధిలోనే రోమాల పెరుగుదల ఎక్కువగా ఉన్నా ఆ పరిస్థితిని కాస్త సీరియస్‌గానే తీసుకోవాలి. అలాగే ఇలాంటివాళ్లలో ముఖం మీద మొటిమలు ఎక్కువగా వస్తుండటం, గొంతు చుట్టూ నలుపుగా మారడం, బరువు పెరగడం, తల మీద వెంట్రుకలు పలచబడటం వంటి లక్షణాలూ ఉండవచ్చు. ఈ లక్షణాలు హార్మోన్ల అసమతుల్యతకు సూచనగా భావించి, చికిత్స చేయాల్సి ఉంటుంది.

వెంట్రుకలు మామూలుగా కాకుండా అబ్‌నార్మల్‌గా పెరగడాన్ని హైపర్ ట్రైకోసిస్‌గా పేర్కొంటారు. ఇక ఆడవాళ్లలో, అందునా యువతుల్లో పురుషుల మాదిరిగా వెంట్రుకలు పెరగడాన్ని 'హిర్సుటిజమ్' అంటారు.

ఇతర సమస్యలూ ఉండవచ్చు: ఇలాంటి యువతుల్లోనే ఎండోక్రైన్ సమస్యలు అంటే థైరాయిడ్, ఒవేరియన్ గ్రంథుల సమస్య, ఎడ్రినల్ ట్యూమర్స్, పీసీఓడీ సమస్యలతో పాటు కొన్ని జన్యుపరమైన సమస్యలూ ఉన్నాయేమో కూడా చూడాలి. కొన్ని మందులు ముఖ్యంగా స్టెరాయిడ్స్ వాడటం వల్ల కూడా శరీరంలో కొన్ని భాగాల్లో రోమాల పెరుగుదల ఎక్కువగా ఉండవచ్చు.

చికిత్స: షేవింగ్, వ్యాక్సింగ్ వంటి సాధారణ ప్రక్రియలతో కేవలం వెంట్రుకలను తొలగించవచ్చు గానీ... వాటిని తగ్గించడం జరగదు. కాస్త అడ్వాన్స్‌డ్ డర్మటాలజీ ప్రక్రియలైన ఎలక్ట్రాలిసిస్, లేజర్ ప్రక్రియల ద్వారా ఆ అవాంఛిత రోమాలను చాలావరకు తగ్గించవచ్చు. కాస్త అడ్వాన్స్‌డ్ చికిత్సలు ఏవైనా అవి డర్మటాలజిస్ట్ లేదా ఎండోక్రైనాలజిస్ట్‌ల ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుంది.

మెడి టిప్

రక్తపోటు తరుగు... ఆరోగ్యం పెరుగు!



మన జీర్ణవ్యవస్థ పొడవునా మన ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియా కోటానుకోట్ల సంఖ్యలో ఉంటాయి. వీటినే ప్రోబయోటిక్స్ అంటారు. ఇటీవల కడుపు ఆరోగ్యం బాగుపడటానికి డాక్టర్లు కూడా వీటినే మందుగా సూచిస్తుంటారు. అయితే 'పెరుగు' నిండా మనకు మేలు చేసే బ్యాక్టీరియా చాలా పెద్ద మొత్తంలోనే ఉంటుంది. అందుకే ఇది స్వాభావికమైన సహజ 'ప్రోబయాటిక్'.

పెరుగులో ఉండే పొటాషియమ్, మెగ్నీషియమ్‌లకు రక్తపోటు (హైబీపీ)ని నియంత్రించే గుణం ఉంది. అందుకే మిగతావారితో పోలిస్తే... ఆహారంలో భాగంగా క్రమం తప్పకుండా పెరుగు తినేవారిలో హైబీపీ కాస్త తక్కువ. పరిశోధనల్లో సైతం ఇది నిరూపితమైంది. మిగతావారితో పోలిస్తే పెరుగు తినేవారిలో హైబీపీ వచ్చే అవకాశాలు ముప్పై శాతం తక్కువగా ఉంటాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనల్లో వెల్లడైంది. అంతేకాదు... పెరుగులో ఉండే పోషకాలు మన వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఫలితంగా ఎన్నో వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ప్రతి రోజూ కనీసం రెండువందల గ్రాముల పెరుగు తినేవారిలో రోజూ యాంటీబయాటిక్స్ మాత్ర వేసుకున్నంత ప్రభావం ఉంటుందనీ, పైగా ఇది స్వాభావికమైన రోగనిరోధక శక్తి కావడంతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఉండవంటూ యూనివర్సిటీ ఆఫ్ వియన్నా (ఆస్ట్రియా) శాస్త్రవేత్తలు నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది.



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 16

సంచిక: 52

ఆదివారం 14-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రిథమ్ ప్రపంచ రికార్డు... అయినా పతకానికి దూరం

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ రిథమ్ సాంగ్వాన్ కొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. అజర్‌బైజాన్‌లోని బాకులో జరుగుతున్న ఈ పోటీల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో రిథమ్ 595 పాయింట్లు స్కోరు సాధించి రికార్డును నమోదు చేసింది. అయితే ఈ పోటీల క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఆమె ఈ కొత్త ఘనతను ప్రదర్శించింది. రికార్డు స్కోరుతో ఫైనల్ చేరిన రిథమ్ అసలు సమరంలో మాత్రం విఫలమైంది. సత్తా చాటలేకపోయిన ఆమె చివరగా ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే ఈవెంట్ క్వాలిఫయింగ్ ఇతర భారత షూటర్లు ఇషాసింగ్, మను భాకర్ వరుసగా 13వ, 27వ స్థానాల్లో నిలిచి ఆరంభంలోనే నిష్క్రమించారు. పురుషుల 50 మీటర్ల 3 పొజిషన్ రైఫిల్ ఈవెంట్‌లో కూడా భారత షూటర్లెవరూ ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

ప్రభ్‌సిమ్రన్ 'హీరో'చితం

- పంజాబ్‌కు కీలక విజయం
- 31 పరుగులతో ఢిల్లీ ఓటమి
- 'ప్లే ఆఫ్స్' రేసునుంచి క్యాపిటల్స్ అవుట్



న్యూఢిల్లీ: ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ సత్తా చాటింది. శనివారం జరిగిన కీలక పోరులో పంజాబ్ 31 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభ్‌సిమ్రన్ సింగ్ (65 బంతుల్లో 103; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఒంటిచేత్తో జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. ఐపీఎల్‌లో అతనికి ఇది తొలి సెంచరీ సాధించడం విశేషం. శిఖర్ ధావన్ (7), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ శర్మ (5), షారుఖ్ (2) చేతులెత్తేయగా... ప్రభ్‌సిమ్రన్‌కు స్యామ్ కరన్ (20) కాసేపు అండగా నిలిచాడు. అనంతరం హర్‌ప్రీత్ బ్రార్ (4/30) మాయాజాలంతో పంజాబ్ పైచేయి సాధించింది. హర్‌ప్రీత్ స్పిన్ ఉచ్చులో పడిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లన్నీ ఆడి 8 వికెట్ల నష్టానికి 136 పరుగులే చేయగలిగింది. డేవిడ్ వార్నర్ (27 బంతుల్లో 54; 10 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే అర్ధసెంచరీతో జట్టు పరువు నిలిపాడు. ఎలిస్, రాహుల్ చహర్ చెరో 2 వికెట్లు తీశారు. **ఈ ఓటమితో ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా 'ప్లే ఆఫ్స్'కు దూరమైన తొలి జట్టుగా నిలిచింది.**



స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (బి) ముకేశ్ 103; శిఖర్ ధావన్ (సి) రోసో (బి) ఇషాంత్ 7; లివింగ్‌స్టోన్ (బి) ఇషాంత్ 4; జితేశ్ (బి) అక్షర్ 5; స్యామ్ కరన్ (సి) అమన్ హకీమ్ (బి) ప్రవీణ్ దూబే 20; హర్‌ప్రీత్ (సి) మార్ష్ (బి) కుల్దీప్ 2; షారుఖ్ రనౌట్ 2; సికందర్ రజా నాటౌట్ 11; రిషి ధావన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1-10, 2-32, 3-45, 4-117, 5-129, 6-154, 7-165. **బౌలింగ్:** ఖలీల్ 4-0-36-0, ఇషాంత్ 3-0-27-2, అక్షర్ 4-0-27-1, ప్రవీణ్ దూబే 3-0-19-1, కుల్దీప్ యాదవ్ 4-0-32-1, మార్ష్ 1-0-21-0, ముకేశ్ 1-0-3-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్‌ప్రీత్ 54; ఫిల్ సాల్ట్ (బి) హర్‌ప్రీత్ 21; మార్ష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహర్ 3; రోసో (సి) సికందర్ రజా (బి) హర్‌ప్రీత్ 5; అక్షర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహర్ 1; అమన్ హకీమ్ (సి) హర్‌ప్రీత్ (బి) ఎలిస్ 16; మనీశ్ పాండే (బి) హర్‌ప్రీత్ 0; ప్రవీణ్ దూబే (బి) ఎలిస్ 16; కుల్దీప్ యాదవ్ నాటౌట్ 10; ముకేశ్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 136. వికెట్ల పతనం:** 1-69, 2-74, 3-81, 4-86, 5-86, 6-88, 7-118, 8-123. **బౌలింగ్:** రిషీ ధావన్ 1-0-10-0, స్యామ్ కరన్ 2-0-18-0, హర్‌ప్రీత్ 4-0-30-4, ఎలిస్ 4-0-26-2, అర్ష్‌దీప్ 4-0-32-0, రాహుల్ చహర్ 4-0-16-2, సికందర్ రజా 1-0-3-0.

సన్‌రైజర్స్ ఆశలు గల్లంతు!

- సొంతగడ్డపై ఐదో ఓటమి
- 'ప్లే ఆఫ్స్' అవకాశాలు దాదాపు దూరం
- 7 వికెట్లతో లక్నో గెలుపు


ప్రేరక్, పూరన్ గెలుపు సంబరం


ప్రేరక్

ఉప్పల్ పిచ్‌పై 182 పరుగుల స్కోరు మెరుగైందే... బౌలర్లు కూడా సత్తా చాటడంతో 15 ఓవర్లదాకా మ్యాచ్ హైదరాబాద్ చేతుల్లోనే ఉంది. అప్పటికి లక్నో స్కోరు 114/2. ఓవర్‌కు దాదాపు 14 పరుగుల చొప్పున 30 బంతుల్లో 69 పరుగులు కావాలి. అయితే తర్వాతి ఓవరే హైదరాబాద్‌ను ముంచింది. మ్యాచ్ ఫలితాన్నే తారుమారయ్యేలా చేసింది. అభిషేక్ శర్మ వేసిన ఈ ఓవర్లో స్టొయినిస్, పూరన్ కలిసి 5 సిక్సర్లతో పండుగ చేసుకున్నారు. వైడ్‌తో కలిపి 31 పరుగులు రాగా సమీకరణం 24 బంతుల్లో 38 పరుగులుగా మారి లక్నో విజయాన్ని సులువుగా మార్చింది. ఈ ఓటమితో హైదరాబాద్ ప్లేఆఫ్స్ అవకాశాలకు దాదాపు తెర పడినట్లే!

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ అభిమానులకు మళ్లీ నిరాశే ఎదురైంది. సన్‌రైజర్స్‌కు ఇది ఏడో పరాజయం కాగా, ఇందులో ఐదు మ్యాచ్‌ల్ని సొంతగడ్డపైనే ఓడటం గమనార్హం. శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (29 బంతుల్లో 47; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 37 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన లక్నో 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రేరక్ మన్కడ్ (45 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, నికోలస్ పూరన్ (13 బంతుల్లో 44 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) దంచేశాడు.

ధాటిగా ఆడినా...

పవర్‌ప్లేలోనే సన్‌రైజర్స్ 2 కీలక వికెట్లను కోల్పోయినా పరుగుల ధాటి మాత్రం కొనసాగింది. అన్‌మోల్‌ప్రీత్ (27 బంతుల్లో 37; 7 ఫోర్లు), మార్క్‌రమ్ (20 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) స్కోరు బోర్డును పరుగెత్తించారు. అయితే కృనాల్ పాండ్యా వరుస బంతుల్లో మార్క్‌రమ్, ఫిలిప్స్ (0)లను అవుట్ చేసి ఇన్నింగ్స్ వేగానికి కళ్లెం వేశాడు. అనంతరం క్లాసెన్, సమద్‌లు సిక్సర్లతో విరుచుకుపడి బలమైన స్కోరుకు బాట వేశారు.

ఆ ఓవర్‌తోనే తారుమారు!

పిచ్ సహకారంతో, సొంతగడ్డ అనుకూలతలతో ఆరంభంలో హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. కైల్ మేయర్స్ (2) విఫలం కాగా, డికాక్ (19 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్), ప్రేరక్ కలిసి జట్టును ఆదుకున్నారు. 15వ ఓవర్ పూర్తయ్యేసరికి లక్నో చేసింది 114/2 స్కోరే. తర్వాతి ఓవర్‌ను అభిషేక్‌కు అప్పగించడంతో మ్యాచ్ సీనే మారిపోయింది. 2 సిక్స్‌లు కొట్టిన స్టొయినిస్ (25 బంతుల్లో 40; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మూడో బంతికి అవుటైతే... పూరన్ వచ్చి 3 బంతుల్నీ సిక్సర్లుగానే మలిచాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్‌మోల్‌ప్రీత్ (సి అండ్ బి) మిశ్రా 36; అభిషేక్ (సి) డికాక్ (బి) యుధ్‌వీర్ 7; త్రిపాఠి (సి) డికాక్ (బి) యశ్ 20; మార్క్‌రమ్ (స్టంప్డ్) డికాక్ (బి) కృనాల్ 28; క్లాసెన్ (సి) మన్కడ్ (బి0 అవేశ్ 47; ఫిలిప్స్ (బి) కృనాల్ 0; సమద్ నాటౌట్ 37; భువనేశ్వర్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-19, 2-56, 3-82, 4-115, 5-115, 6-173. **బౌలింగ్:** యుధ్‌వీర్ 3-0-24-1, మేయర్స్ 1-0-11-0, కృనాల్ పాండ్యా 4-0-24-2, అవేశ్ 2-0-30-1, యశ్ ఠాకూర్ 4-0-28-1, అమిత్ మిశ్రా 4-0-40-1, రవి బిష్ణోయ్ 2-0-23-0.

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) మార్క్‌రమ్ (బి) ఫిలిప్స్ 2; డికాక్ (సి) అభిషేక్ (బి) మార్కండే 29; ప్రేరక్ నాటౌట్ 64; స్టొయినిస్ (సి) సమద్ (బి) అభిషేక్ 40; పూరన్ నాటౌట్ 44; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) 185. వికెట్ల పతనం:** 1-12, 2-54, 3-127. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-30-0, ఫారుఖీ 3.2-0-32-0, ఫిలిప్స్ 2-0-10-1, నటరాజన్ 4-0-31-0, మార్కండే 3-0-39-1, అభిషేక్ 3-0-42-1.

మైదానంలోకి 'బోల్ట్'



ఉప్పల్ మ్యాచ్‌లో ప్రేక్షకుల అనుచిత ప్రవర్తన కారణంగా కొద్ది సేపు ఆటకు అంతరాయం కలిగింది. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో అవేశ్ వేసిన 19వ ఓవర్ మూడో బంతిని ఎత్తు కారణంగా అంపైర్ నోబాల్‌గా ప్రకటించాడు. దీనిపై లక్నో రివ్యూ కోరగా, సుదీర్ఘ సమయం తీసుకున్న థర్డ్ అంపైర్ అది 'సరైన బంతి' అంటూ వారికి అనుకూలంగా తీర్పిచ్చాడు. అదే ఓవర్లో బౌండరీ వద్ద లక్నో ఫీల్డర్లు ప్రేక్షకుల ప్రవర్తనపై ఫిర్యాదు చేయడంతో ఆట ఆగిపోయింది. ఒక ప్రేక్షకుడు కుర్చీకి ఉండే నట్ బోల్ట్‌ను మైదానంలోకి విసిరాడు. ఆ బోల్ట్ ప్రేరక్ తలకు తగిలింది. దాంతో లక్నో సహాయక సిబ్బంది కూడా మైదానంలోకి వెళ్లి తమ అసంతృప్తిని వ్యక్తం చేసింది. అంపైర్లు వెతికి చూడగా గ్రౌండ్‌లో ఆ ఇనుప బోల్ట్ కనిపించింది. పోలీసులు స్టాండ్స్‌లోకి వెళ్లి విచారించినా ఆ వ్యక్తిని గుర్తించలేకపోగా, కొద్ది సేపటికి ఆట మళ్లీ మొదలైంది. **నోబాల్ విషయంలో అంపైర్లపై బహిరంగ నిరసన వ్యక్తం చేసిన క్లాసెన్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా పడింది.**

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	12	8	4	0	16	0.761
చెన్నై	12	7	4	1	15	0.493
ముంబై	12	7	5	0	14	-0.117
లక్నో	12	6	5	1	13	0.309
రాజస్తాన్	12	6	6	0	12	0.633
పంజాబ్	12	6	6	0	12	-0.268
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
హైదరాబాద్	11	4	7	0	8	-0.471
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × బెంగళూరు (మ. గం. 3:30 నుంచి)
చెన్నై × కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'ధోని ఇలాగే కొనసాగాలి'

(సునీల్ గావస్కర్)

క్రికెట్ అనిశ్చితికి మారుపేరు కాగా, టి20ల్లో ఇది మరీ ఎక్కువ. గత సీజన్‌లో చివరి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ సారి టాప్-3లో ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఆరంభంలో సరిగా స్టార్ట్ కాని కారు ఇంజన్ తరహాలో ఉండే ముంబై ఇండియన్స్ ఇప్పుడు అందరికంటే ముందుగా క్వాలిఫై అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెరుగ్గా మొదలు పెట్టినా మధ్యలో స్పీడ్ బ్రేకర్లతో కాస్త ఇబ్బంది పడ్డ చెన్నై కూడా అగ్రస్థానంలో నిలవవచ్చు. గుజరాత్‌పై ముంబై గెలవడం కూడా ఆ జట్టుకు మేలు చేసింది.

కోల్‌కతాపై గెలిచి ఇదే జోరు కొనసాగిస్తే చెన్నై టాప్‌కు చేరవచ్చు. యువ యశస్వి చేతిలో కోల్‌కతా పూర్తిగా చిత్తయింది. ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ మాత్రమే అతను శతకం పూర్తి చేసుకుంటే అదో అద్భుతమయ్యేది. యశస్వి సెంచరీ పూర్తి కాకుండా ఉండేందుకు కోల్‌కతా బౌలర్ ఒకరు ఉద్దేశపూర్వకంగా వైడ్ బాల్ వేసేందుకు ప్రయత్నించడం ఆ జట్టు పరిస్థితిని చూపిస్తోంది. ఆ విషయాన్ని సదరు బౌలర్‌కు ఎవరైనా చెప్పి ఉంటారని ఆశిస్తున్నా. సరైన ఆరంభాలు లభించకపోవడం కోల్‌కతా సమస్య కాగా, వారి వైఫల్యంతో మిడిలార్డర్‌పై తీవ్ర ఒత్తిడి పడుతోంది. మిడిల్‌లో చెన్నై స్పిన్నర్లు వారిని కట్టడి చేయగలరు. చెన్నై వెలుగులోకి తెచ్చిన పతిరణ స్లాగ్ ఓవర్లలో తన విభిన్న శైలి బౌలింగ్‌తో చెలరేగుతున్నాడు. ప్రతీసారి చెన్నైకి రుతురాజ్, కాన్వే శుభారంభాలు అందిస్తున్నారు. శివమ్ దూబేను సీఎస్‌కే సమర్థంగా వాడుకోగలిగింది. సాధారణ ఆటగాళ్లనుంచి కూడా స్థాయికి మించిన ప్రదర్శన రాబట్టడం ధోని కెప్టెన్సీ గొప్పతనం. స్వయంగా తానే ఆకట్టుకునే సిక్సర్లు బాది అందరినీ అలరిస్తున్నాడు. ధోని జోరు ఈ సీజన్‌కే పరిమితం కారాదని ఆశిద్దాం.



సినిమా


● శ్రీనివాసా చిట్టూరి, వెంకట్ ప్రభు, నాగచైతన్య, కృతీ శెట్టి

ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ - నాగచైతన్య

''రొటీన్‌గా కాకుండా కొత్తగా చేయాలని 'కస్టడీ' చేశాను'' అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో నాగచైతన్య మాట్లాడుతూ– ''కస్టడీ'కి మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ లభిస్తోంది. మేం నమ్మి చేసిన అండర్‌వాటర్ యాక్షన్ సీన్, పోలీస్ స్టేషన్‌లో సింగిల్ షాట్ ఫైట్, ట్రైన్ ఫైట్, ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే ఓ సీన్‌కి మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు. ''ఈ చిత్రంలో నేను చేసిన రేవతి పాత్రకు మంచి స్పందన వస్తున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు కృతీ శెట్టి. ''వందశాతం మా కష్టం ఫలించిందని అనుకుంటున్నాను'' అన్నారు వెంకట్ ప్రభు. ''కస్టడీ' బ్లాక్‌బస్టర్ అయినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు శ్రీనివాసా చిట్టూరి.


● రామ్

బర్త్‌డేకి థండర్

''ఫస్ట్ థండర్ రానుంది.. రెడీగా ఉండండి' అంటూ రామ్ నటిస్తున్న తాజా చిత్రం గురించి యూనిట్ పేర్కొంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా రామ్ పుట్టినరోజు (మే 15) సందర్భంగా ఈ సినిమా నుంచి 'ఫస్ట్ థండర్' పేరుతో ప్రత్యేకంగా ఓ అప్‌డేట్ ఇవ్వనున్నట్లు ప్రకటించి, శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్‌గా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. దసరా సందర్భంగా అక్టోబర్ 20న అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రామ్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే, సమర్పణ: జీ స్టూడియోస్, పవన్‌కుమార్.



అది నాకు బోనస్ - సంతోష్ శోభన్

''గోల్కొండ హైస్కూల్' (2011) చిత్రంలో చైల్డ్ ఆర్టిస్టుగా నటించాను. ఈ సినిమాలోని నా పెర్ఫార్మెన్స్ నాకు చాలా అవకాశాలు తెచ్చిపెడుతుందనుకున్నాను. కానీ అలా జరగలేదు. ఆ తర్వాత మరి కొన్ని సినిమాలు చేసినా దాదాపు నాలుగేళ్లు నాకు అవకాశాలు దక్కలేదు. ఆ తర్వాత వచ్చిన అవకాశాలు, కొన్ని కథలు కరెక్ట్ అని భావించి కొన్ని సినిమాలు చేశాను. అవి వర్కౌట్ కాలేదు. ఇక నా కెరీర్ పరంగా 'అన్నీ మంచి శకునములే' చిత్రం మంచి బిగ్‌స్క్రీన్ మూవీగా నిలుస్తుందని భావిస్తున్నాను'' అని అన్నారు సంతోష్ శోభన్. నందినీ రెడ్డి దర్శకత్వంలో సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. స్వప్నామూవీస్, మిత్రవిందా మూవీస్‌తో కలిసి ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో రిషి పాత్రలో కనిపిస్తాను. 'అలా..మొదలైంది' చూసి నందినీరెడ్డిగారితో ఓ సినిమా చేయాలనుకున్నాను. అలాగే ఓ యాక్టర్‌గా నాకు తొలి అడ్వాన్స్ చెక్ ఇచ్చింది ప్రియాంకా దత్‌గారు. ఇలా.. వీరి కాంబినేషన్స్‌తో నా కెరీర్‌కు కావాల్సిన టైమ్‌లో 'అన్నీ మంచి..' లాంటి సినిమా వస్తుండటం లక్‌గా భావిస్తున్నాను. ఇక ఈ సినిమా అవుట్‌పుట్ బాగా రావడం నాకు బోనస్'' అన్నారు.

నేడు మదర్స్ డేని పురస్కరించుకుని శోభన్ మాట్లాడుతూ – ''నేను ఇండస్ట్రీకి వచ్చి 13 ఏళ్లవుతోంది. నటుడిగా నాకు అవకాశాలు తగ్గినప్పుడు అమ్మ నమ్మకమే నాకు ధైర్యాన్ని ఇచ్చింది. ఆ ధైర్యంతోనే నేను సినిమాలు చేస్తున్నాను. మాకు సొంత ఇల్లు లేదు. త్వరలోనే మా అమ్మకు సొంత ఇంటిని గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నాను'' అన్నారు.



ఇక సినిమాలకు అంకితం - మురళీమోహన్

'నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయ్యాయి. 1973 మార్చిలో నా సినిమా ('జగమే మాయ') షూటింగ్ మొదలైంది. నన్ను హీరోగా పరిచయం చేసిన అట్లూరి పూర్ణచంద్రరావు, పీవీ సుబ్బారావుగార్లకు నా కృతజ్ఞతలు'' అన్నారు నటుడు మురళీమోహన్. చిత్రపరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మురళీమోహన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ– ''ఓ 15 ఏళ్లు ఇండస్ట్రీలో ఉంటాననుకున్నాను. అందరి సహకారానికి అదృష్టం తోడవ్వడంతో 50 ఏళ్లు ఉండగలిగాను. తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వెళ్లినందు వల్ల పదేళ్లు సినిమాలకు బ్రేక్ వచ్చింది. ఇక పూర్తిగా సినిమాలకు అంకితమవ్వాలనుకుంటున్నాను. నేను అక్కినేని నాగేశ్వరరావుగారి ఫ్యాన్‌ని. చనిపోయేంతవరకు సినిమాల్లో నటిస్తుంటానని, ఆ మాటను నిజం చేశారాయన. ఏయన్నార్‌గారి స్ఫూర్తితో ఇక నటనకే అంకితం అవుతాను'' అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా 'మిథునం' చిత్ర సంగీత దర్శకుడు వీణాపాణి రాసిన 'అమ్మే దైవం' పాట వీడియోను రిలీజ్ చేశారు మురళీమోహన్.

మా అమ్మగారు సూపర్ ఉమన్ - శ్రీలీల


● తల్లి స్వర్ణలతతో శ్రీలీల

''నేనెక్కడ ఉంటే మా అమ్మకు అదే ఫేవరెట్ ప్లేస్. మా అమ్మకి నేనంటే ఎంత ప్రేమో చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం ఉంటుంది? ఇంటిని బాగా చూసుకోవడంతో పాటు ఇతరులకు సహాయం చేయడం అమ్మకు ఇష్టం. మా అమ్మ బెస్ట్ పర్సన్'' అన్నారు శ్రీలీల. 'పెళ్లి సందడి'తో తెలుగుకి పరిచయం అయిన ఈ కన్నడ బ్యూటీ ప్రస్తుతం చేతిలో అరడజనకు పైగా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. నేడు 'మాతృదినోత్సవం' సందర్భంగా తన తల్లి స్వర్ణలత గురించి 'సాక్షి'తో ప్రత్యేకంగా శ్రీలీల షేర్ చేసుకున్న విషయాలు ఈ విధంగా..

● మా అమ్మగారు చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు. అలానే ఆమెకి చాలా ఓర్పు ఎక్కువ. నాకు ఎప్పుడు స్వేచ్ఛ ఇవ్వాలో.. ఇవ్వకూడదో ఆమెకు బాగా తెలుసు. అలాగే ఏ విషయంలో స్ట్రిక్ట్‌గా ఉండాలో.. ఉండకూడదో కూడా బాగా తెలుసు. ● నా స్కూల్ డేస్‌లో చాలా బిజీగా ఉండేదాన్ని. స్కూల్ అవ్వగానే డ్యాన్స్ క్లాస్, స్విమ్మింగ్.. ఇలా గడిచిపోయేది. కానీ నాకేమో అల్లరి చేయాలని ఉండేది. అయితే దానికి చాన్స్ ఉండేది కాదు. ఎందుకంటే మా అమ్మ కళ్లన్నీ నా మీదే ఉండేవి. ● తిండి విషయంలో చిన్నప్పుడు నేను చాలా నిర్లక్ష్యంగా ఉండేదాన్ని. స్కూల్‌కి వెళ్లేటప్పుడు అమ్మ ఇచ్చిన లంచ్ బాక్స్ ఇంట్లో సోఫా వెనకాల్లో, కారు సీటులోనో దాచేసేదాన్ని. తినడానికి ఇష్టపడక అలా చేసేదాన్ని. ● ఇక నా విషయాలను నేను హ్యాండిల్ చేయగలననే నమ్మకం కుదిరాక మా అమ్మ నాకు స్వేచ్ఛ ఇవ్వడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా అమ్మ నాకు మంచి ఫ్రెండ్‌లా అయిపోయారు. ఎప్పుడైతే మా అమ్మ నాకు ఫ్రెండ్‌లా అయ్యారో అప్పట్నుంచి అన్నీ ఆమెతో షేర్ చేసుకుంటున్నాను. రాత్రిపూట జోక్స్ చెప్పుకోవడం, రిలాక్స్ అవ్వడం.. డ్యాన్స్ చేయడం... వాట్ నాట్.. మేం చాలా బాగా టైమ్ స్పెండ్ చేస్తాం. తన కూతురు కావడం నా లక్. ● మా అమ్మగారు మల్టీ టాస్కర్. అందుకే తనకి రెస్ట్ ఇవ్వాలని అనుకుంటుంటాను. అదే విషయం ఆమెతో చెబితే ఒత్తిడికి గురవుతారు. ఎందుకంటే అమ్మకు ఖాళీగా ఉండటం ఇష్టం ఉండదు. ఏదో పని పెట్టుకుని, ఆ పని పూర్తి చేసేంతవరకూ ప్రశాంతంగా ఉండరు. ● మా అమ్మగారు డాక్టర్. పేషెంట్లతో ఎప్పుడూ ఫుల్ బిజీ. కొన్నేళ్ల పాటు అవిడ డాక్టర్‌గా సర్వీస్ చేశారు. పైగా శ్రద్ధగా చేయడంతో ఎందరో పేషెంట్స్ ఆమెతో చాలా సన్నిహితంగా ఉండేవారు. చాలా గౌరవించేవారు. ఇవన్నీ స్వయంగా చూసిన నాకు మా అమ్మంటే చాలా గౌరవం.. గర్వం.. స్ఫూర్తి కూడా. నేను ఆవిడ్ని 'సూపర్ ఉమన్' అంటాను. ఆవిడ సెమినార్స్‌లో పాల్గొన్నప్పుడు నేను చాలా ఆరాధనగా చూసేదాన్ని. ఆవిడకున్న నాలెడ్జ్ సూపర్. ● మా అమ్మ నాలో భాగం. నా కెరీర్‌లోనూ ఆమె సగ భాగం. చాలా అర్థం చేసుకుంటారు. నా కెరీర్‌కి ఎంత హెల్ప్ చేయాలో అంతా చేస్తారు. నేనివాళ ఇంత బిజీగా సినిమాలు చేయగలుగుతున్నానంటే ఆమె సపోర్ట్ కారణం. ● ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు 'వాట్ నెక్ట్స్' అంటారామె. కొంచెం కూడా బాధపడరు. నేనేమో 'సెన్సిటివ్'. చిన్న విషయాలకు కూడా బాధపడిపోతుంటాను. నేను ఆ బాధ మరచిపోయేలా ఆమె కౌన్సిలింగ్ ఇస్తారు. అమ్మ స్పిరిచ్యువాలిటీ పర్సన్. ప్రతిరోజూ దేవుడిని పూజిస్తుంటారు. ఆ పూజలు నాకు ధైర్యాన్నిస్తాయి. ఆవిడ ఆశీర్వాదం తీసుకున్నప్పుడు నా ధైర్యం రెట్టింపు అవుతుంది. ● 'మదర్స్ డే'కి మా అమ్మ కోసం స్పెషల్‌గా ఒకటి ప్లాన్ చేశాను. అది సీక్రెట్.

ఏడు భాషల్లో...


● శశిధర్, శ్రేయాస్, రాధికా, రవి రాజ్

బాలీవుడ్ యాక్టర్ శ్రేయాస్ తల్పడే హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'అజాగ్రత్త'. రాధికా కుమారస్వామి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎం. శశిధర్ దర్శకత్వంలో రవి రాజ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం శనివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత ఠాగూర్ మధు కెమెరా స్విచ్చాన్ చేయగా, ఏఎం రత్నం క్లాప్ ఇచ్చారు. శ్రేయాస్ తల్పడే మాట్లాడుతూ– ''ప్రేక్షకులకు నచ్చేలా 'అజాగ్రత్త' సినిమాను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు. ''ఈ సినిమాను ఏడు భాషల్లో తెరకెక్కిస్తున్నాం'' అన్నారు ఎం. శశిధర్. ''నేను నిర్మాతగా ఉండాల్సిన ఈ సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నాను. స్క్రిప్ట్ విని షాక్ అయ్యాను. అంత నచ్చింది'' అన్నారు రాధికా కుమారస్వామి. రావు రమేశ్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: శ్రీహరి, సహనిర్మాత: యాదవ్.

శాపానికి గురైతే...


● కౌశిక్, యశ్, అపూర్వ రావు, అనిల్ పల్లాల

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో సిల్లీ మాంక్స్, హామ్స్ టెక్ ఫిల్మ్స్ పతాకాలపై అనిల్ పల్లాల నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ''నా నిగ్రహాన్ని పరీక్షించుకోవడానికి వస్తే నా పరువు తీస్తావా. ఇక నీకు మిగిలింది నిగ్రహమే', 'బాబా శాపం ఇచ్చాడా?' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. టీజర్ రిలీజ్ సందర్భంగా హీరో యశ్ మాట్లాడుతూ– ''ఇది నాకు మూడో సినిమా. పిల్లాడి నుంచి వ్యక్తిగా మారే కథే ఈ చిత్రం'' అన్నారు. ''మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ ఇది'' అన్నారు కౌశిక్. ''సినిమా బాగా వచ్చింది. ఆడియన్స్‌కు నచ్చుతుంది'' అన్నారు అనిల్. ''ఒంగోలులో పుట్టి గుజరాత్, గల్ఫ్‌లో పెరిగాను. స్టడీస్ తర్వాత హైదరాబాద్ వచ్చాను. ఇది నా తొలి చిత్రం'' అన్నారు అపూర్వ. ''ఈ జనరేషన్‌లోని అబ్బాయి ఓ బాబా శాపానికి గురైతే అతని పరిస్థితి ఏంటి? అన్నదే ఈ సినిమా కథ'' అన్నారు కెమెరామేన్ అశోక్.

కొత్త వారితో మేమ్ ఫేమస్



● సార్య, సుమంత్ ప్రభాస్, శరత్ చంద్ర, చంద్రు మనోహర్, అనురాగ్

సుమంత్ ప్రభాస్, మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాసి, నరేంద్ర రవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ దర్శకత్వంలో ఛాయ్ బిస్కెట్, లహరి ఫిలింస్ పతాకాలపై శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ సినిమా టీజర్, 'అయ్యయయ్యో..' పాటను ప్రదర్శించారు. అనంతరం ఈ చిత్ర హీరో, దర్శకుడు సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ– ''మా సినిమా ప్రమోషన్స్‌కు ప్రముఖ హీరోలంతా హెల్ప్ చేస్తుండటంతో నాకు మంచి పేరు వచ్చింది. అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''18 ఏళ్ళకే టిక్ టాక్‌లు చేసిన సుమంత్ 23 ఏళ్ళకే డెరైక్టర్ అయ్యాడు. అంతా యూత్ చేసిన సినిమా ఇది. ఆడియన్స్‌కు నచ్చుతుంది'' అన్నారు అనురాగ్ రెడ్డి. ''ఈ సినిమాతో 30 మందికిపైగా నటీనటులను పరిచయం చేయడం గర్వంగా వుంది'' అన్నారు 'లహరి ఫిలింస్' చంద్రు మనోహర్. ''వైజాగ్‌లో అన్నపూర్ణ స్టూడియోస్, రెండు రాష్ట్రాల్లో మిగిలిన ప్రాంతాల్లో గీతా ఆర్ట్స్, ఓవర్‌సీస్‌లో సరిగమల ద్వారా మా సినిమా విడుదలవుతుంది'' అన్నారు శరత్ చంద్ర.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 52
ఆదివారం 14-5-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

SUNDAY Special



ఎవరెస్ట్ ఎక్కించిన తెలుగుపాఠం..
తొమ్మిదో తరగతి తెలుగు పాఠంలో హిమాలయాల సౌందర్యాన్ని విన్న ఓ సీపీ పెద్దయ్యాక తన కోరిక నెరవేర్చుకునేందుకు ఏకంగా హిమాలయాలను అధిరోహించారు. - 14లో



ప్రపంచ దేశాల మూన్‌రేస్!
అకస్మాత్తుగా అనేక దేశాల దృష్టి చందమామపై పడింది. అమెరికా నుంచి సౌదీ అరేబియా వరకు అనేక దేశాలు జాబిలిపై ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నాయి. - వివరాలు 14లో



12 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత
కేరళ తీరంలోని భారత సముద్ర జలాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. - వివరాలు 14లో



36 వేల టీచర్ల నియామకం రద్దు
బెంగాల్‌లో నిబంధనావళి ఉల్లంఘించి ఉద్యోగాలు పొందిన 36వేల మంది ఉపాధ్యాయుల నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. - వివరాలు 14లో



ఉక్రెయిన్‌కు జర్మనీ భారీ సాయం
ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులుసహా సుమారు రూ.24 వేల కోట్ల విలువైన అదనపు సైనిక సాయం అందించాలని జర్మనీ నిర్ణయించింది. - వివరాలు 7లో



మోకా తుపాను.. బంగ్లా హై అలర్ట్
శక్తివంతమైన మోకా తుపాను ఆదివారం బంగ్లాదేశ్‌-మయన్మార్‌ సరిహద్దులకు సమీపంలో తీరాన్ని తాకే అవకాశాలున్నాయి. - వివరాలు 14లో

కన్నడ సీమలో చేతికే ఫుల్ పవర్


అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం.. 224 స్థానాల్లో ఏకంగా 136 హస్తగతం

65 సీట్లతో బీజేపీకి దారుణ ఓటమి.. ఆ పార్టీ చేజారిన ఏకైక దక్షిణాది రాష్ట్రం

పుట్టి ముంచిన ప్రభుత్వ వ్యతిరేకత.. పని చేయని మోదీ మేజిక్

14 మంది మంత్రుల పరాజయం.. కేవలం 19 సీట్లతో కుదేలైన జేడీ(ఎస్)

మొత్తం స్థానాలు 224 | మెజారిటీకి కావాల్సింది 113





➤ బొమ్మై ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత ముందు మోదీ మేజిక్ పని చేయలేదు. హిందుత్వ కార్డు, రిజర్వేషన్ రాజకీయాలు, బజరంగ్‌బలీ నినాదాలు ఓట్లు రాల్చలేదు. ఫలితంగా కర్ణాటకలో అధికార పార్టీ ఇంటిబాట పట్టే నాలుగు దశాబ్దాల ఆనవాయితీ ఈసారీ కొనసాగింది. కాంగ్రెస్ పార్టీకి రాహుల్ జోడో యాత్ర జోష్, మల్లికార్జున మంత్రాంగం, రాష్ట్ర నేతల సమష్టి కృషి కలిసొచ్చాయి. ఫలితంగా కన్నడ సీమ కాంగ్రెస్ హస్తగతమైంది. హంగ్ ఊహాగానాలకు, హోరాహోరీ తప్పదన్న విశ్లేషణలకు చెక్ పెడుతూ ఏకంగా 136 స్థానాలను కైవసం చేసుకుంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సొంతంగా స్పష్టమైన మెజారిటీ సాధించింది. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీపై విపక్షాల ఉమ్మడి పోరుకు నేతృత్వం వహించేందుకు నైతిక బలాన్ని కూడగట్టుకుంది. బీజేపీ కేవలం 65 స్థానాలకు పరిమితమై పరాజయం చవిచూసింది. 2018తో పోలిస్తే తగ్గింది కేవలం 0.2 శాతం ఓట్లే అయినా ఏకంగా 39 సీట్లు కోల్పోయింది! ఈ ఓటమితో దక్షిణాదిన ఏకైక రాష్ట్రం కూడా కమలం పార్టీ చేజారింది. ఇక ఇంటి పోరుతో చీకాకు పడిన జేడీ(ఎస్) కేవలం 19 సీట్లతో చతికిలపడింది. ఈ గెలుపుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి... - 6లో




సిద్ధు, శివకుమార్.. ఇద్దరిలో సీఎం ఎవరో!
- నేడు సీఎల్పీ భేటీలో ఎంపిక
- అధిష్టానానిదే తుది నిర్ణయం
- డీకేకు పెద్దల ఆశీస్సులు.. సిద్ధూ కు పార్టీ నేతల మద్దతు

6 లో

ప్రేమ విపణి తెరుచుకుంది: రాహుల్



విద్వేషంపై ప్రేమ విజయం సాధించిందని కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో 'జోష్'
- కర్ణాటకలో విజయంతో టీపీసీసీ నేతల్లో ఉత్సాహం
- కర్ణాటకలో రాహుల్ జోడో యాత్ర నిర్వహించిన 20 స్థానాల్లో 15 చోట్ల గెలుపు
- తెలంగాణలోనూ కన్నడ ప్రభావం ఉంటుందనే అంచనా

- వివరాలు 2లో

అభివృద్ధి, అభ్యర్థులకే కన్నడ ఓటరు పట్టం
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ విశ్లేషణ
- బీజేపీ వైఫల్యాలు, విద్వేష ఎజెండాను తిరస్కరించారనే భావన
- తెలంగాణలోనూ బీజేపీ ఎజెండాకు ఆదరణ దక్కదనే లెక్కలు

తెలంగాణపై కర్ణాటక ఫలితాల ప్రభావం ఉండదు: మంత్రి కేటీఆర్

- వివరాలు 8లో

కమలం శ్రేణులు డీలా!
- కన్నడ ఓటరు ప్రతికూల తీర్పుతో నైరాశ్యం - 2లో
- ఫలితాల ట్రెండ్ వెలువడ్డాక బోసిపోయిన బీజేపీ కార్యాలయం

న్యూస్‌రీల్

16న సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభ



సీఎం కేసీఆర్ రాష్ట్ర నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడమేకాక ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ ఆనందం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాలు తీసుకున్న సీఎంను అభినందించేందుకు 16న ధన్యవాద సభ నిర్వహించాలని నిర్ణయించింది.

- వివరాలు 8లో

హైకోర్టు చెప్పినా అంతేనా!



ఆర్టీసీ నుంచి సీసీఎస్ నిధులు ఇప్పించాలని సీసీఎస్ అధికారులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించే మొత్తాన్ని యథావిధిగా సీసీఎస్‌కు చెల్లించాలని హైకోర్టు ఆర్టీసీని ఆదేశించింది. చెల్లించాల్సిన మొత్తం రూ. 18 కోట్లు ఉండగా, హైకోర్టు చెప్పినప్పటికీ సంస్థ మాత్రం ఐదారు కోట్లకు మించి కట్టడం లేదు.

- వివరాలు 14లో

జేపీఎస్‌ల సమ్మె విరమణ
- రేపటి నుంచి విధుల్లోకి,..
- ప్రకటించిన జేపీఎస్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్
- అంతకుముందు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లితో భేటీ
- సీఎం తమ హామీలు నెరవేరుస్తారనే నమ్మకం ఉందన్న సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్/తొర్రూరు: జూనియర్/ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్/ఓపీఎస్) నిరవధిక సమ్మెను విరమించారు. తమ డిమాండ్ల సాధనకు 16 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు శనివారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తారనే సంపూర్ణ విశ్వాసం ఉందని, ఆ ధీమాతోనే సమ్మెను విరమిస్తున్నట్లు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె శ్రీకాంత్‌గౌడ్, ఇతర జిల్లాల నాయకులతో కలిసి మహబూబాబాద్ జిల్లా మిగతా 5వ పేజీలో ▶

తెలంగాణ ఘనకీర్తిని దశదిశలా చాటేలా...



రాష్ట్ర అవతరణ దశాబ్ది సంబురాలు
- జూన్ 2 నుంచి 21 రోజులపాటు ఉత్సవాలు
- తొలిరోజు సీఎం ఆధ్వర్యంలో సచివాలయంలో ఉత్సవాల ప్రారంభం
- అదేరోజు మంత్రుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లోనూ వేడుకలు
- అమరవీరుల సంస్మరణకు ఒకరోజు మార్టియర్స్ డే నిర్వహణ
- ఉత్సవాల నిర్వహణపై సమీక్షలో సీఎం కేసీఆర్ నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తూ పదో వసంతంలోకి అడుగిడుతున్న వేళ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఉత్సవాల నిర్వహణపై శనివారం సచివాలయంలో సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ ఘనకీర్తిని దశదిశలా చాటేలా, ప్రతి హృదయం ఉప్పొంగేలా మిగతా 8వ పేజీలో ▶

భారత్‌కు తెలంగాణ మోడల్ అవసరం
- దేశం సహజ వనరులు, అద్భుత మానవ వనరులకు నిలయం
- చైనా 30 ఏళ్లలో చేసేదాన్ని.. 20 ఏళ్లలోనే సాధించే సత్తా భారత్‌కు ఉంది
- సరైన దిశలో వెళ్తే వచ్చే 20 ఏళ్లలో తలసరి ఆదాయం 8 రెట్లకు పెరుగుతుంది
- లండన్ 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సులో మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తొమ్మిదేళ్లలోనే వ్యవసాయ, అనుబంధ రంగాలతోపాటు సమగ్రాభివృద్ధి సాధించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. ఈ తరహా నమూనా దేశానికి అవసరమని అన్నారు. లండన్ పర్యటనలో ఉన్న కేటీఆర్ శనివారం అంతర్జాతీయ సలహా సంస్థ ఈపీజీ, బ్రిడ్జి ఇండియా సంయుక్త భాగస్వామ్యంలో జరిగిన మిగతా 3వ పేజీలో ▶

ఇవాళ్టి కార్టూన్



పవన్ శ్వాస, ధ్యాస బాబే

బాబు చేత.. బాబు వల్ల.. బాబు కోసం



చంద్రబాబు బాటలోనే పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణం
టీడీపీ అధినేత ఆదేశిస్తే.. పవన్ ఆచరిస్తాడంతే
పదేళ్ల రాజకీయ జీవితమంతా బాబుకు జీ హుజూర్
ప్రజలు వాస్తవాలు గమనించాలని మంత్రి అంబటి బహిరంగ లేఖ

- ఒక రాజకీయ పార్టీ ఎలా వ్యవహరించకూడదో చెప్పాలంటే 'జనసేన'ను మించిన ఉదాహరణ మరొకటి దొరకదు. ఒక నాయకుడు ఎలా ఉండకూడదో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను చూపిస్తే చాలు. ఎదగాలన్న కసి, లక్ష్యం ఏ కోశానా కనిపించవు. కేడర్‌ను కూడగట్టుకుని పార్టీని బలోపేతం చేద్దామన్న ఆలోచనే రాదు. టీడీపీని బలోపేతం చేయాలన్న తపన మాత్రం పవన్ ప్రతి అడుగులోనూ స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు–పవన్ కల్యాణ్ బంధం ప్రేమ జంటను మరిపిస్తోంది. నాడు విడివిడిగా పోటీ చేసినా, నేడు కలిసి పోటీ చేయాలనుకుంటున్నా అంతిమ లక్ష్యం బాబుకు మేలు జరగాలన్నదే. 'మాది వన్ సైడ్ లవ్' అంటూ మొన్న చంద్రబాబు బాధ పడిపోవడం చూడలేక పవన్.. అన్నీ వదిలేసి.. నమ్ముకున్న వారిని గంగలో ముంచి.. ఆయన వేలు పట్టుకుని నడవడానికి పడుతున్న పాట్లు చూస్తుంటే రాజకీయ విశ్లేషకులు సైతం విస్తుపోతున్నారు. ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు.. పవన్‌తీరును తీవ్రంగా తప్పు పడుతూ, ఆయన ఎత్తులు, జిత్తులు గమనించాలని కోరుతూ ప్రజలకు లేఖ రాశారు.

పవన్ రాజకీయం చంద్రబాబు కోసమే.. - లేఖ పూర్తి పాఠం 12వ పేజీలో

క్లుప్తంగా...

దేశమంతా ఇదే తీర్పు: శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కర్ణాటక ఇన్‌చార్జిగా పనిచేయడం తనకు తృప్తినిచ్చిందని 'సాక్షి'కి తెలిపారు. తమ పార్టీ నేతల శ్రమకు తగిన ఫలితం దక్కిందని, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీల పర్యటనలు, పార్టీపై ప్రజలకున్న నమ్మకం, నేతల సమష్టి ప్రయత్నాలు ఇక్కడ కాంగ్రెస్‌కు విజయాన్ని చేకూర్చి పెట్టాయన్నారు. బీజేపీ ఎన్ని విద్వేష రాజకీయాలు చేసినా కర్ణాటక ప్రజలు న్యాయం పక్షాన నిలిచారని తెలిపారు. దేశమంతటా ఈ తరహా తీర్పు వస్తుందని, తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందన్న విశ్వాసాన్ని శ్రీధర్‌బాబు వ్యక్తం చేశారు.

తరువాతి గెలుపు తెలంగాణదే: ఎమ్మెల్సీ వినోద్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ కర్ణాటక తర్వాత గెలిచేది తెలంగాణలోనేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్ జీ.వినోద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఓడించి బీజేపీకి లబ్ధి చేకూర్చాలని బీఆర్ఎస్ చేసిన కుయుక్తులను అక్కడి ప్రజలు తిప్పికొట్టారన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీని ఓడించాలనుకుంటే బీఆర్ఎస్ ప్రత్యక్షంగా ఎన్నికల బరిలోకి ఎందుకు దిగలేదని ప్రశ్నించారు. జేడీఎస్ వెనుక ఉండి.. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కేసీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు.

కర్ణాటక ఫలితాలు యావద్దేశానికి మార్గదర్శకం



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల ఫలితాలు యావత్ భారత దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. మతాల పేరుతో ఓట్లు సంపాదించాలన్న దుర్బుద్ధితో దిగజారి మాట్లాడిన ప్రధానికి ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతం పేరుతో ప్రజల ఆకలి తీరదని స్పష్టం చేశారు.

'కర్ణాటక ప్రజలది తెలివైన తీర్పు'



ఖమ్మం మయూరి సెంటర్: మోదీ ప్రభుత్వ ఆగడాలు గమనించిన కర్ణాటక ప్రజలు తెలివైన తీర్పు ఇచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ, రెజ్లర్ల సంఘం అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఖమ్మంలో శనివారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కర్ణాటక ఫలితాలే దేశమంతా వచ్చేలా మోదీ పాలనపై మరిన్ని ఉద్యమాలు చేపట్టేందుకు సీపీఎం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు.

అన్ని రాష్ట్రాల ఫలితాలు ఒకేలా ఉండవు: జీవీఎల్



సాక్షి, న్యూఢిల్లీ: అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికల ఫలితాలు ఒకేలా ఉండవని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు. కర్ణాటకలో అనుకూల ఫలితాలు రానంత మాత్రాన తెలంగాణలో విజయావకాశాలను కొట్టిపారేయలేమన్నారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి దక్షిణాదిన కొత్త మార్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

బీసీల మద్దతుతోనే కాంగ్రెస్ గెలిచింది: జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీ ఓటర్ల వల్లే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే.. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపడతామని, జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేసిందని, అందుకే బీసీలంతా కాంగ్రెస్‌కు మద్దతు పలికారని తెలిపారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కర్ణాటక ప్రభావం తెలంగాణపై ఉండదు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేస్తాయనుకోవడం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. 2018 ఎన్నికల్లో 36% ఓట్లతో 104 సీట్లు గెలవగా.. ఇప్పుడు కూడా 36%పైగా బీజేపీ ఓట్లు సాధించిందని పేర్కొన్నారు.

కర్ణాటక వ్యూహంతోనే ముందుకు..

తెలంగాణలోనూ గెలుపు వ్యూహాలు రచించేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

- నేతలందరినీ ఒక తాటిపైకి తెచ్చేలా తొలి టాస్క్
- ముందే అభ్యర్థుల ప్రకటన అంశం పరిశీలన
- ప్రభుత్వ అవినీతి, కుటుంబపాలనను ఎండగట్టేలా ప్రణాళిక
- పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ

సాక్షి, న్యూఢిల్లీ: దక్షిణాదిన బీజేపీ కంచుకోటను భారీ మెజారిటీతో బద్దలుకొట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటుపై గురిపెట్టింది. ఇప్పటికే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న హస్తం పార్టీ ఆ దిశగా అడుగులు ప్రారంభించనుంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రజల్లో సానుభూతి, బీఆర్ఎస్ ప్రభుత్వంపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడంతోపాటు కన్నడనాట ఫలించిన వ్యూహాలను కూడా ఉపయోగించాలని అధిష్టానం యోచిస్తోంది. కన్నడ కాంగ్రెస్‌లో కొదమ సింహాలైన డీకే శివకుమార్, సిద్దరామయ్యలను ఒకేతాటిపైకి తెచ్చి పార్టీలో ఐకమత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన విధంగానే తెలంగాణలో నేతలందరినీ ఒకేతాటిపైకి తెచ్చేలా శ్రేణులకు సంకేతాలు పంపుతోంది. సగానికిపైగా అభ్యర్థుల్ని ముందే ప్రకటించడం, రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, కుటుంబపాలన, కుంభకోణాలపై బీఆర్ఎస్‌ను ఎండగడుతూనే పార్టీ మేనిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

పార్టీ శ్రేణుల మధ్య అంతరం లేకుండా...

అంతర్గత కుమ్ములాటలు, పలువురు ముఖ్యమంత్రుల అభ్యర్థులు, నేతల మధ్య ఐకమత్యం లేకపోవడం... ఇదీ కర్ణాటక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు కాంగ్రెస్ పరిస్థితి. ప్రభుత్వ వ్యతిరేకతను క్యాష్ చేసుకోవాలంటే ముందుగా పార్టీ శ్రేణుల మధ్య అంతరం లేకుండా చూసుకోవాలని అధిష్టానం డీకే శివకుమార్, సిద్దరామయ్యలకు సంకేతాలు పంపింది. వేర్వేరు పాదయాత్రలు, వేర్వేరు సభలు పెడుతూ కేవలం పార్టీ మేనిఫెస్టోనే ప్రజల్లోకి తీసుకెళ్లేలా చేసింది. ఎన్నికల తేదీకి ముందుగా ఇద్దరు బడా నేతల్ని ఒకే వేదికపైకి తెచ్చి పార్టీలో ఎలాంటి పొరపొచ్చాలు లేవని సంకేతాలు పంపింది. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ ఐకమత్యం లేకపోవడాన్ని గుర్తించి అధిష్టానం తొలిగా ఈ అంశంపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించింది. సీనియర్లందరికీ వేర్వేరు టాస్కులు అప్పగించి పార్టీ అధికారంలోకి రావడమే ప్రధాన లక్ష్యంగా నిర్దేశం చేయనుంది. ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ఎన్నికల ఫలితాల తర్వాతే ప్రకటించేందుకు సిద్ధమైంది. కుమ్ములాటలను ప్రోత్సహించే నేతలకు ముందుగానే చెక్ పెట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

ప్రభుత్వ అవినీతి.. ఉద్యోగ కల్పన

తెలంగాణలో ప్రభుత్వ అవినీతిని ఎండగట్టాలని, అప్పుడే ప్రత్యామ్నాయ పార్టీగా ముందుకెళ్లొచ్చని అధిష్టానం భావిస్తోంది. ప్రాజెక్టుల పేరిట చేస్తున్న అవినీతిపై ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి వెళ్తుండగా.. దీన్ని మరింత పటిష్టంగా తీసుకెళ్లాలని యోచిస్తోంది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలోనూ బీఆర్ఎస్ నేతల ప్రమేయంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తోంది. తెలంగాణలో కుటుంబ పాలనకు తెర దించి అధికారంలోకి వచ్చేలా శ్రేణులు కష్టపడాలని దిశానిర్దేశం చేయనుంది. తెలంగాణ ఉద్యమానికి కారణమైన అంశాల్లో ఒకటైన ఉద్యోగ కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిందేమీ లేదని, ఈ అంశాన్ని అనుకూలంగా మార్చుకొని మేనిఫెస్టోలో ఉద్యోగ కేలండర్‌ను పొందుపరచాలని భావిస్తోంది.

ముందుగానే ప్రకటన

అభ్యర్థుల ప్రకటన విషయంలోనూ ఒక అడుగు ముందు వేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. కర్ణాటకలో 100 స్థానాలు ప్రకటించినట్లే.. తెలంగాణలోనూ కనీసం 60 స్థానాల్లో ప్రకటించేందుకు సర్వేల ద్వారా నివేదికలు తెప్పించుకుంటోంది. ఏకాభిప్రాయం ఉన్న చోట్ల అభ్యర్థులను ముందుగా ప్రకటించి కదనరంగంలో ముందడుగు తమదేనని శ్రేణుల్లో నూతనోత్తేజం నింపాలని చూస్తోంది. అభ్యర్థుల విషయానికొస్తే ప్రజల్లో గుర్తింపు ఉన్న గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది.

మరింత ఉత్సాహంగా గర్జనలు

తెలంగాణ కాంగ్రెస్ యువ గర్జన, దళిత–గిరిజన గర్జన, రైతు గర్జన అంటూ వేర్వేరు వర్గాలకు చెందిన ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమని చెప్పింది. ఆయా వర్గాలకు అండగా ఉంటామని, అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని చెబుతూ వారికి దగ్గరయ్యే యత్నాలు ప్రారంభించింది. త్వరలోనే మహిళా గర్జన, యువ గర్జన, మైనారిటీ గర్జనలతో మరింతగా ప్రజల్లోకి వెళ్లడానికి సమాయత్తమవుతోంది. అన్ని వర్గాల ప్రజలకు చేదోడువాదోడుగా ప్రభుత్వం ఉంటుందన్న విశ్వాసం నెలకొనేలా మేనిఫెస్టో రూపొందించేలా అధిష్టానం కసరత్తు ప్రారంభించనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో జానారెడ్డి, పొన్నాల, వీహెచ్, మాణిక్‌రావ్ ఠాక్రే, ఉత్తమ్ తదితరులు

ఇక తెలంగాణ మాదే

కర్ణాటక ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతం అవుతాయి

- రాముడిని మోసం చేసిన బీజేపీని బజరంగ్‌బలి ఓడించారు
- భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్‌లో జోష్ వచ్చింది: టీపీసీసీ చీఫ్ రేవంత్
- కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు: నల్లగొండ ఎంపీ ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల్లో విజయం సాధించినట్టుగానే తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ తమదేనని టీపీసీసీ ముఖ్య నేతలు ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో పాటు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, వి. హనుమంతరావు, షబ్బీర్‌అలీ తదితరులు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలోనూ కర్ణాటక ఫలితాలే పునరావృతమవుతాయని ఉద్ఘాటించారు.

మూడో విజయం తెలంగాణలోనే: టీపీసీసీ చీఫ్ రేవంత్

'హిమాచల్ ప్రదేశ్‌లో తొలివిజయం, కర్ణాటకలో రెండో విజయం సాధించాం. మూడో విజయం తెలంగాణలో సాధించబోతున్నాం. ఫైనల్స్‌లో కూడా గెలిచి ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నాం. కర్ణాటక ప్రజలు బీజేపీని ఓడించడం ద్వారా మోదీని, జేడీఎస్‌ను మట్టికరిపించి తద్వారా కేసీఆర్‌ను ఓడించారు. మత రాజకీయాలను ప్రోత్సహించే బీజేపీని తిప్పికొట్టారు. జై శ్రీరామ్‌ను వదిలిపెట్టి జైబజరంగ్‌బలి అంటూ కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం చేసింది. కానీ రాముడినే మోసం చేసిన బీజేపీని ఆ బజరంగ్‌బలినే ఓడించారు. కర్ణాటక ఫలితం మాకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది. దక్షిణాదిలో బీజేపీకి స్థానం లేదని నిరూపించింది. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య తేడా లేదు. మోదీకి, కేసీఆర్‌కు పేరులోనే తేడా ఉంది విధానాల్లో లేదు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు బీఆర్ఎస్‌కు ఇష్టం లేదు. అందుకే కేటీఆర్ తన ట్వీట్‌లో కాంగ్రెస్ గెలుపును ప్రజాతీర్పుగా అభివర్ణించలేదు. మోదీ ఓడిపోతే బీఆర్ఎస్ నేతలు ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదు.

జేడీఎస్‌కు మద్దతిచ్చారు: ఠాక్రే

'బీఆర్ఎస్ నేతలు కర్ణాటకలో కుమారస్వామికి మద్దతిచ్చారు. కాంగ్రెస్ ఓటమికి ప్రయత్నించారు. అయినా కర్ణాటక ప్రజలు అంగీకరించలేదు. అక్కడ గెలిపించినట్టుగానే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు కూడా గెలిపించనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం.'

ఇక్కడా ప్రభావం ఉంటుంది: ఉత్తమ్

కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణలో ఉంటుంది. కర్ణాటకలో నేతలంతా ఐక్యంగా పనిచేశారు. ఇక్కడ కూడా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చర్చించుకుంటాం. అందరం ఐకమత్యంతో ముందుకెళ్లి కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకువస్తాం.'

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు వచ్చేది 35 సీట్లే

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు కలిసి 35 సీట్లు మాత్రమే వస్తాయని, మిగిలిన అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. కర్ణాటక తరహాలోనే రానున్న ఎన్నికల్లో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వస్తుందని రేవంత్ వెల్లడించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ...తెలంగాణలో బీఆర్ఎస్‌కు 25లోపు సీట్లు వస్తాయని, ఎంఐఎంకు 7, బీజేపీకి 9లోపు సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. కర్ణాటక ఎన్నికల్లోనూ తాను చెప్పినట్టే ఫలితాలు వచ్చాయని, తెలంగాణలో కూడా తాను చెప్పినట్టే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ అస్థిర రాజకీయాలతో తన రాజకీయాలను సుస్థిరం చేసుకోవాలని అనుకుంటారని, అదే తరహాలో కర్ణాటకలో జేడీఎస్‌ను అడ్డం పెట్టుకుని ఏదో చేయాలనుకున్నా అక్కడి ప్రజలు తిప్పికొట్టారని చెప్పారు.

ఇగోలు పక్కన పెట్టాలి: వీహెచ్

కర్ణాటక తరహాలోనే తెలంగాణ కాంగ్రెస్ నేతలు పనిచేయాలి. నేతలందరూ ఇగోలు పక్కన పెట్టాలి. పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అందరితో మాట్లాడి సమన్వయం చేయాలి.'

1980 రిపీట్ అవుతుంది: పొన్నాల

'1980 చరిత్ర 2024లో రిపీట్ అవుతుంది. దేశంలో అధికారంలోకి కచ్చితంగా వస్తాం. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మేందుకు సిద్ధంగా ఉన్నారు.'

ఇక్కడా అదే పనిచేయాలి.: జానారెడ్డి

అక్కడ కాంగ్రెస్ పార్టీ నేతలు అంతర్గత విభేదాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో గెలిచారు. తెలంగాణలో కూడా అదే పనిచేయాలి.

తెలంగాణ కాంగ్రెస్‌లో 'జోష్'

- కర్ణాటకలో విజయంతో టీపీసీసీ నేతల్లో ఉత్సాహం
- కర్ణాటకలో రాహుల్ జోడో యాత్ర నిర్వహించిన 20 స్థానాల్లో 15 చోట్ల గెలుపు
- తెలంగాణలోనూ కన్నడ ప్రభావం ఉంటుందనే అంచనా



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఘన విజయం తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో కొత్త జోష్‌ను తెచ్చింది. అటు ఇతర రాష్ట్రాల్లో, ఇటు స్వరాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో చాలాకాలంగా ఓటములను భరిస్తూ వస్తున్న టీపీసీసీ నేతల్లో ఈ విజయం మంచి ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతమవుతాయని, తెలంగాణలోనూ తామే అధికారంలోకి వస్తామని ఢంకా బజాయించి చెప్పే స్థాయిలో ఈ ఫలితాలు రాష్ట్ర నేతలకు ఊపు తెచ్చి పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కొంటామని, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ మాత్రమేనన్న అంచనాతో ఎన్నికలకు వెళ్తామని ఇక్కడి నేతలు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభ మసకబారుతున్న నేపథ్యంలో కర్ణాటకలోనూ ఓడిపోతే తెలంగాణలో పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి వచ్చేదని, కానీ కర్ణాటక ఫలితం ఒక్కసారిగా తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితిలో మార్పు తెచ్చిందని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇక పార్టీ నుంచి వలసలు తగ్గుతాయని, అదే సమయంలో పార్టీలోకి చేరికలు పెరుగుతాయని చెబుతున్నారు.

కలిసికట్టుగా...

కర్ణాటక కాంగ్రెస్‌తో పోలిస్తే తెలంగాణ పార్టీలో నెలకొన్న గ్రూపు తగాదాలు కూడా ఈ సందర్భంగా చర్చనీయాంశమవుతున్నాయి. అక్కడ శివకుమార్, సిద్దరామయ్యలు సీఎం కుర్చీ కోసం పోటీపడినప్పటికీ ఎక్కడా అంతర్గత కలహాలు బయటపడకుండా నెట్టుకొచ్చారని, ఐకమత్యంగా పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చారనే చర్చ జరుగుతోంది. అధికారం దక్కాలంటే అందరం కలిసి పనిచేయాల్సిందేనని, అదే భావనకు అందరు నేతలు వస్తారని, కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిస్తారని టీపీసీసీ నేత ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

జోడో యాత్రపై ఆశలు

కర్ణాటకలో రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర నిర్వహించిన 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15 చోట్ల కాంగ్రెస్ గెలుపొందడం తెలంగాణ పార్టీ నేతల్లోనూ ఉత్సాహాన్ని నింపుతోంది. గత అక్టోబర్, నవంబర్‌లో తెలంగాణలోనూ రాహుల్ జోడో యాత్ర జరిగింది. రాష్ట్రంలో 19 అసెంబ్లీ, 7 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈ యాత్ర జరగ్గా, ఆయా స్థానాల్లో మంచి ఫలితాలు వస్తాయనే అంచనాలు అక్కడి నేతల్లో మొదలయ్యాయి. నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్ నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, రాజేంద్రనగర్, బహదూర్‌పుర, చార్మినార్, గోషామహల్, నాంపల్లి, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, సంగారెడ్డి, ఆందోల్, నారాయణ్ ఖేడ్, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా జోడో యాత్ర సాగింది. కర్ణాటక ఫలితాలను బట్టి ఆయా స్థానాల్లో కొంచెం కష్టపడితే విజయం సాధించగలమనే ధీమా టీపీసీసీ నేతల్లో వ్యక్తమవుతోంది. మొత్తంమీద గెలుపునకు మొహం వాచినట్టు ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సరిహద్దు కర్ణాటకలో దక్కిన విజయం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పినట్టు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు తగ్గలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు తగ్గలేదని, గత ఎన్నికల్లో మాదిరిగానే 36% ఓట్లు వచ్చాయని, సీట్లు మాత్రమే తగ్గాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...జేడీఎస్‌కు చేజారిన ఓట్లన్నీ కాంగ్రెస్‌కే పడ్డాయన్నారు. మత రాజకీయాలు చేసిన పార్టీ కాంగ్రెస్సేనని, ఓ వర్గం ఓట్లన్నీ గంపగుత్తగా కాంగ్రెస్‌కే పడేలా చేశారని మండిపడ్డారు. జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం స్వయంగా ఒక వర్గం ఓట్లు చీలితే బీజేపీ అధికారంలోకి వస్తుందని ప్రచారం చేసి...ఆ ఓట్లన్నీ కాంగ్రెస్‌కే పడేలా చేశారని తెలిపారు. ఎంఐఎం పార్టీతో పాటు నిషేధిత పీఎఫ్ఐ సంస్థకు చెందిన ఎస్డీపీఐ పార్టీ సైతం కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిందని ఆరోపించారు. కర్ణాటక రాజకీయాలు తెలంగాణలో చెల్లవని, ఇక్కడ కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు కావడం తథ్యమని జోస్యం చెప్పారు. హుజూరాబాద్, మునుగోడు, దుబ్బాక ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు గల్లంతయిన విషయాన్ని ఈ సదర్భంగా గుర్తుచేశారు. 2018 ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందని, ఎంపీ ఎన్నికల్లో నాలుగు ఎంపీ సీట్లు గెలిచామని తెలిపారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, కమ్యూనిస్టులు కలిసే పనిచేస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలం శ్రేణులు డీలా!

- కన్నడ ఓటరు ప్రతికూల తీర్పుతో నైరాశ్యం
- ఉదయం ఫలితాల ట్రెండ్ వెలువడ్డాక బోసిపోయిన పార్టీ కార్యాలయం



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఫలితాలతో బీజేపీ శ్రేణులు డీలా పడ్డాయి. మళ్లీ అధికారాన్ని సాధిస్తామని ఎన్నో ఆశలు పెట్టుకున్నా అవి నెరవేరకపోవడంతో నైరాశ్యం ఆవరించింది. దక్షిణాదిలో పార్టీ విస్తరణకు కన్నడనాట విజయం మేలుమలుపుగా నిలుస్తుందని, తద్వారా తెలంగాణలో సులభంగా అధికారంలోకి రావచ్చనే రాష్ట్ర పార్టీ అంచనాలు తలకిందులయ్యాయి. మూడ్రోజుల క్రితం వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు మించి కాంగ్రెస్‌కు సీట్లు దక్కడంతో కమల నేతల్లో నిరుత్సాహం ఆవరించింది. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా రాష్ట్రపార్టీ ముఖ్యనేతలెవరూ కూడా పార్టీ ఆఫీసులో కనిపించలేదు. శనివారం ఉదయం నుంచి కూడా నాంపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద సందడి లేక బోసిపోయి కనిపించింది. రాష్ట్రపార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ కరీంనగర్‌లో హిందూ ఏక్తాయాత్ర ఏర్పాట్లలో బిజీగా ఉండగా, పార్టీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఏపీలోని అన్నవరంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గపరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు నిజం కావడంతో ఫలితాలపై స్పందించేందుకు పలువురు నేతలు నిరాసక్తత కనబరిచారు. తెలంగాణ నుంచి పలువురు ముఖ్యనేతలు ప్రచారంలో పాల్గొన్న స్థానాల్లో పార్టీ అభ్యర్థులు ఓడిపోవడంతో ఆయా నియోజకవర్గాల్లోని పరిస్థితులు, అభ్యర్థిపై వ్యతిరేకత, ప్రభావం చూపిన అంశాలు తదితరాలు నాయకుల మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం.

సందిగ్ధంలో చేరికలు

కన్నడ ఓటరు ఇచ్చిన తీర్పు ప్రభావం తెలంగాణలో పార్టీపైనా పడే అవకాశాలు కనిపిస్తున్నాయని పరిశీలకులు అంచనావేస్తున్నారు. కర్ణాటకలో బీజేపీ సర్కార్‌పై ప్రజా వ్యతిరేకత తీవ్రస్థాయిలో బయటపడటంతో తెలంగాణలో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహాలు మార్చాల్సి ఉంటుందనే చర్చ పార్టీవర్గాల్లో సాగుతోంది. దక్షిణాదిలో అధికారంలో ఉన్న ఒకే ఒక రాష్ట్రం చేజారడంతో, ఆ తర్వాత పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న తెలంగాణపై బీజేపీ నాయకత్వం ఎన్నో ఆశలు పెట్టుకుంది. మిగతా దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడా బీజేపీ గద్దెనెక్కే పరిస్థితులు లేకపోవడంతో తెలంగాణలో అన్ని జాగ్రత్తలు తీసుకుని, పకడ్బందీ కార్యాచరణను అనుసరించాలనే అభిప్రాయం రాష్ట్ర నాయకుల్లో వ్యక్తమవుతోంది. కర్ణాటకలో మొత్తం ప్రచారం, పర్యవేక్షణ తదితరాలన్నింటినీ అధినాయకత్వం తన అదుపాజ్ఞల్లోకి తీసుకోవడం, పెద్దసంఖ్యలో అభ్యర్థుల మార్పు, యడియూరప్ప వంటి పాత తరం నేతలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం తదితర విధానాలను ఇక్కడా కూడా అమలుచేస్తారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చేరికలపై ఎదురు దెబ్బ?

కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి ముఖ్య నేతల చేరిక విషయంలో ఎదురుగాలి రావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కన్నడనాట వచ్చే ఫలితాలను బట్టి చేరికల వేగం పుంజుకోవచ్చనే అంచనాలుండగా, ప్రతికూల ఫలితాల దృష్ట్యా చేరికల అంశం డోలాయమానంలో పడినట్టుగానే భావిస్తున్నారు. మరవైపు, కేంద్రంలో బీజేపీ 9 ఏళ్లుగా అధికారంలో ఉన్నందున, ఎన్నికల్లో పోటీచేయని లేదా ఆసక్తి లేని రాష్ట్రస్థాయిలోని పలువురు సీనియర్లకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టే అవకాశమున్నా అది జరగకపోవడం పట్ల పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో వేలాదిగా ఉన్న నామినేటెడ్ పోస్టులను ఇప్పటికైనా భర్తీ చేయాల్సిన అవసరముందనే అభిప్రాయంతో రాష్ట్ర నేతలున్నారు. కర్ణాటక ఎన్నికల సందర్భంగా యూపీ, గుజరాత్ ఫార్ములా అంటూ జాతీయ నేతలు హడావుడి చేయడం వల్ల నష్టం జరిగిందంటున్నారు. తెలంగాణలోనూ అదే పద్ధతిలో చేస్తారా, ఇక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా వ్యూహాలు, కార్యాచరణ మారుస్తారా అనే చర్చ జరుగుతోంది.

గాంధీభవన్‌లో 'ధూం ధాం'

నీలోఫర్ హనుమాన్, నాంపల్లి దర్గాలో రేవంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గాంధీభవన్‌లో సంబురాలు చేసుకున్నారు. పటాసులు పేల్చారు. పార్టీ జెండాలు పట్టుకుని రాహుల్, ప్రియాంకలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ డ్యాన్సులు చేశారు. నేతలు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, మెట్టు సాయికుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తదితరులు గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సంబురాల్లో పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నీలోఫర్ ఆసుపత్రి సమీపంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి గాంధీభవన్‌కు వచ్చారు. అక్కడే ఇతర నేతలతో కలిసి ఫలితాల సరళిని వీక్షించారు. ఆ తర్వాత రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఇతర పార్టీ నేతలతో కలిసి నాంపల్లి దర్గాకు వెళ్లి చాదర్ సమర్పించారు.

కర్ణాటక ఫలితాలు ఇక్కడా రిపీట్

సీఎల్పీ నేత భట్టి ధీమా




కాంగ్రెస్ విజయంతో కేక్ కట్ చేస్తున్న భట్టి

షాద్‌నగర్: దేశంలో ఇక బీజేపీ శకం ముగిసిందని కర్ణాటక ఫలితాలు తెలంగాణలో రిపీట్ కావడం ఖాయమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి, షాబాద్ మండలం మరియాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఫలితాలు తమకు ఏనుగంత బలం ఇచ్చాయన్నారు. కర్ణాటకతోనే మార్పు మొదలైందని కాంగ్రెస్ విజయయాత్ర తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ మీదుగా ఢిల్లీ పీఠం దాకా కొనసాగుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టి రెండేళ్ల జైలు శిక్ష పడేలా చేసి, శిక్షను సాకుగా చూపి పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా దేశ ప్రజలు భావించారని అభిప్రాయపడ్డారు. మోదీ ప్రభుత్వం మతం పేరిట విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనేందుకు చేస్తున్న యత్నాలను ప్రజలు తిరస్కరించారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాచరిక పాలనను అంతం చేసేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొన్ని పొరపాట్లతోనే ఓటమి

కర్ణాటకలో బీజేపీ ఓటమిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పంజగుట్ట/లాలాపేట(హైదరాబాద్): కర్ణాటకలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా తీరులో కొన్ని పొరపాట్ల వల్లే బీజేపీ ఓటమిపాలైందని, కర్ణాటక ప్రజల తీర్పును శిరసావహిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీపై అభిమానం ఉన్నప్పటికీ అక్కడి స్థానిక సమస్యలపై ప్రజలు తీవ్రంగా స్పందించి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు ఆయన అభిప్రాయపడ్డారు. అయినా బీజేపీ చెప్పుకోదగ్గ సీట్లే సాధించిందని, ఒక మంచి ప్రతిపక్షంగా ఉండి ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. శనివారం ఆనంద్ నగర్ కాలనీలోనూ, తార్నాకలోనూ జరిగిన బీజేపీ బూత్ స్థాయి సమావేశాల్లో ఆయన ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 90% సీట్లు మోదీకి, బీజేపీకి అనుకూలంగా వస్తాయని జోస్యం చెప్పారు. కర్ణాటక పరిస్థితే తెలంగాణలో రానుందని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు తీర్పు ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీ అన్ని పోలింగ్ బూత్‌లలో పార్టీని పటిష్టం చేసుకునేందుకే బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లే చర్యల్లో భాగంగా ఈనెల 27న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో యోగా డే కౌంట్‌డౌన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అత్యధిక స్టార్టప్‌లున్న మూడో రాష్ట్రంగా తెలంగాణ



నేషనల్ టెక్నాలజీ కాంక్లేవ్ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు తదితరులు

హఫీజ్‌పేట్: దేశంలోనే అత్యధిక స్టార్టప్‌లున్న మూడో రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షర్టన్ హోటల్‌లో సీఐఓ క్లబ్ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నేషనల్ టెక్నాలజీ కాంక్లేవ్–2023 శనివారం జరిగింది. ఈ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 7,500 స్టార్టప్‌లున్నాయన్నారు. వ్యాక్సినేషన్ ఉత్పత్తిలోనూ కొత్తగా ఏర్పడిన తెలంగాణే టాప్ రాష్ట్రంగా కొనసాగుతోందని తెలిపారు. ఈజీ ఆఫ్ బిజినెస్‌లో, బెస్ట్ ఇన్నోవేషన్ స్టేట్‌గానూ తెలంగాణ గుర్తింపు పొందిందన్నారు. ఇక ప్రపంచంలోనే అత్యుత్తమ ఐటీ కంపెనీలైన అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు.. అమెరికా తర్వాత తమ అతి పెద్ద కేంద్రాలను హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ఉపయోగిస్తూ తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. సీఐఓ క్లబ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ 2018లో సీఐఓ క్లబ్ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బి అసోసియేట్ డైరెక్టర్ అజయ్ సింగ్, సీఐఓ క్లబ్ ప్రతినిధులు ఉమేష్ మెహతా, 14 చాప్టర్ల సీఐఓలు, సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో డీఏజెడ్ఎన్ గ్రూప్ డెవలప్‌మెంట్ సెంటర్

తెలంగాణ యువతకు 1,000 ఉద్యోగాలు.. మంత్రి కేటీఆర్ యూకే పర్యటనలో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తమ సంస్థకు చెందిన ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని స్పోర్ట్స్ లైవ్ స్ట్రీమింగ్‌లో దిగ్గజ సంస్థ డీఏజెడ్ఎన్ నిర్ణయించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా యూకేలో పర్యటిస్తున్న మంత్రి కేటీఆర్‌ను శనివారం డీఏజెడ్ఎన్ గ్రూప్ ఉన్నతాధికారులు సందీప్ టికు, వెల్స్ కలిసి చర్చలు జరిపారు. అనంతరం కంపెనీ తెలంగాణలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన చేసింది. అంతర్జాతీయ ఓటీటీ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ సర్వీస్ సంస్థ డీఏజెడ్ఎన్‌కు ప్రపంచవ్యాప్తంగా 6 కోట్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రీడాభిమానులు అత్యధికంగా వీక్షించే యూఈఎఫ్ఏ చాంపియన్స్ లీగ్, యూరప్ లీగ్, సీరీ ఏ, లా లిగా, ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్, ఎన్ఎఫ్ఎల్, ఎన్‌బీఏతోపాటు ఐపీఎల్ (భారత్ మినహా) వంటి ప్రధాన ఈవెంట్ల లైవ్, ఆన్–డిమాండ్ స్పోర్ట్స్ కంటెంట్‌ను డీఏజెడ్ఎన్ ప్రసారం చేస్తుంది. తమ పెట్టుబడులతో తెలంగాణ యువతకు 1,000 ఉద్యోగాలు వస్తాయని కంపెనీ తెలిపింది. ఇన్నొవేషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న ఆధిపత్యానికి డీఏజెడ్ఎన్ పెట్టుబడే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎన్ఆర్ఐ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ డిజిటల్ మీడియా వింగ్ డైరెక్టర్ కొణతం దిలీప్ పాల్గొన్నారు.



డీఏజెడ్ఎన్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్

ప్లాస్టిక్ రహితంగా తిరుమల

- భక్తులంతా భాగస్వాములు కావాలి
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపు

తిరుమల/తిరుచానూరు(చంద్రగిరి): తిరుమలలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భక్తుడిపైనా ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. తిరుమలను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చడానికి టీటీడీ చేస్తున్న కృషిలో భక్తులంతా భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం కోసం శనివారం టీటీడీ నిర్వహించిన సుందర తిరుమల–శుద్ధ తిరుమల కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొన్నారు. తిరుమల నుంచి తిరుపతికి వచ్చే ఘాట్ రోడ్డులోని ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన తొలగించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. తిరుమల కొండలు పవిత్రమైనవని, ఈ ప్రాంతాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో దేవుడి గది లాగే భావించి శుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో గొప్పదని.. ఇందులో పాల్గొంటున్న ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులను ఆయన అభినందించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, ఇకపై ప్రతి నెలా రెండో శనివారం సుందర తిరుమల–శుద్ధ తిరుమల కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు స్వచ్ఛందంగా పాల్గొని తిరుమలను పరిశుభ్రంగా.. ప్లాస్టిక్ రహితంగా ఉంచడానికి కృషి చేయాలని కోరారు. తిరుమలకు ప్లాస్టిక్ ఉత్పత్తులను తీసుకురావద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఎస్పీ పరమేశ్వర రెడ్డి, టీటీడీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తిరుమల ఘాట్ రోడ్డులో చెత్తను తొలగిస్తున్న సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులు ఆయన్ని రంగనాయకుల మండపంలో లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే శనివారం సాయంత్రం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

భారత్‌కు తెలంగాణ మోడల్ అవసరం

▶ మొదటి పేజీ తరువాయి

'ఐడియాస్ ఫర్ ఇండియా'సదస్సులో ప్రసంగించారు. భారత్‌లో అపారమైన ఖనిజ, జల వనరులు, సరిపడినంత విద్యుత్, సాగుకు యోగ్యమైన భూమితోపాటు అద్భుతమైన మానవ వనరులు ఉన్నాయన్నారు. దేశ జనాభాలో 67 శాతంగా ఉన్న యువ శక్తిని ఉపయోగించుకుని సరైన దిశలో పయనిస్తే చైనా 30 ఏళ్లలో సాధించే పనులను 20 ఏళ్లలోనే చేసి చూపించే సత్తా భారత్‌కు ఉందని చెప్పారు. ప్రపంచంలో ఏ ఇతర దేశానికీ ఇంతటి యువశక్తి కలిగిన మానవ వనరులు లేవనే విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యో గ, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ప్రత్యామ్నాయ ఉపా ది అవకాశాలు కల్పించేందుకు యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు వీలుందన్నారు.

తొమ్మిదేళ్లలోనే విప్లవాత్మక పరివర్తన

రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలోనే ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంతోపాటు విప్లవాత్మక చర్యల మూలంగా అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని కేటీఆర్ అన్నారు. వర్షాధార ప్రాంతమైన తెలంగాణలో గతంలో జల వనరులు ఎండిపోయి, బోరు బావుల తవ్వకాలతో రైతులు ఆర్థికంగా కుదేలయ్యారని చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం హరిత, జలకళను సంతరించుకుందన్నారు. విద్యుత్, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక రంగాల్లో తెలంగాణ వృద్ధి సాధించగా, ఐటీ రంగంలో హైదరాబాద్‌కు దిగ్గజ కంపెనీలు తరలివస్తున్నాయని పేర్కొన్నారు. నాలుగో పారిశ్రామిక విప్లవంలో భారత్‌ను మొదటి వరుసలో నిలిపేందుకు రైతులు, యువతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కేటీఆర్ నొక్కిచెప్పారు. భారత్ సరైన దిశలో పయనిస్తే వచ్చే 20 ఏళ్లలో దేశ తలసరి ఆదాయం 6–8 రెట్లు పెరిగే అవకాశముందని, తద్వారా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవడం సాధ్యమవుతుందని స్పష్టంచేశారు.



> నా కుమారుడా, నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము,
> నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము. అవి నీ తలకు సొగసైన
> మాలికయు, నీ కంఠమునకు హారములునై యుండును.
>
> – క్రైస్తవ ధర్మం

హవ్వా... సముద్రం ఒకడి కాళ్ల దగ్గరా?

"సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు, తుపాను గొంతు చిత్తం అనడం ఎరగదు. పర్వతం ఎవరికీ వంగి సలాం చెయ్యదు, నేనంతా పిడికెడు మట్టే కావచ్చు – కానీ చెయ్యెత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది.'' గుంటూరు శేషేంద్ర శర్మ కవితా పంక్తులివి. పవన్ కల్యాణ్ తన గురించీ, తన రాజకీయ ప్రస్థానం గురించీ చెప్పుకోవడానికి ఈ పంక్తుల్ని వాడుకున్నారు. వేలాదిమంది అభిమానులు హాజరైన ఒక బహిరంగ సభలో జనసేన కార్యకర్తలకు ఆయన చేసిన బాస ఇది.

ఇప్పుడేమైంది పవన్‌జీ? ఆ ధీర గంభీర ప్రవచనాల కేమైనది? ఏవి తండ్రీ నిరుడు కురిసిన అగ్నిధారలు ఎక్కడయ్యా? నేనంతా పిడికెడు మట్టినే కదా! 175 నాకెట్లా సాధ్యమని బేలగా పలుకుతున్నారేమిటి? పొత్తుల జోలెలో చంద్రబాబు వేసే ముష్టయ్యో, నలభయ్యో చాలంటున్నారెందుకని? మీలో ఒక దేశపు జెండాకున్నంత పొగరు ఎందుకు అవనతమైనది? ఆ పొగరు జెండాను తమ గుండెల మీద ఎగరేసుకున్న మీ అభిమానుల పరిస్థితేమిటి? ''ఇల్లేమో దూరం. చీకటి పడింది. దారంతా గతుకులు. చేతిలో దీపం లేదు. అయినా గుండెల్లో ధైర్యముంది... వెళ్లొస్తా చిన్నమ్మా'' అనే కవితను మీరు చదివినప్పుడు 'అబ్బో మావాడు మహా తోపు' అనుకున్న జనసైనికుల పరిస్థితి ఏమి కావాలిప్పుడు?



జగన్ సర్కార్‌ను తానొక్కడిగా ఎదిరించడం సాధ్యం కాదని పవన్ కుండబద్దలు కొడుతున్నారు. తానొక్కడి వల్లే కాదు, ఏ ఒక్కరి వల్లా కాదని కూడా తేల్చేశారు. 'ఈ చీకటి దారిలో నేనొక్కడినీ వెళ్లలేను చిన్నమ్మా. తోడు కావాల'ని దీనంగా అర్థిస్తున్నారు. తోడు దొరికినా కూడా తాను ముందు నడవరట! ముందు చంద్రబాబు నడవాలి. ఆ వెనకే తానూ, తనతోపాటు మిగిలిన సమస్త జీవరాశి. లెఫ్ట్, రైట్ తేడాలు పక్కనపెట్టి తన చుట్టూ నిలబడాలని అభ్యర్థిస్తున్నారు. వీలైతే పంచభూతాలు, సప్త సముద్రాలు, నవగ్రహాలు కూడా అండగా వస్తే బాగుంటుందని ఆయన మనసులో బలంగా ప్రార్థిస్తూ ఉండవచ్చు.

ఆంధ్ర రాజకీయ రంగంలో ఒక విలుకాడుగా నిలబడుతాడని కొందరు అభిమానులు ఆశపడ్డ ఈ నటుడు చివరికి తన బొటనవేలును కోసి చంద్రబాబుకు దక్షిణగా సమర్పిస్తున్నారు. 'నా పక్కన ఉండే నాదెండ్ల మనోహర్‌ను ఒక్క మాటన్నా సహించబోను. ఖబడ్దార్! ఆయనంటే ఇష్టం లేనివాళ్లు పార్టీ వదిలి వెళ్లిపోవచ్చ'ని కూడా పవన్ బాహాటంగా హెచ్చరించారు. మనోహర్... చంద్రబాబు ఏజెంటని పవన్ అభిమానులు, కాపు సామాజికవర్గం పెద్దల నిశ్చితాభిప్రాయం. నిరంతరం పవన్ కదలికలను బాబుకు ఆయన చేరవేస్తుంటారని వారు బహిరంగంగానే ఆరోపిస్తుంటారు. బీజేపీతో సహా ఇతర పార్టీల నేతలను పవన్ కలిసినప్పుడు కచ్చితంగా మనోహర్ వెంట ఉంటారట! ఆ సంభాషణల కేసెట్‌ను చంద్రబాబుకు చేరవేస్తుంటారట! చంద్రబాబు – పవన్ భేటీలో మాత్రం మనోహర్ కనిపించరట! ఎవరికీ చేరవేయవలసిన అవసరం లేదు కనుక! జనసేన ముఖ్యులే చెవులు కొరుక్కుంటున్న మాటలివి!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థనీ, వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడానికి టీడీపీ – బీజేపీ – జనసేనలతో కూడిన కూటమి ఏర్పడబోతున్నదనీ నిన్న పవన్ ప్రకటించడాన్ని ఒక కొత్త విషయంగా కొన్ని మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. వైసీపీ వాళ్లు మాత్రం ఈ సంగతి మాకెప్పుడో తెలుసని తేలిగ్గా తీసుకున్నారు. అసలు జనసేన పార్టీ సృష్టి స్థితి లయకారుడు చంద్రబాబేనని వాళ్లు ఎప్పటి నుంచో చెబుతున్నారు. పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు దత్తపుత్రుడనే నామకరణాన్ని కూడా వైసీపీ అధినేత ఎప్పుడో ఖరారు చేశారు. బాబు చేత, బాబు కొరకు, బాబు పెట్టిన పార్టీగానే జనసేనను వైసీపీ వాళ్లు పరిగణిస్తారు. కనుక పవన్ కల్యాణ్ రాజకీయ విధాన ప్రకటన వారికెటువంటి ఆశ్చర్యాన్నీ కలిగించలేదు.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయ రంగంలో ఎదురులేని శక్తిగా యువనేత జగన్‌మోహన్‌రెడ్డి కనిపించారు. ఆయన్ను ఓడించడానికి చంద్రబాబు ఒక పద్మవ్యూహాన్ని రూపొందించవలసి వచ్చింది. అందులో భాగంగానే జనసేన పేరుతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను తయారుచేసి, దాని చీఫ్‌గా పవన్ కల్యాణ్‌ను నియమించారని రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. ఈ అంచనా నిజమేనని తదుపరి పరిణామాలు నిర్ద్వంద్వంగా నిరూపించాయి. ఆ ఎన్నికల్లో బాబు అప్పగించిన టాస్క్ మేరకు జనసేన పోటీ చేయలేదు. సినిమా వ్యామోహమున్న యువతీయువకుల్లో, కొంతమేరకు కాపు యువతలో తనకున్న క్రేజును టీడీపీ ఓట్లుగా మలచడానికి పవన్ యథాశక్తి కృషి చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కల్యాణ్, ఆయన టాస్క్‌ఫోర్స్ అతిథి పాత్రనే పోషించాయి. తరువాతి ఎన్నికల్లో చంద్రబాబు కొత్త టాస్క్‌ను అప్పగించారు. ఆయన అధికారంలో ఉన్నారు గనుక తనకు వ్యతిరేకంగా పడే ఓట్లు గంపగుత్తగా వైసీపీకి వెళ్లకూడదని భావించారు. వ్యతిరేక ఓటును చీల్చడం కోసం టాస్క్‌ఫోర్స్‌కు కమ్యూనిస్టులనూ, బీఎస్పీనీ జతచేసి రంగంలోకి దించారు. అయినా ఫలితం దక్కలేదన్నది వేరే విషయం.

ఇప్పుడు బాబు ప్రతిపక్షంలో ఉన్నారు. అధికార పక్షానికి వ్యతిరేకంగా పడే ఓట్లు చీలకూడదు. 'ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వను' అని పవన్ కల్యాణ్ గంభీరంగా చేస్తున్న ప్రకటనల వెనుక పరమార్థం – చంద్రబాబు ప్రయోజనమే! మొన్నటి ఎన్నికల తర్వాత కమ్యూనిస్టులను గిరాటు వేసి, పవన్ బీజేపీ చెంతకు చేరడం కూడా బాబు వ్యూహంలో భాగమేనని కనిపెట్టడానికి కామన్‌సెన్సు సరిపోతుంది. ఆ ఎన్నికల ముందు చంద్రబాబు... నరేంద్ర మోదీని అసభ్యంగా తిట్టిపోశారు. ఆయన ఓడిపోతారనే గుడ్డి నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయం కూడా చేశారు. చంద్రబాబు గ్రహచారం బాగాలేక నరేంద్ర మోదీ ఘనవిజయం సాధించారు. మోదీ ఆగ్రహం నుంచి తప్పించుకోవడానికి చేయగూడని పనులన్నీ చేయడానికి బాబు సిద్ధపడ్డారు.

పూర్వం బలవంతులైన రాజుల కటాక్ష వీక్షణాల కోసం బలహీనమైన రాజులు పడిన ప్రయాసనంతా చంద్రబాబు పడ్డారు. ధనరాశులతోపాటు గుర్రాలను, ఏనుగులను, యుద్ధ వీరులను, అందాల కన్యలను కూడా బలవంతుడైన రాజుకు కానుకలుగా పంపేవారట! చంద్రబాబు కూడా తన పార్టీలోంచి కొందరు నాయకులనూ, అందులో కొందరు ఎంపీలనూ బీజేపీలోకి పంపించారు. వారితోపాటు తాను పెట్టుకున్న టాస్క్‌ఫోర్స్ జనసేననూ, దాని చీఫ్‌ను కూడా బీజేపీ శిబిరానికి పంపించారు. చంద్రబాబు చాణక్యంపై బీజేపీ పెద్దలకు గ్రహింపు ఉన్నా కూడా సమర్పించిన కైంకర్యాలను వారి ప్రయోజనార్థం వారు స్వీకరించారు.

బీజేపీ శిబిరంలోకి చంద్రబాబు పంపించిన వారంతా బాబు సేవలోనే తరిస్తున్నారని చెప్పడానికి దృష్టాంతాలు కోకొల్లలు. బీజేపీ కొంగుతో చంద్రబాబు కొంగును ముడివేయడానికి పవన్ యథాశక్తి ప్రయత్నిస్తున్నారు. ఇది వాస్తవం. బయటకు కనిపించిందంతా నటనే! పవన్‌పై చంద్రబాబు వన్‌సైడ్ లవ్ ప్రకటించడం నటనే. తరువాత తనను కలిసిన బాబుతో 'ఐ లవ్ యూ టూ' అని పవన్ చెప్పడం కూడా నటనే! ఈ సన్నివేశాలన్నీ చంద్రబాబు కూటమి రాసిన నాటకంలో భాగాలే. పరిణామాలను గమనిస్తే– చంద్రబాబు సేవలో పవన్ కల్యాణ్ నిమగ్నమై ఉన్నారని అర్థమవుతూనే ఉన్నది. అందుకు కారణమేమిటన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్.

తన ప్రధాన ప్రత్యర్థులుగా పవన్ కల్యాణ్ ప్రకటించుకున్న వైసీపీలోని చాలామంది నాయకులు 'అంతా ప్యాకేజి మహిమ' అనే భాష్యం చెబుతారు. ఆ మాట వింటే పవన్‌కు తీవ్రమైన ఆగ్రహం కలుగుతుంది. ఆ కోపంలో ఒకసారి ప్రత్యర్థులకు చెప్పును కూడా చూపించారు. విమర్శలకూ, సమస్యలకూ ఆగ్రహం సమాధానం కాదని మన పురాణాలు, ఇతిహాసాలు ఎప్పటినుంచో బోధిస్తున్నాయి. పూర్వం కౌశికుడు అనే తపోబల సంపన్నుడిపై ఓ కాకి రెట్ట వేసిందట! కౌశికుడు కోపంతో కన్నెర్రజేసి కాకి వంక చూస్తాడు. ముని తపోబలం చేత ఆ కాకి మాడిపోతుంది. అక్కడి నుంచి భిక్షాటన కోసం ఒక గ్రామాన్ని చేరుకొని, 'భవతీ భిక్షాం దేహి' అని ఒక ఇంటి ముందు పిలుస్తాడు. వ్యాధిగ్రస్తుడైన భర్త సేవలో పడి, ఆ ఇల్లాలు కొంత ఆలస్యంగా భిక్ష తెస్తుంది. ఆలస్యం చేసినందుకు కౌశికుడికి కోపం వస్తుంది. అలవాటు ప్రకారం కంటి అరుణిమను ఇల్లాలిపై ప్రయోగిస్తాడు. ఆమె కాలిపోదు. పైపెచ్చు చిరునవ్వు నవ్వుతుంది. ''ఓయీ కౌశికా! నువ్వు కోపగిస్తే కాలిపోవడానికి నేను కాకిని కాదు. గృహధర్మానికి కట్టుబడిన ఇల్లాలిని. నా ధర్మనువర్తనలో కొంత ఆలస్యం జరిగినది. ధర్మాన్ని గురించి తెలియని నీ తపస్సు వృథా! వెళ్లి నేర్చుకో'' అని హితబోధ చేస్తుంది.

ప్యాకేజి విమర్శలను పూర్వపక్షం చేయాలని పవన్ భావిస్తే అందుకు పరిష్కారం పాదరక్షలు కాదు. తన రాజకీయ ఎత్తుగడలు ప్రజల ప్రయోజనాల కోసమేనని వారిని నమ్మించగలగాలి. చంద్రబాబుతో తన మైత్రి లోకకల్యాణార్థమని రుజువు చేయగలగాలి. అందరూ కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడిస్తే నెలకు మూడు వానలు కురుస్తాయనీ, బంగారు పంటలు పండుతాయనీ తాను చదివిన లక్ష పుస్తకాల పరిజ్ఞానంతో సహేతుకంగా నిరూపించవలసి ఉంటుంది. తాను చేగువేరా దగ్గర నుంచి శ్యామాప్రసాద్ ముఖర్జీ వరకు చేసిన ప్రయాణంలో బోలెడంత తాత్వికత దాగి ఉన్నదని తార్కికంగా నిరూపించవలసి ఉంటుంది. అలా చేయకపోతే – మీ కన్నెర్రకు కాకులు భయపడతాయేమో... లోకులు భయపడరు!

> ప్యాకేజి విమర్శలను పూర్వపక్షం చేయాలని పవన్ భావిస్తే అందుకు పరిష్కారం పాదరక్షలు కాదు. తన రాజకీయ ఎత్తుగడలు ప్రజల ప్రయోజనాల కోసమేనని వారిని నమ్మించగలగాలి. చంద్రబాబుతో తన మైత్రి లోక కల్యాణార్థమని రుజువు చేయగలగాలి. అందరూ కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడిస్తే నెలకు మూడు వానలు కురుస్తాయనీ, బంగారు పంటలు పండుతాయనీ తాను చదివిన లక్ష పుస్తకాల పరిజ్ఞానంతో సహేతుకంగా నిరూపించవలసి ఉంటుంది. తాను చేగువేరా దగ్గర నుంచి శ్యామాప్రసాద్ ముఖర్జీ వరకు చేసిన ప్రయాణంలో బోలెడంత తాత్వికత దాగి ఉన్నదని తార్కికంగా నిరూపించ వలసి ఉంటుంది. అలా చేయకపోతే – మీ కన్నెర్రకు కాకులు భయపడ తాయేమో... లోకులు భయపడరు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

తెలం'గానా'నికి కర్ణాటక సంగీతం!

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది.' కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు తెలంగాణలో ఎవరి చావు కొచ్చినట్టు? ఎవరి మేలు కొచ్చినట్టు? ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో మొదలైన తాజా చర్చ. అసలు ఒక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాల ప్రభావం పక్క రాష్ట్రం మీద ఉంటుందా? ఉంటే ఏ మేరకు ఉంటుంది? ఏ రాష్ట్రానికి సంబంధించిన రాజకీయ పరిస్థితులు ఆ రాష్ట్రానికే పరిమితం కదా! అటువంటప్పుడు కర్ణాటక ఫలితాలు తెలంగాణ మీద ఎలా ప్రభావం చూపిస్తాయన్న మీమాంస కూడా ఉన్నది. ఇప్పుడు తెలంగాణలో అధికార బీఆర్ఎస్ ప్రధాన రాజకీయ పక్షం. దానితో తలపడబోయే నెంబర్ టూ పార్టీ ఏదీ అన్న ప్రశ్నకు గత కొంతకాలంగా అస్పష్టమైన సమాధానాలు లభిస్తున్నాయి. అటువంటి అస్పష్టతకూ, సందిగ్ధతకూ కర్ణాటక ఫలితాలు తెరదించనున్నాయా?

రాష్ట్ర విభజన తర్వాత, తెలంగాణా ఇచ్చిన పార్టీగా పేరున్నప్పటికీ కాంగ్రెస్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. ఇందుకు కారణం ప్రజల్లో ఆదరణ లేకపోవడం కాదు. నాయకత్వ వైఫల్యం ప్రధాన కారణం. మొదటి ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ సారథిగా సహజంగానే కేసీఆర్‌కు కొంత సానుకూలత ఉన్నది. కానీ దాన్ని అధిగమించగలిగే సంస్థాగత బలం, కేంద్ర–రాష్ట్రాల్లో అధికారం, తెలంగాణ ఇచ్చిన పార్టీ అనే ఖ్యాతి కాంగ్రెస్‌కు ఉన్నాయి. కానీ కేసీఆర్ జనాకర్షణతో పోల్చినప్పుడు అందుకు దీటైన నాయకుడు కాంగ్రెస్‌లో లేకపోవడం ఎన్నికల ఫలితాలను శాసించింది. రెండోసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇవ్వబోతున్నదని చాలామంది భావించారు. కానీ అనూహ్యంగా చారిత్రక తప్పిదానికి ఒడిగట్టి తెలుగు దేశం పార్టీతో పొత్తు పెట్టుకొని భారీమూల్యం చెల్లించింది. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో మూడొంతులమంది అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ ఫిరాయింపుల పర్వం కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో పలుచన చేసింది. సరిగ్గా ఈ సమయంలోనే తెలంగాణలో బీజేపీ వేట మొదలైంది. కాంగ్రెస్ బలహీనపడుతున్న క్షణాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడు సీట్లు గెలిస్తే, బీజేపీ నాలుగు చోట్ల గెలవడం ఆ పార్టీకి అనుకోకుండా ఊపు తెచ్చింది. బీఆర్ఎస్ నాయకత్వం చేసిన పొరపాట్ల వల్ల హుజూరాబాద్, దుబ్బాక నియోజక వర్గాల్లో గెలిచి, బీజేపీ ఒక సంచలనానికి కారణమైంది. మునుగోడులో విజయతీరాల దాకా చేరుకున్నా బీఆర్ఎస్ అప్రమత్తత వల్ల కొద్ది తేడాలో ఓడిపోయింది.

తెలంగాణలో తాను బలపడ్డాననే అభిప్రాయం కలిగించడం కోసం బీజేపీ ఉప ఎన్నికల వ్యూహాన్ని అమలు చేసింది. అదే సమయంలో ఫిరాయింపుల ద్వారా కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేసి ఆ స్థానాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నది. ఈ కార్యక్రమంలో తాను ఆశించినంత కాకపోయినా ఎంతో కొంత మేరకు బీజేపీ విజయం సాధించింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే 'బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరు? కాంగ్రెసా... కాషాయ పార్టీనా' అనే సందిగ్ధత జనంలో ఏర్పడింది. కర్ణాటక ఫలితాలు సహజంగానే కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్నీ, బీజేపీ శ్రేణుల్లో నిరుత్సాహాన్నీ నింపుతాయి. ఈ ప్రభావం ఎలా ఉండబోతున్నది? బీఆర్ఎస్‌కు లాభమా–నష్టమా? కాంగ్రెస్ పార్టీ పుంజుకొని అధికార పార్టీని సవాల్ చేయగలుగుతుందా? కర్ణాటక గాయాన్ని మరచిపోవడానికి బీజేపీ తెలంగాణలో విజృంభిస్తుందా? ఈ విషయాల మీద స్పష్టత రావాలంటే క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల బలాబలాలను పరిశీలించాలి.

ఓట్ల చీలిక కారణంగా మూడోవంతు ఓట్లతోనే బీఆర్ఎస్ పార్టీ తొలిసారి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ చేసిన 'చారిత్రక' తప్పిదం వల్ల రెండోసారి ఆ పార్టీ ఓట్ల శాతం 47కు పెరిగింది. నాలుగు మాసాల తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో 41 శాతానికి దాని మద్దతు పడిపోయింది. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న పార్టీకి ఎంతోకొంత వ్యతిరేకత సహజం. బీఆర్ఎస్ విషయంలో ఈ వ్యతిరేకత కొంత ఎక్కువగానే కనిపిస్తున్నది. ముఖ్యంగా నలభయ్యేళ్లలోపు యువతలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అదే సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనైనా బీఆర్ఎస్‌కే ఓటువేసే వారి సంఖ్య కూడా తక్కువ లేదు. ఇటువంటి ఓటర్లు సుమారు 35 శాతం ఉంటారని అంచనా ఉన్నది. ఇంకో ఐదారు శాతం మందికి బీఆర్ఎస్ పట్ల తీవ్ర వ్యతిరేకతగానీ, వల్లమాలిన అభిమానం గానీ ఉండకపోవచ్చు. పరిస్థితులను బట్టి వారు ఆ పార్టీకి అనుకూలంగానో, ప్రతికూలంగానో స్పందించవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌కు ఓటు వేయని వారు 60 శాతం వరకు ఉండొచ్చని కొన్ని క్షేత్రస్థాయి పరిశీలనలు సూచిస్తున్నాయి. ఇందులో నాలుగైదు శాతం ఓట్లు చిన్న పార్టీలకు పడొచ్చు. నికరంగా 55 శాతం బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు. కాంగ్రెస్ బీజేపీలు ఈ ఓట్లను పంచుకోవాలి.

ఇందులో కాంగ్రెస్ నికర ఓటు ఎంత? బీజేపీ నికర ఓటు ఎంత? అనే పరిశీలన అవసరం. గడచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దాదాపుగా 30 శాతం ఓట్లు పడ్డాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 25 శాతం పైచిలుకు ఓట్లు పడ్డాయి. కనుక కాంగ్రెస్ నికర ఓటును 25 శాతంగా పరిగణించవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు శాతం ఓట్లు మాత్రమే సంపాదించిన బీజేపీ 4 నెలల్లోనే లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 20 శాతం ఓట్లు సంపాదించింది. లోక్‌సభ ఎన్నికల్లో 20 శాతం ఓట్లు సంపాదించడం బీజేపీకి మొదటిసారి కాదు. 1998 ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసి, దాదాపు ఇదే శాతం ఓట్లను ఆ పార్టీ పొంద గలిగింది. తర్వాత కాలంలో టీడీపీతో పొత్తు వల్ల బీజేపీ చిక్కి శల్యమైంది. ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ డబుల్ డిజిట్‌ను తాకలేక పోయింది. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతాన్నీ, ఈ మధ్యకాలంలో పెరిగిన విస్తరణనూ పరిగణనలోకి తీసుకుంటే 15 శాతం వరకు బీజేపీ నికర ఓటు ఉంటుందని భావించవచ్చు.

సీట్లవారీగా క్షేత్ర స్థాయి పరిశీలన సైతం ఇదే స్థాయి నికర ఓటును నిర్ధారిస్తున్నాయి. దాదాపు వంద సీట్లలో బీఆర్ఎస్



ప్రధాన పోటీదారుగా ఉంటుంది. అంటే గెలవడమో, లేదా రెండో స్థానంలో నిలవడమో అన్నమాట. కాంగ్రెస్‌కు అటువంటి నియోజక వర్గాలు అరవైకి పైనే కనిపిస్తున్నాయి. బీజేపీకి సుమారు ముప్ఫయ్ నియోజక వర్గాలున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉండి, అర్థబలం... అంగబలం దండిగా ఉన్న బీజేపీ తెలంగాణలో వేట మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా ఇంకా రెండో స్థానానికి చేరుకోలేకపోవడానికి కారణాలేమిటి? అనుకున్న స్థాయిలో చేరికలు ఎందుకు ఉండడం లేదు? అనైక్యతతో, క్రమశిక్షణా రాహిత్యంతో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడంలో బీజేపీ నేతలు ఎందుకు విజయం సాధించలేకపోతున్నారు?

బీజేపీ వ్యూహమే దాని ఎదుగుదలకు గుదిబండగా మారుతున్నదన్న అభిప్రాయం కూడా ఉన్నది. తెలంగాణలో ఎకాయెకిని హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండాను తలకెత్తుకున్నట్టు కనిపిస్తున్నది. జాతీయ స్థాయిలో హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండాతో అడ్వాణీ రథయాత్రలు చేయడం వల్ల పార్టీ విస్తరణ జరిగిందే కానీ, అధికారం సిద్ధించలేదు. అటల్ బిహారీ వాజ్‌పేయి లాంటి సాఫ్ట్ హిందూత్వ ముఖాన్ని ముందుపెట్టిన తర్వాతే తొలిసారి బీజేపీకి కేంద్ర పీఠం దక్కింది. ఆ పునాదుల మీదనే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం నిలబడింది. హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండానే బీజేపీ బలంగా ముందుకు తోస్తే... ఇరవై శాతం ఓట్ల మార్కును దాటడం కష్టమే! ఆ వైతరణీ నదిని దాటాలంటే కచ్చితంగా సెక్యులర్, లేదా సాఫ్ట్ హిందూత్వ ఎజెండాయే శరణ్యం.

> ఇందులో కాంగ్రెస్ నికర ఓటు ఎంత? బీజేపీ నికర ఓటు ఎంత? అనే పరిశీలన అవసరం. గడచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దాదాపుగా 30 శాతం ఓట్లు పడ్డాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 25 శాతం పైచిలుకు ఓట్లు పడ్డాయి. కనుక కాంగ్రెస్ నికర ఓటును 25 శాతంగా పరిగణించవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు శాతం ఓట్లు మాత్రమే సంపాదించిన బీజేపీ నాలుగు నెలల్లోనే లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 20 శాతం ఓట్లు సంపాదించింది. లోక్‌సభ ఎన్నికల్లో 20 శాతం ఓట్లు సంపాదించడం బీజేపీకి మొదటిసారి కాదు. 1998 ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసి, దాదాపు ఇదే శాతం ఓట్లను ఆ పార్టీ పొందగలిగింది. తర్వాత కాలంలో టీడీపీతో పొత్తు వల్ల బీజేపీ చిక్కి శల్యమైంది.

> బీజేపీ వ్యూహమే దాని ఎదుగుదలకు గుదిబండగా మారుతున్నదన్న అభిప్రాయం కూడా ఉన్నది. తెలంగాణలో ఎకాయెకిని హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండాను తలకెత్తుకున్నట్టు కనిపిస్తున్నది. జాతీయ స్థాయిలో హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండాతో అడ్వాణీ రథయాత్రలు చేయడం వల్ల పార్టీ విస్తరణ జరిగిందే కానీ, అధికారం సిద్ధించలేదు. అటల్ బిహారీ వాజ్‌పేయి లాంటి సాఫ్ట్ హిందూత్వ ముఖాన్ని ముందుపెట్టిన తర్వాతే తొలిసారి బీజేపీకి కేంద్ర పీఠం దక్కింది. ఆ పునాదుల మీదనే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం నిలబడింది. హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండానే బీజేపీ బలంగా ముందుకు తోస్తే... ఇరవై శాతం ఓట్ల మార్కును దాటడం కష్టమే! ఆ వైతరణీ నదిని దాటాలంటే కచ్చితంగా సెక్యులర్, లేదా సాఫ్ట్ హిందూత్వ ఎజెండాయే శరణ్యం.

ఇక కాంగ్రెస్ పార్టీ గణాంకాలు చూస్తే బాగానే ఉన్నా, ఎక్స్‌రే మాత్రం బలహీనతలను ఎత్తిచూపుతున్నది. నాయక శ్రేణుల్లో ఇప్పటికీ ఏకాభిప్రాయం లేదు. ఆ పార్టీలో ఐక్యత ఓ మరీచిక. అగ్రనాయకత్వంపై అందరికీ విశ్వాసం లేదు. ఒకరినొకరు ఓడించుకునే అవకాశాలను తోసిపుచ్చలేము. ఎన్నికలకు ముందే ఆ పార్టీ అభ్యర్థులందరూ పార్టీ ఫిరాయించబోమని బహిరంగంగా ప్రమాణాలు చేస్తే తప్ప ప్రజలు నమ్మలేని పరిస్థితులు కూడా ఉన్నాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాల ఉత్సాహంతో ఈ బలహీనతలన్నింటినీ అధిగమించగలిగితే గట్టి పోటీదారుగా నిలబడగలిగే అవకాశం ఇప్పటికీ కాంగ్రెస్‌కు ఉన్నది. అదే సందర్భంలో కర్ణాటకను కోల్పోయిన బీజేపీ దక్షిణాదిన మరో స్థావరం కోసం గాయపడ్డ పులిలా విరుచుకుపడడం ఖాయం. ఇతర పార్టీల్లో ప్రజాదరణ గల నాయకులను పెద్ద ఎత్తున చేర్చుకొని ఒక ప్రభంజనం సృష్టించే ప్రయత్నం తప్పక చేస్తుంది. ఆ ప్రయత్నంలో విజయం సాధిస్తే... జరగబోయేది కురుక్షేత్ర సంగ్రామమే!

vardhelli1959@gmail.com

జగదీశ్ శెట్టర్ (కర్ణాటక మాజీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

పార్టీ ఆఫీసులో ఒంటరిగా కూర్చొని ఉన్నాను. నా వెనుక గోడపై మోదీజీ ఉన్నారు. అమిత్ షా ఉన్నారు. అయినప్పటికీ నేనివాళ ఒంటరినే!

ముప్పై ఏళ్లుగా హుబ్లీ–ధార్వాడ్ సెంట్రల్‌లో గెలుస్తూ వస్తూ, ఇవాళ ఓడిపోవడం వల్ల నేను ఒంటరిని కాలేదు.

ముప్పై ఏళ్లకు ముందు హుబ్లీ–ధార్వాడ్‌లో అడ్రెసే లేని బీజేపీకి... గెలుపునే అడ్రెస్‌గా ఇచ్చిన నన్ను కాదని పార్టీ వేరొకరికి టికెట్ ఇచ్చినందు వల్ల నేను ఒంటరిని కాలేదు.

బీజేపీ నుంచి బయటికి వచ్చి, కాంగ్రెస్‌లో చేరి, నా కారుకు కాంగ్రెస్ జెండా తగిలించుకుని, నా కారు అద్దాలపై కాంగ్రెస్ స్టిక్కర్ అంటించుకుని ఎన్నికల ప్రచారంలో తిరిగినందుకు నేను ఒంటరిని కాలేదు.

ఏడోసారీ నేనే గెలిస్తే యడ్యూరప్ప తర్వాత నేనే నంబర్ వన్ అవుతానన్న భయంతో పార్టీ జనరల్ సెక్రెటరీ నాకు కాకుండా, వేరొకరికి పార్టీ టికెట్ ఇప్పించుకున్నందుకు నేను ఒంటరిని కాలేదు.



మరెందుకు ఒంటరినయ్యాను?!

గెలుస్తూ గెలుస్తూ వచ్చి ఓడినందుకా?

అయినా నేనెక్కడ ఓడిపోయాను! విజయమే తొలిసారి నా తోడు లేక ఒంటరిదయింది. బీజేపీ నాపై నిలబెట్టి గెలిపించుకున్న మహేశ్ 30 వేల ఓట్ల తేడాతో విజేత అయితే కావచ్చు. బీజేపీ ముప్పై ఏళ్ల నియమ ఉల్లంఘనకు కూడా అదే 30 వేల ఓట్ల దూరం.

మరి నన్ను ఒంటరిని చేసిందెవరు?!

"ఇకనైనా ఆ గోడకున్న మోదీ, అమిత్‌షాల ఫొటోలు తొలగిస్తారా?" అని రెండు పార్టీల వాళ్లూ అడుగుతున్నారు. నేను ఓడినందుకు బీజేపీ. నేను గెలవనందుకు కాంగ్రెస్.

అంతటా ఓడిపోయి బీజేపీ ఇక్కడ గెలిచింది. అంతటా గెలిచి కాంగ్రెస్ ఇక్కడ ఓడిపోయింది. అప్పుడిక ఫొటోలు ఉంచేయడానికి, తీసేయడానికి పెద్ద తేడా ఏముంది? టికెట్ ఇవ్వనప్పుడే నేను ఫొటోలు తొలగించలేదు. ఓడినప్పుడు తొలగిస్తానా? ఓటమి కన్నా టికెట్ దక్కకపోవడం ఎక్కువ ఓటమి కాదా?

"ఓటమిలో ఎక్కువ తక్కువలు ఉంటాయా?"... నా బీజేపీ అంతరాత్మ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో అడుగుపెట్టి నన్ను ప్రశ్నిస్తోంది. ఆ అంతరాత్మ నా రూపంలో లేదు. యడ్యూరప్ప ఆకృతిలో ఉంది.

"శెట్టర్‌జీ.. పార్టీ మిమ్మల్ని వదులుకోలేదు! మిమ్మల్ని రాజ్యసభకు పంపిస్తాను అంది. కేంద్ర మంత్రిని కూడా చేస్తానంది. స్వయంగా అమిత్‌షానే మీతో మాట్లాడారు. కానీ మీ దృష్టిలో ఆయన ఫొటోకు ఉన్న విలువ ఆయన మాటకు లేకుండా పోయింది. తప్పు చేశారు శెట్టర్‌జీ. కాంగ్రెస్‌లోకి మారి తప్పు చేశారు. కాంగ్రెస్‌కు మారుపేరు 'ఖర్గే' అని అనుకుని మీరు వెళ్లారు కానీ, సమన్యాయానికి మారుపేరు బీజేపీ అన్న సంగతిని మీరు మీ ఇగో వల్ల మర్చిపోయారు" అంది యడ్యూరప్ప ఆకృతిలోని నా అంతరాత్మ.

"ఇగో కాదు. అది సెల్ఫ్ రెస్పెక్ట్.." అన్నాను.

"ఇగోకు పోయినవారంతా చెప్పే మాటే అది శెట్టర్‌జీ! చెప్పండి.. మీరు కోరుకున్న సెల్ఫ్ రెస్పెక్ట్ మిమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్లింది? విజయానికా, అపజయానికా? రాజ్యసభకా, మీ హుబ్లీ–ధార్వాడ్‌ను గెలుచుకోలేని కాంగ్రెస్ పార్టీకా?" అన్నారు యడ్యూరప్ప.

నేనిక.. నాది కాని నా అంతరాత్మతో సంభాషణను కొనసాగించ దలచలేదు. కుర్చీలో గిర్రున్న వెనక్కు తిరిగి గోడపై మోదీజీ, అమిత్‌షాల ఫొటోల వైపు చూశాను. నాపై నాకెంత సెల్ఫ్ రెస్పెక్ట్ ఉందో, వాళ్లపైనా అంతే రెస్పెక్ట్ ఉంది. అంత పెద్ద నాయకులను అక్కడి నుంచి కదల్చదలచలేదు నేను.

పెద్ద నాయకులు!!


అయినా ప్రజల్ని మించిన పెద్ద నాయకులు ఉంటారా? కర్ణాటక అంతటా బీజేపీ కూలిపోతున్నప్పుడు హుబ్లీ–ధార్వాడ్‌ను మాత్రం వాళ్లెందుకు గట్టిగా పట్టు కుని ఉన్నట్లు?! నన్నెందుకు ఒంటరిని చేసినట్లు?

సెల్ఫ్ రెస్పెక్ట్ అనుకుంటాం కానీ, అదెప్పుడూ మన చేతుల్లో ఉండదు.

వదులుకోవాల్సిన కషాయాలు!

ఆరు రుచులలో (మధుర, కటు, ఆమ్ల, తిక్త, కషాయ, లవణ) కషాయం ఒకటి. వగరు రుచి. కోయిలలు తినే మావి చిగుళ్ళ రుచి లాంటిది. కషాయం అంటే ఏ పదార్థాన్నయినా నీళ్ళలో వేసి, బాగా మరగబెట్టి, దాన్లో సారాన్ని ఆ నీళ్ళు లాగేసుకొన్న తరవాత, వడబోసి ఉంచిన నీరు అని కూడా! ఆయుర్వేద వైద్యంలో కషాయాలది ప్రముఖ స్థానం.

ఆధ్యాత్మికంగా, 'కషాయాలు' అంటే మానవుడు లోకంతో వ్యవహరించేటప్పుడు ప్రదర్శించే కొన్ని ముఖ్యమైన దుర్గుణాలు. కషాయాలను గురించిన చర్చ జైన సంప్రదాయంలో ఎక్కువ. జైనులు క్రోధ (కోపం), లోభ (దురాశ), మాన (అహంకారం), మాయా (మోసం చేసే బుద్ధి) గుణాలను కషాయాలంటారు. ఇవి మనుషులను దుష్ట కర్మలకు ప్రేరేపించి, తత్ఫలంగా జనన మరణ చక్రంలో బద్ధులుగా ఉంచుతాయి. ముక్తికి దూరంగా లాగుతుంటాయి. కషాయాలను వదిలించుకోకపోతే మోక్షం సాధ్యం కాదు. కానీ ఎలా వదిలించుకోవటం? ఈ నాలుగు గుణాలకూ విరుగుడుగా పనిచేసే నాలుగు విరుద్ధ గుణాలను అలవరచుకోవటమే అందుకు మార్గం అంటుంది జైన సిద్ధాంతం. క్రోధం అనే కషాయానికి విరుగుడు క్షమాగుణం. లోభానికి విరుగుడు దాన గుణం. మానం అంటే నేనే(దో) గొప్ప అనే అహంకారం. దానికి విరుగుడు క్రమంగా, శ్రద్ధగా వినయ గుణం అలవరచుకోవటమే. మాయ అంటే వ్యాపారంలో, వ్యవహారంలో కల్లబొల్లి మాటలతో ఇతరులను మోసం చేసే గుణం. ధర్మబద్ధమైన ప్రవర్తనకు కట్టుబడి ఉండే అలవాటు ద్వారా ఈ మాయా గుణం అనే కషాయం ఆట కట్టించవచ్చు. జైన మత సిద్ధాంతమైనా, ఇది ఏ మతానికి చెందిన వారికైనా, ఏ మతానికీ చెందని వారికైనా హితవైన మాటే. మనిషికి అపారమైన హాని కలిగించేది అంతశ్శత్రువులుగా ఉండే అతడి దుర్గుణాలే కదా!



– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.నవమి ఉ.5.46 వరకు, తదుపరి దశమి రా.3.34 వరకు, నక్షత్రం: శతభిషం ఉ. 11.27 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: సా.5.26 నుండి 6.56 వరకు, దుర్ముహూర్తం: సా.4.35 నుండి 5.26 వరకు, శ్రీ హనుమజ్జయంతి, రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు, సూర్యోదయం : 5.48, సూర్యాస్తమయం : 6.36.

క్లుప్తంగా...

జేపీఎస్‌లపై నిరంకుశ వైఖరి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 10వేల మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తుంటే, కేసీఆర్ ప్రభుత్వం వారిపై నిరంకుశంగా వ్యవహరిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిరంకుశ విధానం వల్ల బైరి సోని బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆమెకు నివాళిగా ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఆ గ్రామంలోని మహనీయుల విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాలని కోరారు. కర్ణాటకను అవినీతి, విద్వేషపూరిత రాజకీయాల నుంచి ప్రజలే కాపాడారని పేర్కొన్నారు.

జేపీఎస్‌ల డిమాండ్లను పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, వారిని క్రమబద్ధీకరిస్తూ జీవో విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. జేపీఎస్‌లు వెంటనే విధుల్లో చేరాలని డెడ్‌లైన్ విధించడం అప్రజాస్వామికమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేపీఎస్‌లు గత నెల 28 నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మె చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే జేపీఎస్‌లను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వీరభద్రం కోరారు.

వేధించే ప్రభుత్వాన్ని సహించం: కోదండరాం



సిరిసిల్లటౌన్: ప్రజలను వేధించే ప్రభుత్వాన్ని సహించేది లేదని, ఇక ఏ మాత్రమూ చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హెచ్చరించారు. సిరిసిల్లలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామీణస్థాయిలో ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వెట్టిచాకిరీ చేయిస్తూ.. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుండా ఉద్యోగులను బెదిరించే ప్రభుత్వంపై పోరాటం చేయక తప్పదని పిలుపునిచ్చారు. జేపీఎస్‌లకు బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం సంఘీభావం తెలిపారని, మిగతా అన్ని పార్టీలతోనూ కలిసి మాట్లాడతామని తెలిపారు. జేపీఎస్‌లను పిలిచి మాట్లాడాలిగానీ, ఉద్యోగం నుంచి తీసేస్తామంటే కుదరదని ప్రభుత్వానికి సూచించారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. జేపీఎస్‌లు అధైర్యపడొద్దని, ఎలాంటి అఘాయిత్యాలు చేసుకోవద్దని, తామున్నామని భరోసా ఇచ్చారు. ఆరునెలలు ఓపిక పడితే.. ప్రజలే ప్రభుత్వ భవిష్యత్‌ను నిర్ణయిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆత్మహత్య చేసుకున్న బైరి సోనికి నివాళులు అర్పించారు. జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, జనార్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మార్కెట్లోకి కాసాగ్రాండ్ హాస్‌ఫోర్డ్

సాక్షి, హైదరాబాద్: లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాపర్టీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒకటైన కాసాగ్రాండ్ హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. రూ.320 కోట్ల టర్నోవర్‌తో మొదటి కాసాగ్రాండ్ హాస్‌ఫోర్డ్, విలాసవంతమైన బ్రిటిష్ స్టైల్ విల్లా కమ్యూనిటీని నగరంలోని ఔటర్ రింగ్‌రోడ్డులో ప్రారంభించింది. ఈ సందర్భంగా కాసాగ్రాండ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ మాట్లాడారు. రియల్ ఎస్టేట్ మార్కెట్‌తో వాణిజ్య వస్తువులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. కాసాగ్రాండ్ ఎల్లప్పుడూ విలువలను కొనసాగిస్తుందని హామీనిచ్చారు. ఇళ్లను యజమానులకు సకాలంలో అందించడమే తమ ధ్యేయన్నారు.

నేషనల్ హైవేలు కాదు.. లోకల్ రోడ్లే డేంజర్!

- స్థానిక రోడ్లపైనే ఎక్కువ ప్రమాదాలు.. గతేడాది గ్రామీణప్రాంతాల్లో 4,684 మంది మృతి
- హెల్మెట్ వాడకపోవడం, సీటుబెల్ట్ పెట్టుకోకపోవడమూ మరో కారణం

సాక్షి, హైదరాబాద్

విశాలంగా ఉండే జాతీయ రహదారులు.. వేగంగా దూసుకెళ్లే వాహనాలు... దీంతో అక్కడే ఎక్కువ ప్రమాదాలు జరుగుతాయని అనుకోవడం సహజం. కానీ గ్రామీణ ప్రాంతాలు, రాష్ట్ర రహదారులే యమ డేంజర్ అని పోలీస్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జాతీయ రహదారుల్లో ప్రయాణంతో పోలిస్తే వాహనదారులు స్థానిక రోడ్లపై నడిపేటప్పుడు అంత్యంత నిర్లక్ష్యంగా ఉంటున్నారని తెలుస్తోంది. పక్క ఊరికే కదా వెళ్లేది.. పది కిలోమీటర్ల దూరానికే హెల్మెట్ ఎందుకు? ఊర్లో కూడా హెల్మెట్ పెట్టుకుని తిరగాలా? కారులో సీటు బెల్ట్ పెట్టుకోకున్నా అడిగేదెవరు..? అన్న ధీమాతో వెళుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నట్టు వెల్లడవుతోంది.




నిర్లక్ష్యమే మృత్యుపాశం..

వాహనదారుల నిర్లక్ష్యమే వారి పాలిట మృత్యువై వెంటాడుతోంది. జాతీయ రహదారులతో పోలిస్తే.. స్థానిక రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో ఏమాత్రం రోడ్డు భద్రత నియమాలను లెక్క చేయడం లేదు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మృతులు ద్విచక్రవాహనదారులే ఉంటున్నారు. అయితే వీరిలో ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడం.. హెల్మెట్ పెట్టుకున్నా.. దాన్ని సరిగా లాక్ చేయకపోవడం మరణాలకు ప్రధాన కారణాలని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. దూరం ఎంతైనా సరే.. తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను అలవర్చుకోవాలని వారు సూచిస్తున్నారు. అదేవిధంగా కారులో సీటుబెల్ట్, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడకం తప్పక అలవాటు చేసుకోవాలని చెప్తున్నారు.

పట్టణ, గ్రామీణప్రాంతాల వారీగా 2022లో నమోదైన రోడ్డు ప్రమాదాలు..



రాష్ట్రంలో 2022లో నమోదైన రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య ఇలా..



పోటీ చేస్తాం.. వలస గోస వినిపిస్తాం

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి సత్తా చాటాలని గల్ఫ్ జేఏసీ నిర్ణయం
- 'గల్ఫ్' సమస్యల పరిష్కారానికి అదే మార్గమంటున్న కమిటీ నేతలు

మోర్తాడ్ (బాల్కొండ): ఎన్నికల ద్వారానే తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని గల్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలను వేదికగా చేసుకుని గల్ఫ్ బోర్డు, సమగ్ర ప్రవాసీ విధానాన్ని (ఎన్ఆర్ఐ పాలసీ) సాధించాలని, అందుకోసం పోటీయే మార్గమని ఇటీవల సమావేశమై నిర్ణయించింది. 2019 పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి 175 మంది పసుపు రైతులు నామినేషన్లు వేసి దేశం దృష్టిని ఆకర్షించిన విషయం విదితమే. ఇదే తరహాలో గల్ఫ్ ప్రభావం ఉన్న 32 అసెంబ్లీ నియోజకవర్గాలలో గల్ఫ్ బాధితులతో పెద్దసంఖ్యలో నామినేషన్లు వేయించి తమ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలపాలని భావిస్తోంది. గల్ఫ్ జేఏసీ కార్యాచరణపై ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు సమాచారం సేకరిస్తున్నట్టు సమాచారం.

32 నియోజకవర్గాల్లో ప్రభావం!

దాదాపు 15 లక్షల మంది తెలంగాణవాసులు గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. మూడు దశాబ్దాలుగా మరో 30 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి తిరిగి వచ్చారు. గల్ఫ్ కార్మికుల కుటుంబసభ్యుల ఓట్లను లెక్కలోకి తీసుకుంటే



నినాదాలు చేస్తున్న గల్ఫ్ జేఏసీ నాయకులు (ఫైల్)

సుమారు కోటి వరకు ఉంటుందని జేఏసీ నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల బరిలోకి దిగి తమ ప్రభావం చూపాలని జేఏసీ భావిస్తోంది. గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉన్న బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి, కోరుట్ల, జగిత్యాల్, ధర్మపురి, ఎల్లారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, మంచిర్యాల, కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూరు, బోధన్, పెద్దపల్లి, మక్తల్, దేవరకద్ర, మెదక్, సిద్దిపేట, దుబ్బాక, నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి, పరిగి నియోజకవర్గాలను తాము ప్రభావితం చేయగలమని జేఏసీ చెబుతోంది.

పోటీకి పలువురు సిద్ధం!

గోవిందుల అఖిల, మండలోజు సుచరిత, నారుకుల్ల అనిత (జగిత్యాల జిల్లా గోపాల్‌పూర్, ఇబ్రహీంపట్నం, తిప్పాయిపల్లి), ముడా లక్ష్మి (నిర్మల్ జిల్లా కౌట్ల(కే) గల్ఫ్ జేఏసీ మద్దతుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ భర్తలు వివిధ కారణాలతో గల్ఫ్ దేశాల్లో మరణించగా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం అందలేదని, తమ గోడు వినిపించేందుకే పోటీకి దిగుతున్నట్టు వీరు చెబుతున్నారు. ఇంకా పలు నియోజకవర్గాల్లో గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో మూకుమ్మడిగా నామినేషన్లు వేసే యోచనలో ఉన్నారు.

ప్రభుత్వాలు మాట తప్పడంతోనే..



గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు మాట తప్పడంతోనే ఎన్నికల్లో పోటీకి జేఏసీ సిద్ధమవుతోంది.
– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

సత్తా చూపిస్తాం..



ఎన్నికల్లో పోటీ చేసి గల్ఫ్ వలస కార్మికుల సత్తా ఏమిటో చూపిస్తాం. ఎన్నికల బరిలో నిలిచి మా బలాన్ని నిరూపిస్తాం.
–గుగ్గిల్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ చైర్మన్

జగిత్యాల బంద్ ప్రశాంతం



జగిత్యాల: జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జిల్లాలో శనివారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆర్టీసీ బస్సులో సీటు విషయమై ఇద్దరు మహిళల మధ్య వివాదం తలెత్తగా, అందులో ఓ మహిళ భర్త అయిన ఎస్ఐ అనిల్ జోక్యం చేసుకున్నారు. ఈ క్రమంలో ఎస్సై తనను కొట్టారంటూ మరో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐని సస్పెండ్ చేశారు. ఎలాంటి విచారణ లేకుండా, ఓ వర్గానికి కొమ్ముకాస్తూ ఎస్ఐని సస్పెండ్ చేయడం అన్యాయమంటూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ప్రజలు బంద్ పాటించారు.



సోని అంతిమయాత్రలో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బందోబస్తు మధ్య సోని అంత్యక్రియలు

నర్సంపేట రూరల్: పోలీసుల భారీ బందోబస్తు నడుమ శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని (31) అంత్యక్రియలను నిర్వహించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రంగాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నర్సంపేట పట్టణానికి చెందిన సోని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అంతిమయాత్ర సందర్భంగా నర్సంపేటలో శనివారం ఉదయం సోని ఇంటివద్దకు పెద్ద ఎత్తున జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేరుకున్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని దారి మధ్యలో అంతిమ యాత్ర ఎదుట బైఠాయించారు. దీంతో ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్, ఏసీపీలు సంపత్‌రావు, శివరామయ్య తదితరులు పంచాయతీ కార్యదర్శులకు నచ్చజెప్పారు. అయితే వారు ఎంతకీ శాంతించకపోవడంతో పోలీసులు వారిని పక్కకు తప్పించారు. అనంతరం అంతిమయాత్ర ముందుకు సాగింది.

మిరప 'తేజ'స్సు

- చరిత్ర సృష్టించిన 'తేజా'రకం నిల్వ మిర్చి
- క్వింటా రూ.25,800

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం మిర్చి ధర చరిత్ర సృష్టించింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి క్వింటాకు శనివారం రూ.25,800 ధర పలికింది. చరిత్రలోనే తేజా రకం మిర్చికి ఇంతటి ధర ఎప్పుడూ లభించలేదు. విదేశాల్లో ఈ రకం మిర్చికి డిమాండ్ ఉండటంతో ధర పెరుగుతోందని విశ్లేషిస్తున్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన అనంత లక్ష్మి పేరిట కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన 25 బస్తాల



మిర్చిని ఎస్‌వీఎస్ చిల్లీస్ ట్రేడర్స్ బాధ్యులు అత్యధిక ధరకు కొనుగోలు చేశారు. తేజా రకం మిర్చి ఈ ఏడాది మార్చి 20న రూ.25,550 ధర పలికింది. అదే రికార్డుగా భావిస్తుండగా.. ఇప్పుడు రూ.25,800 ధరతో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది పంట సాగు కూడా బాగా తగ్గడం, చీడపీడలతో దిగుబడి తగ్గడానికి తోడు దేశ, విదేశాల నుంచి ఆర్డర్లు వస్తుండటంతో ధరకు రెక్కలొచ్చాయి.

జేపీఎస్‌ల సమ్మె విరమణ

▶ మొదటి పేజీ తరువాయి



సమ్మె విరమణ ప్రకటన చేస్తున్న జేపీఎస్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్

తొర్రూరులో వెల్లడించారు. అంతకుముందు వరంగల్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) అధ్యక్షుడు ఎ.శ్రీకాంత్‌గౌడ్ తదితరులు కలిశారు. ఈ క్రమంలో తొలుత సమ్మె విరమించి వెంటనే విధుల్లో చేరాలని వారికి మంత్రి సూచించినట్టు సమాచారం. ఆది లేదా సోమవారాల్లో టీపీఎస్ఎఫ్ ప్రతినిధులతో ఆయా అంశాలపై చర్చిస్తామని మంత్రి హామీనిచ్చిన మీదట సోమవారం నుంచి విధుల్లో చేరనున్నట్టు సంఘం ప్రకటించింది.

జేపీఎస్‌ల వ్యవస్థ సృష్టికర్త కేసీఆరే

కాగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో 16 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక, శాంతియుత సమ్మె నిర్వహించామని, జేపీఎస్‌ల వ్యవస్థను సృష్టించిందే సీఎం కేసీఆర్ అని సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. జేపీఎస్‌ల వల్లే తెలంగాణకు కేంద్రం నుంచి 73 అవార్డులు వచ్చాయని, మున్ముందు సైతం అదే రీతిన పనిచేసి మంచి ఫలితాలు రాబడుతామని తెలిపారు. ఈనెల 15వ తేదీ (సోమవారం) నుంచి యథావిధిగా విధుల్లో కొనసాగుతామని స్పష్టం చేశారు. సమ్మెకు సహకరించిన ప్రతి ఒక్క జూనియర్ పంచాయతీ కార్యదర్శికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ కఠిన వైఖరి ప్రభావంతోనే విరమణ?

ప్రభుత్వం కఠినచర్యలకు దిగనున్నట్టు చేసిన ప్రకటన సమ్మె విరమణను ప్రభావితం చేసినట్టు తెలుస్తోంది. శనివారంలోగా విధుల్లో చేరకుండా గైర్హాజరైన జేపీఎస్, ఓపీఎస్‌ల తొలగింపుతో పాటు వారి స్థానాల్లో తాత్కాలిక పద్ధతుల్లో నియామకాలు చేపట్టాలని సీఎస్ ఎ.శాంతికుమారి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దాకా సమ్మె కొనసాగించాలా వద్దా, విరమిస్తే పరిస్థితి ఏమిటి, కొనసాగిస్తే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందనే దానిపై టీపీఎస్ఎఫ్ రాష్ట్ర,జిల్లా కమిటీల్లో తీవ్రస్థాయిలో చర్చ సాగింది. సమ్మెలో ఉన్న జేపీఎస్‌లలోనూ పునరాలోచన మొదలైంది. దీనికి తగ్గట్టే శనివారం సాయంత్రానికి పలుజిల్లాల్లో పెద్దసంఖ్యలోనే జేపీఎస్‌లు విధుల్లో చేరినట్టు పీఆర్ కమిషనరేట్‌కు నివేదికలు అందాయి. ఇది సమ్మె విరమణ దిశగా ప్రభావం చూపినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వం కూడా సమ్మె చేసిన జేపీఎస్‌ల పట్ల కొంత చూసీచూడనట్టు వ్యవహరించాలని భావిస్తున్నట్టు సమాచారం. జేపీఎస్‌ల సమ్మె విరమణ నేపథ్యంలో.. వారి స్థానంలో గతంలో జేపీఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారి నియామకం, గ్రామాల్లో స్థానికంగా డిగ్రీ పాసై, కంప్యూటర్ పరిజ్ఞానమున్న వారిని నియమించే ప్రక్రియను కూడా నిలిపేసినట్టు తెలుస్తోంది.

ఎంజీఎంలో రోగి మృతి

వైద్యం వికటించడంతోనే చనిపోయాడని బంధువుల ఆందోళన

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఓ రోగి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన కాసు రాములు (46) జీవనోపాధికోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. శుక్రవారం ఉదయం స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో అతని కాళ్లు విరగడంతో చికిత్స కోసం ఉదయం 11 గంటలకు ఎంజీఎం ఆస్పత్రికి తీసుకు వచ్చారు. కాగా, శనివారం ఉదయం బాగానే ఉన్న తన తండ్రి రాములు మధ్యాహ్నం 1.30 సమయంలో నర్సు ఒక్కసారిగా మూడు ఇంజక్షన్‌లు ఇచ్చిన మరుక్షణమే మృతి చెందాడని అతని కుమారుడు అనిల్ తెలిపాడు. నర్సు ఇచ్చిన ఇంజక్షన్లు వికటించడం వల్లనే మృతి చెందాడని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీనిపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చికిత్స అందిస్తున్న సమయంలో సడన్ కార్డియాక్ అరెస్ట్ కావడంతో రాములు



ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

చనిపోయినట్లు తెలిపారు.

క్యాజువాలిటీ వద్ద ఉద్రిక్తత.. పోలీసుల రంగ ప్రవేశం

రాములు మృతదేహంతో కుటుంబ సభ్యులు క్యాజువాలిటీ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జరిగిన ఘటనపై వివరించేందుకు వచ్చిన ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎంఓ మురళితోపాటు పలువురు వైద్యులతో మృతుడి బంధువులు వాగ్వాదానికి దిగారు. ఆందోళన విషయాన్ని తెలుసుకున్న మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు.. పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మృతుని బంధువులు శాంతించారు.

రిసెప్షన్ నుంచి తిరిగివస్తూ..

- లారీని ఢీకొట్టిన పెళ్లిబృందం డీసీఎం వాహనం
- ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి
- కొత్త జంట సహా ఐదుగురికి తీవ్రగాయాలు
- సంగారెడ్డి జిల్లాలో ఘటన

పటాన్‌చెరు టౌన్: పెళ్లి బృందంతో వెళుతున్న డీసీఎం వాహనం ఓ లారీని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. శనివారం తెల్లవారుజామున సంగారెడ్డి జిల్లా రుద్రారం గ్రామ శివారులో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన రామచంద్రయ్య కూతురు నాగరాణికి, వికారాబాద్ జిల్లా మోయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామానికి చెందిన భూషణంతో మే 11వ తేదీన వివాహం జరిగింది. 12వ తేదీన రామచంద్రయ్య కుటుంబసభ్యులు, బంధువులు చిన్న మంగళారంలో రిసెప్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ఓ లారీని పెళ్లి బృందంతో వస్తున్న డీసీఎం వాహనం శనివారం తెల్లవారుజామున



ప్రమాదంలో ధ్వంసమైన డీసీఎం



కిష్టమ్మ (ఫైల్)



రాములమ్మ (ఫైల్)

ఒంటి గంట సమయంలో బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కంది మండలం చిమ్నాపూర్ గ్రామానికి చెందిన రాములమ్మ (63), పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన కిష్టమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. పెళ్లికొడుకు భూషణం, పెళ్లికూతురు నాగరాణితోపాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటనలో డీసీఎంలో ఉన్న మరో 42 మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడినవారిని వివిధ ఆస్పత్రుల్లో చేర్పించారు. పెళ్లి కూతురు కాలు విరగడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, డీసీఎం డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభంజనం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం • 224 స్థానాల్లో 136 హస్తగతం • బీజేపీకి 65 సీట్లే

కాంగ్రెస్‌కు అభినందనలు



''కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి అభినందనలు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆ పార్టీ కృషి చేస్తుందని ఆశిస్తున్నా. కర్ణాటక ఎన్నికల్లో మాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. అహర్నిశలు శ్రమించిన బీజేపీ కార్యకర్తలకు అభినందనలు. రానున్న రోజుల్లో మరింత దీక్షతో కర్ణాటక ప్రజలకు సేవలందిస్తాం''

– ప్రధాని నరేంద్ర మోదీ

ఇది ప్రజల విజయం

''ఇది ప్రజా గెలుపు. సమష్టి కృషి. బీజేపీ నాయకుల అహంకారమే వారిని ఓడించింది. కాంగ్రెస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించిన కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు. ఈ గెలుపుతో దక్షిణ భారతదేశం బీజేపీరహితంగా మారింది. రాజ్యాంగ రక్షణకు ప్రజలిచ్చిన విజయమిది. కాంగ్రెస్ ఇచ్చిన ఐదు గ్యారెంటీల అమలుకు తొలి కేబినెట్ భేటీలోనే చర్యలు తీసుకుంటాం. రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేసిన 99 శాతం ప్రాంతాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది''

– కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

గెలుపోటములను సమానంగా చూస్తా



''రాష్ట్ర ప్రజలిచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమం. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తాను. నాకు, మా పార్టీకి ఇవేమీ కొత్తకాదు. ఈ ఓటమి నాకు గానీ, మా పార్టీకి గానీ అంతిమం కాదు. మా పోరాటం ఆగదు. ప్రజలకు తోడుగా నిలుస్తాం. పార్టీని బలోపేతం చేస్తాం. ఈ ఫలితాలతో ఎలాంటి ఆందోళనకు గురికావద్దని మా కార్యకర్తలను కోరుతున్నా. మా పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు కృతజ్ఞతలు''

– జేడీ(ఎస్) నేత కుమారస్వామి


సాక్షి, బెంగళూరు: కన్నడ ఓటరు కాంగ్రెస్‌కే జై కొట్టాడు. రాష్ట్రంలో అధికార పార్టీని ఓడించే నాలుగు దశాబ్దాల ఆనవాయితీని కొనసాగిస్తూ బొమ్మై సారథ్యంలోని బీజేపీ సర్కారును ఇంటికి సాగనంపాడు. ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు కాంగ్రెస్ ఉచిత హామీల ముందు మోదీ మేజిక్ ఏమాత్రం పని చేయలేదు. కార్యకర్త స్థాయి నుంచి అగ్ర నాయకత్వం దాకా సమష్టిగా చేసిన కృషి ఫలించి కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. హంగ్ ఊహాగానాలకు, హోరాహోరీ తప్పదన్న విశ్లేషణలకు చెక్ పెడుతూ తిరుగులేని మెజారిటీ సాధించింది. 224 సీట్ల అసెంబ్లీలో మెజారిటీకి 133 సీట్లు కావాల్సి ఉండగా ఏకంగా 136 స్థానాలను హస్తగతం చేసుకుంది. తద్వారా పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సొంతంగా మెజారిటీ సాధించి సంబరాల్లో మునిగిపోయింది. ఇండియాటుడే వంటి ఒకట్రెండు సంస్థలు తప్ప మిగతా ఎగ్జిట్ పోల్స్ ఏవీ కాంగ్రెస్‌కు ఇంతటి విజయాన్ని ఊహించలేకపోయాయి. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీపై విపక్షాల ఉమ్మడి పోరుకు నేతృత్వం వహించేందుకు అత్యవసరమైన నైతిక బలాన్ని ఈ విజయం ద్వారా కాంగ్రెస్ కూడగట్టుకుంది. అంతేగాక వరుస ఎన్నికల్లో బీజేపీ చేతిలో కోలుకోలేని దెబ్బలు తింటూ ఓ పెద్ద రాష్ట్రంలో నికార్సైన గెలుపు కోసం ఏళ్ల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న పార్టీకి ఈ ఘన విజయం ఎంతో ఊరటనిచ్చింది. మరోవైపు కర్ణాటక వంటి కీలక రాష్ట్రంలో ఇంతటి పరాభవం బీజేపీకి గట్టి ఎదురు దెబ్బేనని భావిస్తున్నారు. ఈ ఓటమితో దక్షిణాదిన ఏకైక రాష్ట్రం కూడా కమలం పార్టీ చేజారింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 104 సీట్లతో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ ఈసారి 39 స్థానాలు కోల్పోయింది. 78 సీట్లకు పరిమితమైన కాంగ్రెస్ ఈసారి ఏకంగా మరో 58 స్థానాలు కైవసం చేసుకుంది. ఇక జేడీ(ఎస్) ఇంటిగోలతో చిర్రెత్తిన ఓటరు ఈసారి ఆ పార్టీకి గట్టిగానే వాత పెట్టాడు. హంగ్ వస్తే ఎప్పట్లా కింగ్‌మేకర్ కావాలని ఆశపడ్డ ఆ పార్టీ దారుణంగా చతికిలపడింది. 2018లో గెలిచిన 37 సీట్లలో ఏకంగా 18 స్థానాలు కోల్పోయి చిక్కి 'సగ'మైంది. 2018లో కాంగ్రెస్, జేడీ(ఎస్) ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వాన్ని 14 నెలలకే బీజేపీ పడగొట్టింది. ఆ రెండు పార్టీల్లోని 17 మంది ఎమ్మెల్యేలను లాగేసింది. వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికల్లో 15 సీట్లు గెలిచి మెజారిటీ సాధించి గద్దెనెక్కింది. ఈ గోడ దూకుళ్లతో విసిగిన కన్నడ జనం ఈసారి సుస్థిర ప్రభుత్వానికి జై కొట్టారు. ఫలితాల సరళి స్పష్టమవుతూనే బెంగళూరు నుంచి హస్తిన దాకా కాంగ్రెస్ కార్యాలయాల్లో సంబరాలు మిన్నంటాయి. బీజేపీ కార్యాలయాలు కళ తప్పి కన్పించాయి. ప్రజా తీర్పును శిరసావహిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రకటించారు. ఘనవిజయం సాధించిన కాంగ్రెస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇది విద్వేష రాజకీయాలపై ప్రేమ సాధించిన విజయమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. తృణమూల్, ఎన్సీపీ సహా దేశవ్యాప్తంగా పలు విపక్ష పార్టీలు కాంగ్రెస్ విజయం పట్ల హర్షం వెలిబుచ్చాయి. బీజేపీ నియంతృత్వ పోకడలకు, కక్షసాధింపు రాజకీయాలకు ఇదో గుణపాఠమన్నాయి.



రాజస్తాన్‌లోని బికనేర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఆద్యంతం హస్తం హవా...

కర్ణాటక అసెంబ్లీకి బుధవారం ఒకే దశలో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఏకంగా 73.19 శాతం పోలింగ్ నమోదైంది. శనివారం ఉదయం 8 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఓట్ల లెక్కింపు మొదలైంది. ప్రారంభం నుంచే కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. ఏ దశలోనూ వెనక్కు తగ్గకుండా దూసుకుపోయింది. ఆద్యంతం వెనుకంజలోనే కొనసాగిన బీజేపీ ఎక్కడా కోలుకోలేకపోయింది.



6 ప్రాంతాల్లో నాలుగింట్లో కాంగ్రెసే

కర్ణాటకలోని ఆరు ప్రాంతాల్లో నాలుగింట్లో కాంగ్రెస్ హవాయే కొనసాగింది. జేడీ(ఎస్) కంచుకోట పాత మైసూరుతో పాటు ముంబై కర్ణాటక, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత ప్రాంతం హైదరాబాద్ కర్ణాటక, సెంట్రల్ కర్ణాటకల్లో కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది. బీజేపీ కేవలం కోస్తా కర్ణాటకలోనే పై చేయి సాధించగా బెంగళూరులో కాంగ్రెస్‌కు సమవుజ్జీగా నిలిచింది. రాహుల్ గాంధీ ఇటీవలి భారత్ జోడో పాదయాత్రలో భాగంగా కర్ణాటకలో నడిచిన 20 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 15 చోట్ల కాంగ్రెస్ నెగ్గడం విశేషం.

బీజేపీకి తగ్గింది 0.2 శాతం ఓట్లే... పోయిందేమో 39 సీట్లు!

బీజేపీకి మొత్తమ్మీద ఓట్ల శాతం తగ్గకపోయినా ఏకంగా 39 సీట్లు చేజారడం విశేషం. ఆ పార్టీకి 2018లో 36.22 శాతం రాగా ఈసారి కూడా 36 శాతం సాధించింది. అప్పుడు 38 శాతం సాధించిన కాంగ్రెస్ ఈసారి ఏకంగా 43 శాతం ఒడిసిపట్టింది. 5 శాతం అదనపు ఓట్లతో అదనంగా 58 సీట్లు కొల్లగొట్టింది. 1999లో కాంగ్రెస్ 132 సీట్లు గెలిచింది. ఆ తర్వాత దాదాపు పాతికేళ్లకు అంతకంటే మెరుగైన విజయం సాధించింది. జేడీ(ఎస్) ఓట్ల శాతం 18.36 నుంచి 13.2కు తగ్గింది. రద్దవనున్న అసెంబ్లీలో బీజేపీకి 117 సీట్లు, కాంగ్రెస్‌కు 69, జేడీ(ఎస్)కు 29, బీఎస్పీకి 1, స్వతంత్రులకు 2 సీట్లున్నాయి. 6 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.



ఫలితాల అనంతరం డీకే శివకుమార్, ఖర్గే, సిద్ధరామయ్య విజయాభివాదం


హస్తానికి బూస్టర్ డోసు

ఇక కాంగ్రెస్ నేతృత్వంలోనే విపక్ష కూటమి!


న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దక్కిన అఖండ విజయం కాంగ్రెస్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. కీలకమైన రాష్ట్రంలో పాగా వేయడంతో పార్టీ నేతల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. చాలాఏళ్లుగా గెలుపు రుచి లేకుండా నీరసించిపోయిన కాంగ్రెస్‌కు ఇది నిజంగా ఒక బూస్టర్ డోసు. వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు ఇది దివ్యౌషధంగా పనిచేయనుంది. కేంద్రంలో అధికార బీజేపీని ఢీకొట్టే ప్రధాన ప్రతిపక్షం ఎవరన్న ప్రశ్నకు కొంతవరకు సమాధానం దొరికినట్లే. బీజేపీకి వ్యతిరేకంగా ఒక బలమైన కూటమిని నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ అవి సాకారం కావడం లేదు. బీజేపీయేతర, కాంగ్రెస్సేతర కూటమి అనే ప్రయత్నాలకు బ్రేక్ పడొచ్చని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. కర్ణాటకలో విజయం నేపథ్యంలో ఇతర పార్టీలు కాంగ్రెస్ ఛత్రఛాయలోకి చేరే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోనే ఏకైక విపక్ష కూటమి ఏర్పాటైనా ఆశ్చర్యం లేదు.

ఇక నాలుగు రాష్ట్రాలపై గురి

లోక్‌సభ సభ్యుడిగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ఇటీవలే అనర్హత వేటు వేయడం, అధికారిక నివాసం నుంచి ఆయనను బలవంతంగా ఖాళీ చేయించడం కాంగ్రెస్ పట్ల ప్రజల్లో సానుభూతి కలిగించాయి. రాహుల్ బీసీల వ్యతిరేకి అంటూ బీజేపీ చేసిన ప్రచారం ఫలించలేదు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాన్ని హస్తగతం చేసుకోవడం కాంగ్రెస్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కర్ణాటకలో స్థానిక నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం, వారితోనే ఎక్కువగా ప్రచారం చేయించడం కాంగ్రెస్‌కు లాభించింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర జరిగిన ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో 15కు పైగా సీట్లు సాధించింది. బీజేపీ ప్రభుత్వ అవినీతిని కాంగ్రెస్ ఎండగట్టింది. కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రజలు విశ్వసించారు. ఈ ఏడాది తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ రెండు రాష్ట్రాల్లో మళ్లీ నెగ్గడంతోపాటు తెలంగాణ, మధ్యప్రదేశ్‌లోనూ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. కర్ణాటకలో విజయంతో ఆ పార్టీ ఇక మరింత దూకుడుగా వ్యవహరించనుంది. ఈ గెలుపు జాతీయ స్థాయిలో తమ పార్టీ పునర్వైభవానికి దోహదపడుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ చెప్పారు.



2018, 2023లలో ప్రాంతాల వారీగా పార్టీలకు వచ్చిన సీట్లు



ప్రాంతం	సంవత్సరం	కాంగ్రెస్	బీజేపీ	జేడీ(ఎస్)	ఇతరులు
హైదరాబాద్ కర్ణాటక	2023	26	10	3	2
హైదరాబాద్ కర్ణాటక	2018	21	15	4	0
ముంబై కర్ణాటక	2023	33	16	1	0
ముంబై కర్ణాటక	2018	17	30	2	1
పాత మైసూరు	2023	39	6	14	2
పాత మైసూరు	2018	17	11	27	2
కోస్తా కర్ణాటక	2023	6	13	0	0
కోస్తా కర్ణాటక	2018	3	16	0	0
సెంట్రల్ కర్ణాటక	2023	19	5	1	0
సెంట్రల్ కర్ణాటక	2018	5	21	0	0
బెంగళూరు	2023	13	15	0	0
బెంగళూరు	2018	17	11	4	0

కలసి ఉంటే కలదు జయం

- ఎన్నికల్లో కలసికట్టుగా పోరాడి గెలిచిన కాంగ్రెస్
- కలిసొచ్చిన ఖర్గే అనుభవం సిద్ధూ, డీకే శివకుమార్ దోస్తీ

రాహుల్ జోడో యాత్ర నింపిన ఉత్సాహంతో, మల్లికార్జున ఖర్గే మంత్రాంగంతో ఉప్పు, నిప్పుగా ఉండే దిగ్గజ నేతలు సిద్ధూ, డీకే ఒక్కటయ్యారు. పోస్టర్ల నుంచి ప్రచారం వరకు ఒకే మాట ఒకే బాటగా నడిచారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. మత రాజకీయాలను సమష్టిగా ఎదుర్కొన్నారు. ఫలితంగా కర్ణాటకలో కాంగ్రెస్ అందరికీ కొత్తగా కనిపించింది. అనూహ్య విజయంతో లోక్‌సభ ఎన్నికలకు కావల్సిన ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంది.

అవినీతిపై ప్రచారం

రాష్ట్రంలో బసవరాజ్ బొమ్మై సర్కార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల్ని కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది. పేటీఎంను గుర్తుకు తెచ్చేలా ''పేసీఎం'' అంటూ బొమ్మై ముఖం, క్యూఆర్ కోడ్‌తో పోస్టర్లు వేయడం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. 40% కమీషన్ సర్కార్ అంటూ ప్రచారాన్ని గ్రామ గ్రామల్లోకి తీసుకువెళ్లారు. గ్రామీణాభివృద్ధి మంత్రి కె.ఎస్. ఈశ్వరప్ప పబ్లిక్ వర్క్స్ ప్రాజెక్టుల్లో 40% కమీషన్‌ను డిమాండ్ చేశారన్న ఆరోపణలతో ఈ ప్రచారం ఊపందుకుంది. ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీజేపీ ఎమ్మెల్యే విరూపాక్ష కుమారుడు 40 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం వంటివన్నీ కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుంది.

సిద్ధూ, డీకే కాంబినేషన్

కాంగ్రెస్ పార్టీకి మరే రాష్ట్రంలో లేని విధంగా బలమైన నాయకులు కర్ణాటకలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ జోడు గుర్రాలుగా మారి గెలుపు రథాన్ని పరుగులు పెట్టించారు. ఇద్దరి మధ్యనున్న విభేదాలను పక్కన పెట్టి కలసికట్టుగా పని చేశారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ప్రజాధ్వని యాత్ర నిర్వహించారు. ఎన్నికల వ్యూహాల దగ్గర్నుంచి పార్టీ మేనిఫెస్టో వరకు, టిక్కెట్ల పంపిణీ నుంచి బూత్ మేనేజ్‌మెంట్ వరకు సంయుక్తంగా వ్యూహాలు రచించారు. పార్టీలో దిగ్గజ నాయకులిద్దరూ ఒక్కటి కావడంతో నాయకులంతా చేతులు కలపడం రావడం కాంగ్రెస్‌కు కలిసొచ్చింది.

ఖర్గే అనుభవం

ఏ పార్టీకైనా అనుభవజ్ఞులైన పెద్దలే కొండంత అండ. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే 80ఏళ్ల వయసులో తన సొంత రాష్ట్రంలో ఎన్నికల్ని అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకున్నారు. పార్టీలో అత్యంత శక్తిమంతమైన నాయకులైన సిద్దరామయ్య, శివకుమార్‌లను ఏకతాటిపైకి తీసుకురావడంతో ఖర్గే సగం విజయం సాధించారు. టిక్కెట్ల పంపిణీపై ముందస్తుగా కసరత్తు చేసి 124 మందితో తొలి జాబితా విడుదల చేయడం, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తూ నియోజకవర్గాల్లో అసమ్మతి గళాలు లేకుండా చూశారు. అటు అధిష్టానానికి, ఇటు స్థానిక నాయకత్వానికి వారధిగా ఉంటూ నెల రోజులుగా రాష్ట్రంలోనే మకాం వేసి పార్టీని గెలుపు తీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు.

సానుభూతే ఆయుధం

బీజేపీ జాతీయ నాయకత్వం చేసిన కక్షపూరిత రాజకీయాలు కూడా వికటించాయి. ప్రభుత్వంపై ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా పట్టించుకోని వారు కాంగ్రెస్ నాయకులపై సీబీఐ, ఈడీ కేసులు పెట్టి వేధించడం ప్రజల్లో సానుభూతిని పెంచింది. పరువు నష్టం కేసులో రాహుల్ దోషిగా తేలి ఎంపీగా అనర్హత వేటునెదుర్కోవడం, పీసీసీ అధ్యక్షుడు శివకుమార్‌పై సీబీఐ కేసులు పెట్టి తీహార్ జైల్లో పెట్టడం వంటివి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారాయి. శివకుమార్ కనకపుర నియోజకవర్గం నుంచి లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించడమే దీనికి తార్కాణం.

లింగాయత్ ఓట్లు

కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి బలమైన మద్దతుదారులైన లింగాయత్ ఓటు బ్యాంకుని కాంగ్రెస్ పార్టీ విజయవంతంగా చీల్చింది. బి.ఎస్. యడీయూరప్పని సీఎంగా తప్పించడంతో ఆ వర్గాన్ని పార్టీ నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఎన్నికలకు కాస్త ముందు మాజీ ముఖ్యమంత్రి జగదీష్ షెట్టర్, మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావాదిలు కాంగ్రెస్ గూటికి చేరడం కలిసొచ్చింది. పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ స్వయంగా లింగాయత్ మఠాలన్నీ సందర్శించి తాము అధికారంలోకి వస్తే వారి డిమాండ్లన్నీ తీరుస్తామన్న హామీలు ఇవ్వడంతో ఈ సారి లింగాయత్ ఓటర్లు కాంగ్రెస్‌వైపు మళ్లారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మైనార్టీల అండదండ..

పోలింగ్‌కు కొద్ది రోజులు ముందు బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ చేర్చడం ఆ పార్టీకి నష్టం చేకూరుస్తుందని అందరూ భావించారు. కానీ మైనార్టీ ఓట్ల ఏకీకరణ జరిగి కాంగ్రెస్‌కు కలిసివచ్చింది. ఓల్డ్ మైసూరుతో పాటు అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిం ఓటర్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు ఓటు వేశారు. హిజాబ్, హలాల్, అజాన్ వివాదాలతో ముస్లిం ఓటర్లందరూ ఏకమయ్యారు. ఓల్డ్ మైసూరులో కాంగ్రెస్, జేడీ(ఎస్) మధ్య ముస్లిం ఓట్లు చీలిపోయేవి. కానీ ఈ సారి అన్ని ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ వెంటే మైనార్టీలు నడిచారు.

జోడో యాత్ర జోష్..

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కూడా పార్టీ విజయానికి దోహదపడింది. కర్ణాటకలో అత్యధికంగా 24 రోజులు నడిచిన రాహుల్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఎనిమిది జిల్లాల్లో 500 కి.మీ. మొత్తం 20 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా రాహుల్ నడిచారు. 2018 ఎన్నికల్లో ఈ 20 సీట్లలో అయిదు స్థానాలనే గెలుచుకున్న కాంగ్రెస్ ఈ సారి 15 స్థానాల్లో విజయభేరి మోగించింది.

'సార్వత్రిక' విజయానికి తొలి మెట్టు



''కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుకు తొలి మెట్టు. ఇవి అత్యంత కీలకమైన ఎన్నికలు. రాహుల్ గాంధీ ప్రధాని అవ్వొచ్చేమో. బీజేపీయేతర పార్టీలు ఇక త్వరగా ఏకతాటి మీదకు వస్తాయని భావిస్తున్నా. బీజేపీ మత రాజకీయాలను ఓడించిన ప్రజలకు జేజేలు''

– కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య

లోకల్ వోకల్

కాంగ్రెస్ పార్టీ ఈ సారి స్థానిక సమస్యలపైనే అత్యధికంగా దృష్టి సారించింది. జాతీయ స్థాయిలో ప్రభావం చూపించే అంశాల జోలికి వెళ్లలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇమేజ్‌పై ఆధారపడి బీజేపీ ఎన్నికలకి వెళ్లడాన్ని పదే పదే ప్రశ్నించింది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఇది రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలే తప్ప ప్రధాని మోదీ గురించి ఎన్నికలు కాదంటూ ప్రతీ సభలోనూ గళమెత్తారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా స్థానికంగా పవర్‌ఫుల్ నాయకులనే ముందుంచి ప్రచారాన్ని నిర్వహించింది. ఇక రాహుల్ గాంధీ కూడా ప్రజలతో మమేకమైపోతూ స్థానిక అంశాలపైనే వారితో ముచ్చటించారు. ఫలితంగా పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా హస్తం గుర్తుకే ఓట్లు గుద్దేశారు.

గ్యారంటీ కార్డుకి కురిసిన ఓట్లు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఈసారి ఎన్నికల్లో ఓట్లు కురిపించాయి. అయిదు హామీలతో కాంగ్రెస్ విడుదల చేసిన గ్యారంటీ కార్డులో గృహజ్యోతి (గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్), గృహలక్ష్మి (ఇంటి మహిళా యజమానికి నెలకి రూ.2 వేలు ఆర్థిక సాయం), అన్న భాగ్య (నిరుపేద కుటుంబాలకు నెలకి 10 కేజీల ఉచిత బియ్యం) యువనిధి (నిరుద్యోగ యువతకి రెండేళ్ల ఆర్థిక సాయం) శక్తి (ఆర్టీసీ బస్సుల్లో మహిళలకి ఉచిత ప్రయాణం) హామీలు ప్రజల్ని విశేషంగా ఆకర్షించి కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టాయి.

ప్రేమ విపణి తెరుచుకుంది: రాహుల్



న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పనితీరుపై ప్రశంసలు కురిపించారు. విద్వేషంపై ప్రేమ విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ ఫలితమే పునరావృతం కావడం ఖాయమన్నారు. ''కర్ణాటకలో విద్వేష బజార్ మూతపడింది. ప్రేమ బజార్ తెరుచుకుంది. కాంగ్రెస్‌కు అద్భుత విజయం కట్టబెట్టిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు. పార్టీ నేతలు, కార్యకర్తలకు అభినందనలు. మేం ద్వేషం, చెడు భాష వాడకుండా ప్రజలపై ప్రేమాభిమానాలే అండగా పోటీ చేసిన తీరుకు చాలా ఆనందంగా ఉంది. ఆశ్రిత పెట్టుబడిదారుల బలంపై పేదల బలమే గెలిచింది. రాష్ట్ర ప్రజలకిచ్చిన ఐదు హామీలను తొలి మంత్రివర్గ భేటీలోనే నెరువేరుస్తాం'' అని ప్రకటించారు.

సిద్ధూ, డీకేల్లో సీఎం ఎవరో!

నేడు సీఎల్పీ భేటీలో ఎంపిక • అధిష్టానానిదే తుది నిర్ణయం

సాక్షి బెంగళూరు: విభేదాలు పక్కన పెట్టి ఒక్కతాటిపై నిలిచి కాంగ్రెస్‌ను గెలుపు బాటన నడిపిన మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం తీవ్ర పోటీ నెలకొంది. మరికొందరు సీనియర్లు కూడా రేసులో ఉండటంతో ఎంపిక అధిష్టానానికి సవాలుగా మారింది. సీఎం అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఆదివారం సాయంత్రం కీలకమైన కాంగ్రెస్ శాసనసభా పక్ష భేటీ జరగనుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా ఇప్పటికే బెంగళూరు చేరారు. అధిష్టానం ఎవరికి ఓటేస్తుందన్నది ఆసక్తికరం. వెనుకబడిన వర్గానికి చెందిన సిద్ధరామయ్య సీఎం రేసులో ముందంజలో ఉన్నట్టు చెబుతున్నారు. అయితే పార్టీని అధికారంలోకి తేవడంలో ట్రబుల్ షూటర్ శివకుమార్ కూడా తీవ్రంగా శ్రమించారు. పైగా 61 ఏళ్ల డీకేకు గాంధీ కుటుంబం ఆశీస్సులున్నాయి. అయితే పార్టీ నేతల్లో అత్యధికుల మద్దతు సిద్ధూ సొంతం. వీరిద్దరి మధ్య వివాదాలకు తావు లేని రీతిలో అధికార పంపిణీ చేయాలని అధిష్టానం యోచనగా చెబుతున్నారు. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించిన 75 ఏళ్ల సిద్ధూకు సీఎం, డీకేకు డిప్యూటీ, లేదా కీలక మంత్రి పదవి ఇచ్చి కొంతకాలానికి వారిని పరస్పరం మారుస్తారని భావిస్తున్నారు. దళిత నేత వైపు అధిష్టానం మొగ్గితే పరమేశ్వరకు చాన్సుంటుంది. బీజేపీకి ఓటు బ్యాంకుగా ఉన్న లింగాయతులు ఈసారి కాంగ్రెస్ వైపు నిలిచినందున ఆ వర్గానికి చెందిన పాటిల్‌కు అవకాశమివ్వాలన్న డిమాండ్లూ విన్పిస్తున్నాయి.

ఫలితాలపై స్పందన

వచ్చే లోక్‌సభ ఎన్నికలతో మొదలయ్యే బీజేపీ అంతానికి ఆరంభం ఇది. దారుణ నిరంకుశ, ఆధిపత్య రాజకీయాలను జనం అంతం చేశారు.
–తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ

ఇకపై తమ పాచికలు పారవని బీజేపీ ఇకనైనా గుర్తించాలి.
–ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి పూర్తి బాధ్యత నాదే. మెరుగైన ఎన్నికల వ్యూహం కాంగ్రెస్ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి కావొచ్చు
–కర్ణాటక మాజీ సీఎం బొమ్మై

ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా కొత్త సానుకూల భారత్ దిశగా ప్రజలిచ్చిన తిరుగులేని తీర్పు
– ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడింది. మోదీతో ఏదైనా సాధ్యమనే నినాదాన్ని ప్రజలు తిప్పికొట్టారు.
– ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్

కాంగ్రెస్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించిన కర్ణాటక ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ఎన్నికల్లో గెలవడమంటే కర్ణాటక రాష్ట్రాభివృద్ధే ముఖ్యమన్న ఆలోచనకు జై కొట్టడమే. దేశాన్ని ఐక్యం చేసే రాజకీయ గెలుపు ఇది. పార్టీ కోసం చెమట చిందించి పనిచేసిన కార్యకర్తలకు ప్రజలు చెల్లించిన మూల్యమిది. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు పార్టీ అవిశ్రాంతంగా పనిచేస్తుంది. రాహుల్ భారత్ జోడో పాదయాత్ర వెంటే విజయం పాదం కదిపింది.
– ప్రియాంక గాంధీ

వాడిపోయిన కమలం



సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటకలో ఆనవాయితీ మారలేదు. అధికార పార్టీ వరుసగా రెండోసారి అధికారంలోకి రాలేకపోయింది. శాసనసభ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఘోర పరాజయం చవిచూసింది. మొత్తం 224 స్థానాలకు గాను 2018లో 104 స్థానాలు సాధించిన ఆ పార్టీ ఈసారి కేవలం 65 స్థానాలతో సరిపెట్టుకుంది. కనీసం అధికారానికి చేరువగా కూడా రాలేదు. ఈ ఓటమిని బీజేపీ పెద్దలు ఏమాత్రం ఊహించలేకపోయారు. హేమాహేమీలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా కూడా గట్టెక్కించలేదు. రాష్ట్రంలో బీజేపీ పేలవమైన పని తీరుకు ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి.

కర్ణాటకలో బీజేపీ ఓటమికి ఎన్నో కారణాలు

- బీజేపీ ప్రభుత్వ అవినీతిపై విసుగెత్తిపోయిన ఓటర్లు
- కాషాయ పార్టీ పట్ల దళితులు, ఆదివాసీలు, ఓబీసీల విముఖత

కర్ణాటకలో బీజేపీని ముందుండి నడిపించడానికి బలమైన నాయకులు లేకుండాపోయారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం దాకా.. అంతా అధిష్టానం కనుసన్నల్లోనే సాగింది. ముఖ్యమంత్రి పదవి నుంచి యడియూరప్పను తొలగించి బసవరాజ్ బొమ్మైని గద్దెనెక్కించడం బీజేపీకి నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా బసవరాజ్ బొమ్మై ప్రజలను ఏమాత్రం మెప్పించలేకపోయారు. బొమ్మై పరిపాలనపై రగిలిన అసంతృప్తి సెగలు బీజేపీ కొంపముంచాయి.

ఇతర వర్గాలపై చిన్నచూపు

రాష్ట్రంలో లింగాయత్, ఒక్కళిగ వంటి ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యంగా బీజేపీ పలు హామీలు ఇచ్చింది. రిజర్వేషన్ల అస్త్రాన్ని ప్రయోగించింది. కానీ, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనార్టీలను ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఇంతచేసినా లింగాయత్‌లు, ఒక్కళిగలు బీజేపీని ఆదరించలేదు. ముస్లింలు, దళితులు, ఓబీసీలు మాత్రమే కాకుండా లింగాయత్‌లు, ఒక్కళిగలు సైతం కాంగ్రెస్‌కే ఓటేశారు.

పెచ్చరిల్లిన అవినీతి.. కమీషన్ల దందా

'40 శాతం ప్రభుత్వం'అంటూ బీజేపీ సర్కారు కమీషన్ల దందాపై కాంగ్రెస్ చేసి ప్రచారం ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ నేతలు నిప్పులు చెరిగారు. ఎన్నికల ప్రచారంలో అవినీతి అంశం ప్రముఖంగా తెరపైకి వచ్చింది. జనంలో విస్తృతంగా చర్చ జరిగింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కేఎస్ ఈశ్వరప్ప మంత్రి పదవికి రాజీనామా చేయడం బీజేపీకి ఇబ్బందికరంగా పరిణమించింది. అవినీతి బాగోతం, కమీషన్ల వ్యవహారంపై కర్ణాటక కాంట్రాక్టర్ల సంఘం ప్రధానికి ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది.

ప్రభుత్వ వ్యతిరేకత

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వంపై జనంలో వ్యతిరేకత నానాటికీ పెరిగింది. ఎన్నికల్లో ఓటమికి ఇదో ప్రధాన కారణమని చెప్పొచ్చు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోవడంతోపాటు బీజేపీ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం జనాన్ని నిరాశపర్చింది. ప్రజా వ్యతిరేకతను తగ్గించుకొనే ప్రయత్నాలేవీ బీజేపీ పెద్దలు చేయలేదు. బీజేపీ ఇంకా అధికారంలో కొనసాగితే ఒరిగేదేమీ లేదన్న నిర్ణయానికి ప్రజలు వచ్చారు. అందుకే ఇంటికి సాగనంపారు. ప్రధాని మోదీ కర్ణాటకలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రైల్వే ప్రాజెక్టులు, జలవనరుల పథకాలు, రోడ్డు నిర్మాణాలు, ఎక్స్‌ప్రెస్ వే వంటివి చేపట్టినా ప్రజలు పట్టించుకోలేదు.

పనిచేయని హిందూత్వ కార్డు

హలాల్, హిజాబ్, అజాన్, జై భజరంగ బలి, హనుమాన్ చాలీసా.. ఇవన్నీ కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ నమ్ముకున్న ఆయుధాలు. కర్ణాటకలో తలెత్తిన హలాల్, హిజాబ్, అజాన్ వివాదాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ మతాన్ని వాడుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తాయి. కానీ, అవేవీ బీజేపీని కాపాడలేకపోయాయి. బీజేపీ హిందూత్వ కార్డు కర్ణాటకలో ఎంతమాత్రం పనిచేయలేదని స్పష్టంగా తేలిపోయింది.

బీజేపీ పెద్దల శ్రమ నిష్ఫలం

సాక్షి, బెంగళూరు: కర్ణాటక ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ హైకమాండ్ పూర్తిగా తలకెత్తుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వారి రోడ్ షోలు, బహిరంగ సభలు బీజేపీని కాపాడలేకపోయాయి. బీజేపీ పెద్దల ర్యాలీలకు ప్రజలు భారీగా తరలివచ్చినా అధికారం మాత్రం దక్కలేదు. రాష్ట్రంలో యడియూరప్ప నేతృత్వంలో కాకుండా తొలిసారిగా బీజేపీ అధిష్టానం నేతృత్వంలో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొన్నారు. పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలోని కీలక ఆరు ప్రాంతాలను చుట్టేస్తూ ఎన్నికల ప్రచారం సాగించారు. అమిత్ షా రెండున్నర నెలల్లో 17 సార్లు రాష్ట్రానికి వచ్చారు. ప్రధాని మోదీ 10 సార్లకుపైగా వచ్చారు. మరో 31 మంది ఇతర రాష్ట్రాల బీజేపీ ప్రతినిధులు, నాయకులు కర్ణాటకలో ప్రచారంలో పాలుపంచుకున్నారు. నరేంద్ర మోదీ 19 బహిరంగ సభలు, 6 రోడ్డు షోలలో పాల్గొనగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 10 బహిరంగ సభలు, 16 రోడ్డు షోలలో పాల్గొన్నారు. ఇక అమిత్ షా 16 బహిరంగ సభలు, 17 రోడ్డు షోలు నిర్వహించారు. రాజధాని బెంగళూరులో మోదీ నిర్వహించిన మెగా రోడ్డు షో అందరి దృష్టిని ఆకర్షించింది. అగ్రనేతలు ఇంతగా శ్రమించినా ఫలితం దక్కలేదు. బీజేపీ ఓటమిని మూటగట్టుకుంది.

'కింగ్‌మేకర్' కలలు భగ్నం

- చతికిలపడిన జేడీ(ఎస్)
- కేవలం19 స్థానాలకు పరిమితం
- దెబ్బతీసిన కుటుంబ వివాదాలు

సాక్షి, బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రాంతీయ పార్టీ అయిన జేడీ(ఎస్)ను పూర్తిగా నిరాశపరిచాయి. ఆ పార్టీ కేవలం 19 సీట్లు గెలుచుకుంది. మరోసారి 'కింగ్‌మేకర్' అవ్వాలన్న జేడీ(ఎస్) కలలు భగ్నమయ్యాయి. కర్ణాటకలో 2004, 2018లో హంగ్ ప్రభుత్వాలు ఏర్పడి జేడీ(ఎస్) అధికారంలోకి వచ్చింది. హంగ్ వచ్చిన ప్రతిసారీ ఆ పార్టీ కింగ్‌మేకర్ అవతారం ఎత్తుతూ వచ్చింది. 2004లో బీజేపీతో, 2018లో కాంగ్రెస్‌తో జతకట్టింది.

కంచుకోటలో ప్రభావం అంతంతే

2018 ఎన్నికల్లో 37 స్థానాల్లో గెలుపొందిన జేడీ(ఎస్) ఈసారి మాత్రం 19 సీట్లకే పరిమితం అయింది. తమ కంచుకోటగా భావించే పాత మైసూరు ప్రాంతంలోనూ జేడీ(ఎస్) పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఎన్నికల ముందు 'పంచరత్న రథయాత్ర' పేరిట జేడీ(ఎస్) నేత, మాజీ సీఎం కుమారస్వామి చేసిన రాష్ట్ర వ్యాప్తంగా చేసిన బస్సు యాత్ర సత్ఫలితాన్ని ఇవ్వలేదు. 87 ఏళ్ల రాజకీయ దురంధరుడు హెచ్‌డీ దేవెగౌడ వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో విరివిగా పాల్గొన్నారు. అధికారం అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలను వేడుకున్నారు. అయినా ఉపయోగం కనిపించలేదు. రాష్ట్రంలో జేడీ(ఎస్) ఓట్ల శాతం క్రమంగా పడిపోతోంది. 2004లో ఆ పార్టీకి 20.8 శాతం, 2018లో 18 శాతం, ఈసారి దాదాపు 13 శాతం ఓట్లు లభించాయి.

నిఖిల్ గౌడ పరాజయం

దేవెగౌడ కుటుంబంలోని లుకలుకలు కూడా ఈ ఎన్నికల్లో జేడీ(ఎస్)ను దెబ్బతీశాయి. దేవెగౌడ పెద్ద కోడలు భవానీ రేవణ్ణ.. హాసన్ అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆ స్థానాన్ని తన వదినకు ఇచ్చేందుకు కుమారస్వామి సానుకూలంగా లేకపోవడంతో కుటుంబంలోని విభేదాలు బహిర్గతమయ్యాయి. ఇలా కుటుంబంలో వివాదాలు, పార్టీలో కుటుంబ పెత్తనం అనే అపవాదులు జేడీ(ఎస్)ను దెబ్బతీశాయి. దేవెగౌడ కుటుంబం నుంచి ముగ్గురు పోటీ చేయగా, ఇద్దరు గెలిచారు. కుమారస్వామి కుమారుడు నిఖిల్ రామనగరలో పోటీ చేసి చిత్తుగా ఓడిపోయారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని పరాజయం పాలైన నిఖిల్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓడిపోవడం గమనార్హం. హాసన్‌లో దేవెగౌడ కుటుంబాన్ని సవాలు చేసిన బీజేపీ అభ్యర్థి ప్రీతం గౌడ తన ప్రత్యర్థి హెచ్‌పీ స్వరూప్‌ను ఓడించారు. చెన్నపట్టణలో కుమారస్వామి స్వల్ప మెజారిటీతో గట్టెక్కడం జేడీ(ఎస్) కొంతలో కొంత ఊరట కలిగించింది. హొళెనరసిపురలో దేవెగౌడ పెద్ద కుమారుడు హెచ్‌డీ రేవణ్ణ గెలుపొందారు.

ఉక్రెయిన్‌కు జర్మనీ భారీ సాయం

బెర్లిన్: ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు, విమాన విధ్వంసక వ్యవస్థలు, మందుగుండు సామగ్రి సహా సుమారు రూ.24 వేల కోట్ల విలువైన అదనపు సైనిక సాయం అందించాలని జర్మనీ నిర్ణయించింది. ఉక్రెయిన్‌కు మద్దతు విషయంలో తాము నిజాయితీతో ఉన్నామని రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ తెలిపారు.

రష్యాతో యుద్ధం మొదలయ్యాక మొట్ట మొదటిసారిగా జెలెన్‌స్కీ ఆదివారం జర్మనీకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ క్రమంలోనే జర్మనీ తాజా నిర్ణయం వెలువరించడం గమనార్హం. రష్యా ఇంధనంపై ఆధారపడిన జర్మనీని ఉక్రెయిన్ మొదటి నుంచి అనుమానిస్తోంది. అయితే, ఏంజెలా మెర్కెల్ స్థానంలో ఒలాఫ్ షోల్జ్ చాన్సెలర్‌గా బాధ్యతలు చేపట్టాక ఉక్రెయిన్–జర్మనీల మధ్య సంబంధాలు బలపడుతూ వస్తున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు ప్రస్తుతం ఇటలీలో ఉన్నారు.

గాలి సోదరుల్లో ఒకరి గెలుపు

సాక్షి, బళ్లారి: ఈసారి ఎన్నికల్లో సతీమణి, ఇద్దరు సోదరులతో వేర్వేరు నియోజకవర్గాల్లో బరిలో నిలిచినప్పటికీ మాజీ మంత్రి, ఒకప్పటి మైనింగ్ మహరాజుగా పేరొందిన గాలి జనార్దన రెడ్డి ఒక్కరే విజయం సాధించారు. సతీమణి, ఇద్దరు సోదరులు ఓడిపోయారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని హరపనహళ్లి నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసిన గాలి కరుణాకర రెడ్డి ఓటమి పాలయ్యారు. ఇక్కడ స్వతంత్ర మహిళా అభ్యర్థి గెలిచారు. బళ్లారి నగర నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసిన గాలి సోమశేఖరరెడ్డి సైతం ఓటమిని చవిచూశారు. కొప్పళ జిల్లాలోని గంగావతి నియోజకవర్గం నుంచి సొంత పార్టీ అయిన కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) తరఫున పోటీ చేసిన గాలి జనార్దనరెడ్డి ఒక్కరే ఘన విజయం సాధించారు. సమీప ప్రత్యర్థిపై 8,266 ఓట్ల తేడాతో గెలుపొందారు.

పరాజితుల్లో 14 మంది మంత్రులు

బెంగళూరు: ఎన్నికల్లో సీఎం బొమ్మై కేబినెట్‌లోని 14 మంది మంత్రులు ఓడారు. పరాజయం పాలైన వారిలో బి.శ్రీరాములు, కె.సుధాకర్, జేసీ మధుస్వామి, గోవింద్ కర్జోల్, ఎంటీబీ నాగరాజ, కేసీ నారాయణ గౌడ, బీసీ పాటిల్, శంకర్ పాటిల్ మునెన కొప్ప, హలప్ప ఆచార్, బీసీ నాగేశ్, మురుగేశ నిరానీ ఉన్నారు. మంత్రి వి.సోమన్న పోటీకి దిగిన రెండుచోట్లా ఓటమి పాలయ్యారు. మరో మంత్రి ఆర్.అశోక్ రెండు చోట్ల నుంచి బరిలోకి దిగి పద్మనాభనగర్‌లో గెలిచారు.

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి ఓటమి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే అయిన సీటీ రవి చిక్‌మగళూరులో ఓటమి పాలయ్యారు. బీజేపీ మాజీ నేత, సీటీ రవికి ఒకప్పటి సన్నిహితుడు హెచ్‌డీ తమ్మయ్య ఇక్కడ 5,926 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఏబీవీపీ నేతగా ఉన్న రవి 2018 ఎన్నికల్లో గెలిచి, యడియూరప్ప కేబినెట్‌లో మంత్రి అయ్యారు. బీజేపీ చీఫ్ జేడీ నడ్డా సూచనల మేరకు మంత్రి పదవికి రాజీనామా చేసి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు.

విజయం సాధించిన ముఖ్య నేతలు

ఎన్నికల సంఘం ఇప్పటి వరకు విజేతలుగా ప్రకటించిన వారిలో సీఎం బస్వరాజ్ బొమ్మై, కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ డీకే శివకుమార్, కేంద్ర మాజీ మంత్రి మునియప్ప తదితరులు ఉన్నారు. షిగ్గావ్ స్థానం నుంచి సీఎం బొమ్మై కాంగ్రెస్‌కు చెందిన సమీప ప్రత్యర్థి యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్‌ను 35,978 ఓట్ల తేడాతో ఓడించారు. అదేవిధంగా, కంచుకోట వంటి కనకపురలో కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ డీకే శివకుమార్ జేడీఎస్‌కు చెందిన బి.నాగరాజ్‌పై 1,22,392 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. కొరటగెరెలో రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం, కేపీసీసీ మాజీ చీఫ్ జి.పరమేశ్వర 14,347 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరి అథని నుంచి పోటీకి దిగిన మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ్ సవాడి 76 వేల పైచిలుకు ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిపై గెలిచారు.

సిద్దరామయ్య తొమ్మిదోసారి..

మైసూరు: మాజీ సీఎం సిద్దరామయ్య 9వ సారి అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. వరుణ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన ఆయన 46,006 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన ప్రత్యర్థి వి.సోమన్నపై గెలిచారు. 5 పర్యాయాలు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి సోమన్న బెంగళూరులోని తన సొంత నియోజకవర్గంను వీడి సిద్దరామయ్యను కంచుకోటలో ఢీకొట్టారు.

'కనకపుర రాక్'డీకే శివకుమార్

డీకే శివకుమార్ 1989 నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహతంగా గెలుస్తూ వస్తున్నారు. తాజాగా ఆయన ఎనిమిదోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో 79,909 ఓట్ల ఆధిక్యంతో గెలిచిన శివకుమార్ ఈసారి అంతకుమించి 1,21,595 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఇక్కడ బీజేపీకి చెందిన ఆర్.అశోక 19,602 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. 2008లో కనకపుర నియోజకవర్గం ఏర్పాటైంది.

రౌండప్



నూతన బ్రాహ్మణ భవన నిర్మాణ చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో రమణాచారి, నవీన్ మిత్తల్, దేశపతి శ్రీనివాస్, సోమేశ్‌కుమార్, రాజీవ్‌శర్మ తదితరులు

ఆలయాలు సాంత్వన చేకూర్చే కమ్యూనిటీ సెంటర్లు

- పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం మరెక్కడ లేనంతగా కృషి చేస్తున్నాం: సీఎం కేసీఆర్
- 31న హైదరాబాద్‌లో బ్రాహ్మణ పరిషత్ భవనం ప్రారంభానికి నిర్ణయం
- అన్ని రాష్ట్రాల నుంచి అర్చకులు, పీఠాధిపతులను ఆహ్వానించాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: దేవాలయాలు సర్వజనులకు సాంత్వన చేకూర్చే కమ్యూనిటీ సెంటర్లని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ప్రార్థనా మందిరాల్లోనే శాంతి నెలకొని ఉంటుందని, పూజారులు, పండితోత్తములు అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటూ వారి వాక్కులు, దీవెనలతో సర్వజన హితం కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని ఈ నెల 31న ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణపై సచివాలయంలో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని గోపనపల్లిలో సువిశాల స్థలంలో నిర్మించిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సదన్ భావితరాలకు శాంతిని, భక్తిభావనలను పంచే ఆధ్యాత్మిక కేంద్రంగా కొనసాగుతుందని ఆకాంక్షించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో దేవాలయాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. బ్రాహ్మణ వర్గాలలోని పేదలు, పూజారుల సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ సహకారంతో అర్చక వృత్తినే నమ్ముకున్న పేద బ్రాహ్మణులకు చక్కటి విద్యను అందిస్తున్నట్లు కేసీఆర్ వివరించారు. పేద బ్రాహ్మణులకు రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. ఈ నెల 31న పరిషత్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా చండీ, సుదర్శన యాగాలను నిర్వహించాలని బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారికి సూచించారు. ఈ ప్రారంభోత్సవానికి అన్ని రాష్ట్రాలు, ప్రముఖ పుణ్యక్షేత్రాల నుంచి అర్చకులను, ద్వాదశ జ్యోతిర్లింగాలు సహా కంచి కామకోటి తదితర పీఠాధిపతులను, ప్రముఖ హిందూ మత పెద్దలను, అన్ని రాష్ట్రాల బ్రాహ్మణ సంఘాల పెద్దలను, బ్రాహ్మణ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు.

పరిషత్ భవనంలో గ్రంథాలయం...

బ్రాహ్మణ పరిషత్ భవన్‌లో దైవభక్తిని పెంపొందించే దిశగా ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల వంటి సాహిత్యంతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. వ్రతాలు, యజ్ఞ యాగాదులకు సంబంధించిన అవగాహనను కల్పించే సాహిత్యాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు రమణాచారి, బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ జ్వాలా నరసింహారావు, సీఎస్ శాంతి కుమారి, ఫైనాన్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్ రావు, సీఎం సెక్రటరీలు స్మితా సభర్వాల్, భూపాల్ రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ అశోక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత భాషా విశ్వవిద్యాలయం ఏర్పాటు

తెలంగాణ ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని పునరుజ్జీవింప చేసుకోవడంలో భాగంగా మల్లినాథసూరి వంటి నాటి ప్రముఖ భాషా కవి, పండిత మహనీయుల ఘన చరిత్రలను వెలికితీయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మల్లినాథుని జన్మస్థలం అయిన మెదక్ జిల్లా కొల్చారంలో 'కోలాచల మల్లినాథసూరి సంస్కృత భాషా విశ్వవిద్యాలయం'ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన చర్యల కోసం కార్యాచరణ ప్రారంభించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఫోన్లో ఆదేశించారు.

పెట్టుబడి పెట్టు.. ఈబీ-5 వీసా పట్టు



అమెరికాలో కొనసాగేందుకు భారతీయుల తాజా మంత్రం

- కనీస పెట్టుబడి ఎనిమిది లక్షల యూఎస్ డాలర్లు
- ఎక్కువగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు
- ఈబీ-5 వీసాల్లో రెండోస్థానంలో భారతీయులు
- 2016 నుంచి 400 శాతం పెరిగిన ఈ వీసాల జారీ

సాక్షి, అమరావతి: ఈబీ-5 వీసా.. ఇదీ ప్రస్తుతం అమెరికాలోని భారతీయ వృత్తి నిపుణుల సరికొత్త తారకమంత్రం. అమెరికాలోని ఐటీ కంపెనీలు భారీగా ఉద్యోగాల్లో కోత విధిస్తుండటంతో ఆ దేశంలో కొనసాగేందుకు భారతీయ వృత్తి నిపుణులకు కనిపిస్తున్న మరో ప్రత్యామ్నాయం . అమెరికాలో వృత్తి నిపుణులుగా కొనసాగేందుకు ఆ దేశంలో పెట్టుబడిదారులుగా మారుతున్నారు. ఇందులో భాగంగా అక్కడ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెడుతున్నారు. ఆ కేటగిరీలో ఈబీ-5 వీసాల కోసం అమెరికాలోని భారతీయులు అత్యధికంగా దరఖాస్తులు చేస్తున్నారని 'యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రియల్ ఎస్టేట్‌లో మన వాళ్ల పెట్టుబడులు..

ఆర్థిక మాంద్యం ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తుండటంతో అమెరికాలోని దిగ్గజ ఐటీ కంపెనీలతోపాటు ఇతర కంపెనీలు భారీగా ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. దాంతో హెచ్1బీ వీసా మీద ఆ దేశం వెళ్లిన భారతీయులు వెనక్కి వచ్చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అమెరికాలోనే కొనసాగాలంటే మరో కంపెనీల్లో ఉద్యోగం దక్కించుకోవాలి. అందుకు అవకాశాలు కూడా పెద్దగా లేకపోవడంతో భారతీయ వృత్తి నిపుణులు ఈబీ-5 వీసా కోసం దరఖాస్తులు చేస్తున్నారు. అందుకోసం ఆ దేశంలో పెట్టుబడులు పెట్టే కన్సల్టెన్సీలతో భాగస్వాములుగా మారుతున్నారు. ఎక్కువగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతున్నారు. కన్సల్టెన్సీలు కనీసం 20 మందిని ఓ గ్రూప్‌గా ఏర్పరచి ఒక్కొక్కరి నుంచి 8 లక్షల అమెరికన్ డాలర్ల చొప్పున 16 మిలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో రూ.131.39 కోట్లు) నిధిని సేకరిస్తున్నాయి. ఆ నిధులను వివిధ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ చేపడుతున్న రెంటల్ అపార్ట్‌మెంట్లు, భవనాలు, హోటళ్లు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడిగా పెడుతున్నాయి. ఆ విధంగా పెట్టుబడి పెడుతున్న వారు ఆ వ్యాపారంలో క్రియాశీలకంగా ఉండటంగానీ ప్రత్యక్షంగా ఎవరికీ ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరంగానీ లేదు. వారు పాసివ్ పెట్టుబడిదారులుగా ఉంటారు. పెట్టిన పెట్టుబడిపై వారికి వడ్డీ లభిస్తుంది కూడా. దాంతోపాటు పెట్టుబడిదారు హోదా దక్కుతుంది. ఆ హోదాపై ఈబీ-5 వీసాకు దరఖాస్తు చేసి పొందుతున్నారు. ఆ వీసాపై అమెరికాలో ఏ ప్రాంతంలోనైనా పనిచేసేందుకు వారికి అవకాశం దక్కుతుంది. ఈబీ-5 వీసా కింద ఐదుగురు కుటుంబ సభ్యులు అమెరికాలో నివసించేందుకు అవకాశముంది.

పెరుగుతున్న ఈబీ-5 వీసాలు

భారతీయులకు ఈబీ-5 వీసాల జారీ పెరుగుతోంది. 2019లో 756 మంది భారతీయులు ఈబీ-5 వీసాలు పొందగా.. 2022లో ఏకంగా 1,381 మందికి వీటిని జారీ చేయడం విశేషం. 2016తో పోలిస్తే ఈబీ-5 వీసాలు పొందిన భారతీయుల సంఖ్య 400 శాతం పెరిగింది. 2022లో అమెరికా మొత్తం 10,885 ఈబీ-5 వీసాలు జారీచేసింది. వాటిలో 1,381 వీసాలతో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో వియత్నాం ఉన్నాయి. ఇక 2023లో 14,200 ఈబీ-5 వీసాలు జారీచేయాలని యూఎస్‌సీఐఎస్ భావిస్తోంది.

ఈబీ-5 వీసా అంటే..

అమెరికాలో గ్రీన్‌కార్డ్‌కు దాదాపు సమానమైన గుర్తింపు ఉన్నదే ఈబీ-5 వీసా. అంతటి ప్రాధాన్యమున్న ఈ వీసా పొందాలంటే వ్యక్తులు అమెరికాలో కనీసం 8 లక్షల అమెరికన్ డాలర్లను (భారతీయ కరెన్సీలో రూ.6.57 కోట్లు) పెట్టుబడిగా పెట్టడంతోపాటు కనీసం 10 ఉద్యోగాలను కల్పించాలి. దాంతో వారికి పెట్టుబడిదారుల హోదా కింద ఈబీ-5 వీసాను జారీచేస్తారు. ఈబీ-5 వీసాకు దరఖాస్తు చేయాలంటే గతంలో 5 లక్షల అమెరికన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాలని నిబంధన ఉండేది. కానీ, ఈ వీసాల కోసం డిమాండ్ పెరుగుతుండడంతో యూఎస్‌సీఐఎస్ ఈ కనీస పెట్టుబడి మొత్తాన్ని 2022లో 8 లక్షల డాలర్లకు పెంచింది.

గగన్‌యాన్.. క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం ఆపరేషన్ విజయవంతం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వచ్చే ఏడాది చివరి నాటికి గగన్‌యాన్ ప్రయోగాన్ని నిర్వహించాలని భావిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రపొల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ)లో క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం ఆపరేషన్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించింది. ఈ మేరకు ఇస్రో శనివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. క్రూమాడ్యూల్ సిస్టంను 602.94 సెకన్లపాటు మండించి పరీక్షించారు. ఈ పరీక్ష సమయంలో క్రూమాడ్యూల్‌లోని పారామీటర్లు అన్నీ శాస్త్రవేత్తలు ఊహించిన విధంగా పనిచేశాయి. దీంతో గగన్‌యాన్ ప్రయోగానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లైంది. క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టంలో భాగంగా మొత్తం 14 రకాల పరీక్షలను నిర్వహించారు. వీటిని విజయవంతంగా పరీక్షించడంతో గత కొన్నేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న గగన్‌యాన్ ప్రయోగానికి ఇస్రో సన్నద్ధమవుతోంది. అయితే ముందుగా రెండు, మూడుసార్లు మానవ రహిత గగన్‌యాన్ ప్రయోగాన్ని నిర్వహించాకే మానవ సహిత ప్రయోగానికి సిద్ధమవుతామని ఇస్రో పేర్కొంది. ఇందులో భాగంగా పలు రకాల పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



మహేంద్రగిరిలో గగన్‌యాన్ క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం ఆపరేషన్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

వంద శాతం ఆక్యుపెన్సీతో 'భారత్ గౌరవ్' రైళ్లు

- సికింద్రాబాద్ నుంచి బయల్దేరిన 4వ రైలు
- ఇప్పటివరకు 1,871 మంది ప్రయాణికులు



సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు నడిచిన అన్ని 'భారత్ గౌరవ్'రైళ్లు వంద శాతం ఆక్యుపెన్సీతో రాకపోకలు సాగిస్తున్నాయని, ఈ ఆధ్యాత్మిక పర్యాటక రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, 'భారత్ గౌరవ్'నాలుగవ రైలు శనివారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరగా.. పెద్ద సంఖ్యలో నగరవాసులు తరలివెళ్లారని చెప్పారు. 'భారత్ గౌరవ్'రైలు పర్యటనలో దేశంలోని తూర్పు–ఉత్తర భాగంలో ఉన్న పురాతన, చారిత్రాత్మక ప్రదేశాలు పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ తదితర ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. సికింద్రాబాద్‌తో పాటు, కాజీపేట్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్ల కోట తదితర ఎనిమిది స్టేషన్లలో ఈ రైలుకు హాల్టింగ్ సదుపాయం ఉందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఇప్పటివరకు 1,871 మంది ప్రయాణం చేశారని తెలిపారు. యాత్రికులు వ్యక్తిగతంగా ప్రణాళికలు రూపొందించుకోవడం కంటే భారత్ గౌరవ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా...

ధరణిని తప్పుబట్టడం కిషన్‌రెడ్డికి తగదు

బోయినపల్లి వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: పూర్తి పారదర్శకతతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న 'ధరణి'వ్యవస్థను తప్పుబట్టడం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తగదని, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కచ్చితమైన సమస్యను చూపితే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పోర్టల్‌పై ఏమాత్రం అవగాహన లేకుండా కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కొన్ని సమస్యలను సాకుగా చూపి మొత్తం వ్యవస్థ తప్పనడం సరికాదని శనివారం ఒక ప్రకటనలో హితవుపలికారు. ధరణి వ్యవస్థను కేంద్ర వ్యవసాయ, ఐటీ మంత్రిత్వ శాఖల అధికారులు మెచ్చుకున్నారని గుర్తు చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ఒక పద్ధతి ప్రకారం సరిచేసుకునే వెసులుబాటు ధరణితోనే కలుగుతోందన్నారు. ఇప్పటివరకు 95 శాతం రెవెన్యూ రికార్డ్స్ సమస్యలు పరిష్కారం అయ్యాయని, మిగతావి త్వరలోనే కొలిక్కి వస్తాయని వెల్లడించారు. ఆచరణలో దశాబ్దాల కిందటి రెవెన్యూ రికార్డ్స్ సమస్యలు అక్కడక్కడా అధికారుల దృష్టికి వస్తున్నాయని, కుటుంబ కలహాలు, భూముల సరిహద్దు వివాదాలు, పూర్వపు క్రయ విక్రయాల సమస్యలు, టెక్నికల్ మాడ్యుల్ (టీఎం) 33 లో కొన్ని అంశాలు మాత్రమే కలెక్టర్ల వద్ద పరిష్కారం కోసం ఉన్నాయని, వాటిని కూడా దశల వారీగా అధికారులు కొలిక్కి తీసుకుని వస్తున్నారని వినోద్‌కుమార్ వివరించారు.

ఇది మోదీకి నైతిక ఓటమి: నారాయణ



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో బీజేపీ ఓటమి ప్రధాని మోదీ నైతిక ఓటమి అని, ఇది దేశ వ్యాప్తంగా ప్రభావం చూపుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. దక్షిణాదికి ద్వారంగా ఉండే కర్ణాటకలో బీజేపీ ఓటమి ద్వారా బీజేపీకి దక్షిణ భారతదేశం ద్వారం మూతపడినట్లు అయిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికలలో ప్రధాని మోదీ సుదీర్ఘకాలం అక్కడే ఉండి కులాలు, మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని విమర్శించారు. రాహుల్‌పై పాల్పడిన కక్ష సాధింపు చర్యల వల్ల వచ్చిన సానుభూతి కూడా కాంగ్రెస్‌కు కలిసివచ్చిందని, పెరిగిన గ్యాస్, పెట్రోలు ధరలపై వ్యతిరేకత కూడా బీజేపీని ఓడించిందని నారాయణ అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ బలహీనపడింది

బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు వివేక్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ బలహీనపడిందని, కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు ఎట్టిపరిస్థితుల్లో తెలంగాణపై ప్రభావం చూపబోదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ బూత్‌స్థాయి నుంచి బలపడుతోందని ఇందుకు దుబ్బాక, హుజూరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పార్టీ విజయమే నిదర్శనమని చెప్పారు. మునుగోడు ఎన్నికల్లో కూడా బీజేపీ ఓటు శాతం బాగా పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ భారీ మెజార్టీతో అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సంజయ్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ ఉధృతంగా పోరాటాలు చేస్తోందని తెలిపారు. కర్ణాటకలో బీజేపీ సీట్లు తగ్గినా ఓటింగ్ శాతం తగ్గలేదని 2018లో బీజేపీతో ఉన్న ఓటర్లే ఇప్పుడు కూడా తమ పార్టీతోనే ఉన్నారని స్పష్టం చేశారు.

అధికార బీజేపీకి ఊహించని ఫలితం: ఎన్‌సీపీ

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ప్రజలు అధికారంలో ఉన్న బీజేపీకి ఊహించని తీర్పుని ఇచ్చారని, ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని అధికార పార్టీకి గుర్తుచేశారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రజలు అవకాశాలు ఇచ్చినప్పుడు ప్రజల కోసం పనిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ పూట గడిపింది తప్ప పేదల గురించి ఆలోచించలేదని ఆరోపించారు. ప్రజలను పట్టించుకోకపోతే ఎలా ఉంటుందో బీజేపీకి కన్నడ ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు.

గొర్రెలు ఎప్పుడిస్తారు?

సాక్షి, హైదరాబాద్: గొర్రెలు ఇస్తామని డీడీలు తీసుకున్న ప్రభుత్వం వాటిని ఎప్పుడు ఇస్తుందో చెప్పాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రశ్నించారు. పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అడిగినప్పుడల్లా త్వరలో ఇస్తామంటున్నారే తప్పా.. ఎప్పుడిస్తారో చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ గొర్ల కురుమలు అప్పులు చేసి డీడీలు తీశారని పేర్కొన్నారు. ఆలస్యం చేసే కొద్దీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.



దేశంలో ఐదేళ్లుగా తగ్గిన కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాలు

అదే సమయంలో పెరిగిన పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్‌లు

ఉత్పత్తి, నిర్వహణ వ్యయ భారంతో థర్మల్‌వైపు ప్రైవేటు సంస్థల వెనకడుగు

పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సైతం సౌర, పవన విద్యుత్ వైపే మొగ్గు

'రెన్యూవబుల్'కు జై!

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్: నేటి ఆధునిక ప్రపంచంలో విద్యుత్ లేనిదే ఎవరికీ పూట గడిచే పరిస్థితి లేదు. తలసరి విద్యుత్ వినియోగమే రాష్ట్ర, దేశ పురోగతికి సంకేతం. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య తలసరి విద్యుత్ వినియోగం మధ్య వ్యత్యాసం చాలానే ఉంది. పునరుత్పాదక విద్యుత్ (రెన్యూవబుల్ ఎనర్జీ) రావడానికి ముందు థర్మల్, జల, అణు, గ్యాస్ ఇంధనమే ప్రధానమైన విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు. ప్రస్తుతం పవన, సౌర విద్యుత్ కేంద్రాల నిర్మాణం వేగంగా సాగుతోంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం రెన్యూవబుల్ ఎనర్జీనే ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు థర్మల్ విద్యుత్ కేంద్రాలకే పరిమితమైన ఎన్టీపీసీ సైతం ప్రస్తుతం పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో వేగం పెంచింది. మరోవైపు ప్రైవేటు రంగం పెద్ద ఎత్తున రెన్యూవబుల్ ఎనర్జీ వైపు పరుగులు పెడుతోంది. థర్మల్ కేంద్రాల నిర్మాణంలో ఐదేళ్లుగా ప్రైవేటు రంగం గణనీయంగా పడిపోతూ వస్తోంది. 2023లో ఇప్పటివరకు ఒక్క యూనిట్ కూడా ప్రైవేటు రంగంలో గ్రిడ్‌కు అనుసంధానం కాకపోవడం గమనార్హం. రానురాను కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాలు తలకు మించిన భారమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యుత్ ప్లాంట్ నిర్మాణంలోనే కాదు.. దాని ఉత్పత్తి వ్యయం కూడా ఏటేటా పెరుగుతోంది. బొగ్గు ధరలు, బొగ్గు ఉత్పాదన కేంద్రం నుంచి ప్లాంట్ వరకు రవాణా వ్యయం కూడా పెరగడం వల్ల అంతిమంగా విద్యుత్ సరఫరా, పంపిణీ సంస్థలకు వచ్చేసరికి తడిసి మోపెడవుతోంది. అది కాస్తా వినియోగదారులపై భారం మోపక తప్పని పరిస్థితి.

2030 నాటికి కర్బన ఉద్గారాల తగ్గింపే లక్ష్యమా..?



దేశంలో ప్రస్తుతం ఉన్న 2,36,680 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలతో దాదాపు 910 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు విడుదల అవుతున్నాయి. వీటిని గణనీయంగా తగ్గించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. కేంద్ర ఇంధన శాఖలోని కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ) 2029–30 నాటికి శిలాజ ఇంధనలతో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించడం, సంప్రదాయేతర ఇంధనాలతో విద్యుత్ ఉత్పత్తిని పెంచేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తద్వారా పర్యావరణ సమతౌల్యతను కాపాడటానికి సంప్రదాయేతర ఇంధన విద్యుత్ ఉత్పాదనను ప్రోత్సహించనున్నట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న మెగావాట్ ధరలూ ఓ కారణమా..?

దేశంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వ్యయం ఒక మెగావాట్‌కు గడిచిన ఏడేళ్లుగా పెరిగిన తీరు పరిశీలిస్తే... అవి రాబోయే కాలంలో లాభసాటిగా అయ్యే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. 2015లో ఒక మెగావాట్‌కు రూ. 4.88 కోట్లు, 2016లో రూ. 5.33 కోట్లు, 2019లో రూ. 6.79 కోట్లు, 2023లో రూ. 8.34 కోట్లు చేరినట్లు సీఈఏ గణాంకాలు చెబుతున్నాయి. సౌర విద్యుత్ మెగావాట్ వ్యయం దాదాపు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల మేరకు ఉంటోంది. ఒకప్పుడు సౌర ఫలకాల ధరలు అధికంగా ఉండటంతో యూనిట్ విద్యుత్ రూ.14కు కూడా విద్యుత్ సంస్థలు కొనుగోలు చేశాయి. ఇప్పుడు అదే సౌర విద్యుత్ రూ. 3.50 నుంచి రూ. 4.50 మధ్య అందుబాటులోకి వచ్చింది.

2030 నాటికి...




దేశంలో థర్మల్ విద్యుత్ స్థాపిత సామర్థ్యం, సౌర, పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం ప్రకారం 2029–30 నాటికి దేశంలోని అన్ని రకాల విద్యుదుత్పాదన ప్లాంట్ల సామర్థ్యం 5,87,243 మెగావాట్లుగా ఉంటుందని కేంద్రం పేర్కొంది. వాటిలో థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపిత సామర్థ్యం 2,66,911 మెగావాట్లకు చేరుకుంటే... సౌర, పవన విద్యుత్‌ల స్థాపిత సామర్థ్యం ఏకంగా 2,25,160 మెగావాట్లకు చేరనున్నట్లు అంచనా వేసింది. వాటితోపాటు జల, బయోమాస్, బ్యాటరీ స్టోరేజ్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేసింది. తద్వారా కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలన్న నిర్ణయం కూడా ఇమిడి ఉంది. కానీ తాజాగా విడుదల చేసిన అంచనా ప్రకారం మొత్తం స్థాపిత సామర్థ్యం 5,87,243 మెగావాట్లుగా ఉండనుంది.

2023 మార్చి 31 వరకు ఉన్న విద్యుదుత్పాదన సామర్థ్యం

ప్లాంట్‌లు	మెగావాట్లలో
జల విద్యుత్	42,104
పీఎస్‌పీ	4746
చిన్న జల విద్యుత్ ప్లాంట్లు	4999
సౌర విద్యుత్	66,780
పవన విద్యుత్	42,633
బయోమాస్	10,802
న్యూక్లియర్	6,780
థర్మల్ పవర్+లిగ్నైట్	2,11,855
గ్యాస్	24,824
మొత్తం	4,15,469

2029-30 నాటికి ఉత్పాదన సామర్థ్యం పెరుగుదల అంచనా

ప్లాంట్‌లు	మెగావాట్లలో
జల విద్యుత్	11,494
పీఎస్‌పీ	2780
స్మాల్ హైడ్రో	502
సౌర విద్యుత్	92,580
పవన విద్యుత్	25,000
బయోమాస్	3818
న్యూక్లియర్	8700
థర్మల్ విద్యుత్	26900
గ్యాస్	00
మొత్తం	1,71,774





తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు

తెలంగాణ ఘనకీర్తిని దశదిశలా చాటేలా...

▶ మొదటి పేజీ తరువాయి

పండుగ వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వరకు, రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2 నుంచి 21 రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని ప్రకటించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సచివాలయంలో తొలిరోజు ఉత్సవాలు ప్రారంభం కానుండగా మంత్రులు వారివారి జిల్లా కేంద్రాల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఆశ్చర్యపోతున్న ఉత్తరాది రాష్ట్రాలు

'తెలంగాణ సాధించుకొని 2023 జూన్ 2 నాటికి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సమష్టి కృషితో నేడు తెలంగాణ అన్ని రంగాల్లో అత్యద్భుత ఫలితాలను సాధిస్తూ ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దేశానికే రోల్ మోడల్‌గా మారింది. మన ప్రగతిని చూసి ఇతర రాష్ట్రాల వాళ్లు ఆశ్చర్యానికి గురవుతున్నారు. మహారాష్ట్ర తదితర ఉత్తరాది రాష్ట్రాల నాయకులు, ప్రజలు తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి గురించి విని, చూసి ఆశ్చర్యపోతున్నారు. వారికి ఒక దశలో నమ్మశక్యంగా అనిపించని తీరుగా మనం అన్ని రంగాల్లో అద్భుత ప్రగతిని నమోదుచేసుకుంటున్నాం'అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

కేంద్రం, ఇతర రాష్ట్రాలకు కొరవడిన కార్యాచరణ..

అభివృద్ధిని సాధించడమే కాకుండా సాధించిన ఫలితాలను ప్రజలకు అందేలా చూడటంలో దార్శనికతను ప్రదర్శించాల్సి ఉంటుందని సీఎం కేసీఆర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి లేదా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అనుసరించాల్సిన అభివృద్ధి కార్యాచరణపట్ల దూరదృష్టి కొరవడిందని విమర్శించారు.

9 ఏళ్లు కాదు.. కేవలం ఆరేళ్లే!

రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని చూస్తే వాస్తానికి అందుకు ఇంకా చాలా తక్కువ సమయమే పట్టిందని కేసీఆర్ పేర్కొన్నారు. పేరుకు తొమ్మిదేళ్లు అయినా తొలి ఏడాదితోపాటు కరోనా రెండేళ్ల పీడ వల్ల దాదాపు మూడేళ్ల కాలం వృథాగానే పోయిన నేపథ్యంలో కేవలం ఆరేళ్లలోనే తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించడం గొప్ప విషయమన్నారు.

వేడుకల షెడ్యూల్ ఇలా...

- జూన్ 2న తొలిరోజు కార్యక్రమాలను సచివాలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు. సచివాలయ ఉద్యోగులు సహా అన్ని శాఖల హెచ్‌వోడీలు ఉద్యోగులు హాజరవుతారు.
- అమరవీరులను స్మరించుకునేందుకు ప్రత్యేకంగా ఒక రోజును 'మార్టియర్స్ డే'గా జరుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా అమరుల స్థూపాలను అలంకరించి గ్రామగ్రామాన నివాళులు అర్పించాలి. జాతీయ జండాను ఎగరేసి వందన సమర్పణ చేయాలి. వారి త్యాగాలను స్మరిస్తూ తుపాకీ పేల్చి పోలీసులు అధికారికంగా గౌరవ వందనం చేయాలి. అన్ని జిల్లాల కలెక్టర్లు మార్టియర్స్ డేలో పాల్గొనాలి. అన్ని ప్రభుత్వ శాఖలు కూడా అమరుల సంస్మరణ సహా ఉత్సవాల్లో పాల్గొనాలి.
- వివిధ శాఖలు సాధించిన ప్రగతిని (ఆయా శాఖలకు కేటాయించిన రోజున) రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రదర్శించాలి.
- విద్యుత్ శాఖకు కేటాయించిన రోజును పవర్ డే'గా, తాగు, సాగునీటి సరఫరాకు సంబంధించిన రోజును 'వాటర్ డే'గా నిర్వహించాలి.
- అన్ని వర్గాల సంక్షేమానికి సంబంధించి వెల్ఫేర్ డేను ప్రత్యేకంగా ఒకరోజు నిర్వహించాలి. దళితబంధు అమలు, 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, సెక్రటేరియట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టడం మొదలు ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ, మహిళలు సహా పేద వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యాచరణ సమాచారాన్ని మీడియా వేదికల ద్వారా ప్రపంచానికి తెలిపేలా కార్యక్రమాలుండాలి.
- అగ్రికల్చర్ డే, రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డే, రెవెన్యూ డే, పరిపాలనా సంస్కరణలు, పోలీసు సంస్కరణలు తెలిపేలా ప్రత్యేక రోజు, మహిళా సాధికారతను తెలిపేలా 'విమెన్స్ డే, ఇండస్ట్రీస్–ఐటీ డే, ఎడ్యుకేషన్ డే, మెడికల్ అండ్ హెల్త్ డే, ఆర్టిజన్స్ డే (వృత్తిపనులు), గ్రీన్ డే, హ్యాండ్లూమ్ డే, ఆర్థిక ప్రగతి గురించి, మౌలిక వసతుల అభివృద్ధి.. ఇలా ఒక్కో శాఖకు ఒక్కోరోజును కేటాయించి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని ప్రపంచం అర్థం చేసుకునేలా కార్యక్రమాలు చేపట్టాలి.
- స్వతంత్ర భారతంలో, తెలంగాణ కోసం సాగిన తొలిదశ ఉద్యమం నుంచి తెలంగాణను సాధించిన దాకా సాగిన ఉద్యమ చరిత్రను తెలియచేసే డాక్యుమెంటరీని రూపొందించి ప్రదర్శించాలి.
- స్వయం పాలనలో తెలంగాణలో సాగిన సుపరిపాలన, ప్రగతి గురించి మరో డాక్యుమెంటరీని రూపొందించాలి.
- 21 రోజుల సంబురాల సందర్భంగా పిండి వంటలు, ఆటపాటలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు సహా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి.
- గోల్కొండ కోట, భువనగిరి కోట వంటి చారిత్రక కట్టడాలను, రామప్ప సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించాలి.
- హుస్సేన్ సాగర్ వద్ద పెద్ద ఎత్తున బాణసంచా వెలుగులు విరజిమ్మేలా ప్రదర్శన కార్యక్రమాలను చేపట్టాలి.
- విధుల్లో ప్రతిభ కనబరిచిన అన్నిశాఖల ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి అవార్డులు అందజేయాలి.
- రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో 5–6 వేల మంది కళాకారులతో హైదరాబాద్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, ధూం ధాం, ర్యాలీ నిర్వహించాలి.

క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేర్చేలా సీఎం కప్–2023

తెలంగాణ వ్యాప్తంగా క్రీడా సంబురాలు షురూ..



సీఎం కప్ లోగో, మస్కట్, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

సనత్‌నగర్: తెలంగాణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరాల్సన్న లక్ష్యంతో సీఎం కప్–2023ను నిర్వహించడం జరుగుతోందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆ దిశగా రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా సంబురాలు కొనసాగనున్నాయని చెప్పారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో సీఎం కప్–2023 లోగో, మస్కట్, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్స్..ఇలా 18 రకాల క్రీడల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో పోటీలను పూర్తి చేసుకుని ఈ నెల 22న అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా స్థాయి పోటీలను ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే 28న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభించి.. 31న ఎల్బీస్టేడియంలో ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, శాట్స్ డైరెక్టర్ లక్ష్మీ, ఒలంపిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జగదీశ్వర్‌యాదవ్, అర్జున అవార్డు గ్రహీత మృణాళినిరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు: ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మతాలు, దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీపై దేశ ప్రజలు విసిగిపోయారని, అందుకు కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌ను తిరస్కరించి కర్ణాటక ప్రజలు బీజేపీకి చెంపదెబ్బలాంటి తీర్పునిచ్చారని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 40 శాతం కమీషన్లతో అవినీతి పాలన, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం, దేశ సంపదను మోదీ దోస్త్ అదానీకి ధారాదత్తం చేయడం, ప్రభుత్వాలను కూల్చడం వంటి నీతి మాలిన రాజకీయాలకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యులు అరిగోస పడుతున్నారని తెలిపారు. కాగా, కర్ణాటకలో గెలుపు చూసి తెలంగాణలో ఏమో పొడుస్తామని ఇక్కడి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని అన్నారు.

16న సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభ

- తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సభ నిర్వహణ
- సభ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కొప్పుల ఈశ్వర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర నూతన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడమేకాక హైదరాబాద్ నగరంలో ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ ఆనందం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రిని అభినందించేందుకు ధన్యవాద సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన ఇందిరాపార్క్ వద్ద భారీ సభ నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల జేఏసీ స్పష్టం చేసింది. శనివారం ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నివాసంలో ధన్యవాద సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ .. రాష్ట్రాన్ని అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిపిస్తున్నారని మంత్రి కొప్పుల అన్నారు. అమరవీరుల స్మృతివనం నిర్మించినందుకు కూడా ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు గజ్జల కాంతం, ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, అభ్యర్థులకే కన్నడ ఓటరు పట్టం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీఆర్‌ఎస్ విశ్లేషణ

- బీజేపీ వైఫల్యాలు, విద్వేష ఎజెండాను తిరస్కరించారనే భావన
- తెలంగాణలోనూ బీజేపీ ఎజెండాకు ఆదరణ దక్కదనే లెక్కలు
- కాంగ్రెస్‌తో తలపడేందుకు అనుసరించాల్సిన వ్యూహానికి పదును
- అభివృద్ధి ఎజెండాను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే యోచన



సాక్షి, హైదరాబాద్: జాతీయ పార్టీగా అవతరించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉన్నప్పటికీ శనివారం వెలువడిన ఫలితాలను లోతుగా విశ్లేషిస్తోంది. బీజేపీ ఘోర పరాజయం, కాంగ్రెస్ గెలుపు, భావసారూప్య పార్టీ జేడీఎస్ కొన్ని సీట్లకే పరిమితం కావడం వంటి అంశాలను నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ఎన్నికలను ప్రభావితం చేసిన అంశాలు, పార్టీలు, అభ్యర్థుల పనితీరు, ఓటర్ల స్పందన వంటి అంశాలపై అధ్యయనం చేస్తోంది. కర్ణాటక ఫలితాల నేపథ్యంలో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణలో అనుసరించే ఎన్నికల వ్యూహం, వాటిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన ప్రతివ్యూహంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీలు, ఎజెండాల కంటే అవినీతి, అభివృద్ధి, అభ్యర్థుల గుణగణాలకే కర్ణాటక ఓటర్లు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా బీఆర్‌ఎస్ కార్యాచరణ ఉంటుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

మసకబారిన మోదీ, షా ప్రాభవం...

జాతీయ రాజకీయాల్లో శూన్యత ఉందని పదేపదే చెబుతున్న బీఆర్‌ఎస్... కర్ణాటక ఎన్నికలను కూడా అదే కోణంలో విశ్లేషిస్తోంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రాభవం తగ్గిందనేందుకు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు నిదర్శనమని భావిస్తోంది. కేంద్రంతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలనా వైఫల్యాలు, అవినీతి, బంధుప్రీతి వంటి అంశాలు బీజేపీకి ప్రతికూలంగా పనిచేసినట్లు బీఆర్‌ఎస్ లెక్కలు వేస్తోంది. బీజేపీ అమలు చేస్తున్న విద్వేష ఎజెండాను కర్ణాటక ప్రజలు తిరస్కరించిన నేపథ్యంలో తెలంగాణలోనూ అదే ఎజెండాను తెరపైకి తెచ్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని బీఆర్‌ఎస్ విశ్వసిస్తోంది. బీజేపీ ఎజెండాను గట్టిగా ఎదుర్కొనేందుకు కర్ణాటక ఎన్నికలను ఉదాహరణగా చూపడం ద్వారా దీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందని పార్టీ ముఖ్య నేత ఒకరు వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమాల ద్వారా కొన్ని వర్గాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ చేసే ప్రయత్నాలకు కర్ణాటక ఫలితాలు కొంతమేర అడ్డుకట్ట వేయగలుగుతాయని బీఆర్‌ఎస్ భావిస్తోంది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోనే బీజేపీ ప్రభావం కొంత ఉందని అంచనా వేస్తున్న బీఆర్‌ఎస్... ప్రతిదాడిని పెంచాలని నిర్ణయించింది.

కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు వ్యూహం

కర్ణాటక ఫలితాల ఉత్సాహంతో తెలంగాణలోనూ కాంగ్రెస్ దూకుడు పెంచుతుందని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ దిశగా కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై దృష్టి సారిస్తే అనుసరించాల్సిన వ్యూహంపైనా కేసీఆర్ ఇప్పటికే ఓ కార్యాచరణతో సిద్ధంగా ఉన్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతను అనువుగా మలుచుకున్న కాంగ్రెస్... తెలంగాణలోనూ అదే తరహా వ్యూహాలను అమలు చేసే అవకాశమున్నట్లు బీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. ఎన్నికలు సమీపించేకొద్దీ కాంగ్రెస్ దూకుడు పెంచే అవకాశాలున్నందున పార్టీ, ప్రభుత్వ కార్యకలాపాల్లో మరింత వేడి పెంచేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతోంది. అలాగే భావసారూప్య పార్టీ జేడీఎస్ కర్ణాటక ఎన్నికల్లో సాధించిన ఫలితాలను కూడా బీఆర్‌ఎస్ విశ్లేషిస్తోంది. కర్ణాటకలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఓటర్లు కోరుకోవడం కూడా జేడీఎస్‌పై ప్రభావం చూపినట్లు లెక్కలు వేస్తోంది.

తెలంగాణపై కర్ణాటక ఫలితాల ప్రభావం ఉండదు: మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణపై ఎంతమాత్రం ఉండదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. లండన్ పర్యటనలో ఉన్న కేటీఆర్ ట్విట్టర్ ద్వారా కర్ణాటక ఫలితాలపై స్పందించారు. 'కేరళ స్టోరీ.. కర్ణాటక ప్రజలను రంజింపజేయడంలో విఫలమైన రీతిలోనే తెలంగాణపై ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాల ప్రభావం ఎంతమాత్రం ఉండదు. నీచ, విభజన రాజకీయాలను తిరస్కరించిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు. కర్ణాటకలో కాంగ్రెస్ నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు'.. అని ట్వీట్ చేశారు

దక్షిణాది నుంచే బీజేపీ పతనం ప్రారంభం: హరీశ్‌రావు



'ఇదీ దక్షిణ భారతదేశ చరిత్ర. ప్రజలు బీజేపీ నుంచి విముక్తి కోరుకుంటున్నారని కర్ణాటక ఫలితాలు వెల్లడించాయి. ఇకపై ఇదే కొనసాగుతుంది. దక్షిణాది నుంచి బీజేపీ పతనం ప్రారంభమైంది. తెలంగాణలో కనీసం డిపాజిట్లు కూడా దక్కవు. కొత్తగా ఎన్నికైన కర్ణాటక ప్రభుత్వానికి శుభాకాంక్షలు'అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

సాక్షి హైదరాబాద్





ఆదివారం । 14 । మే । 2023



అంబర్‌పేట్ నుంచి గాంధీ భవన్‌కు కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ



రాంనగర్‌లో కాంగ్రెస్ అగ్రనేతల చిత్రపటాలతో..



బస్సులో యూత్ కాంగ్రెస్ నేత అనిల్ కుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రయాణికురాలు

గ్రేటర్ కాంగ్రెస్‌లో కర్ణాటక జోష్

- గాంధీభవన్ వద్ద శ్రేణుల ఆనందం
- నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- హనుమాన్ దేవాలయంలో పూజలు



సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటక ఫలితాలు నగర కాంగ్రెస్‌లో జోష్ నింపింది. పార్టీ శ్రేణుల విజయోత్సవ ర్యాలీలు, నృత్యాలు, స్వీట్ల పంపిణీ, కేక్ కట్టింగ్, బాణాసంచాలతో సంబరాల మిన్నంటాయి. హస్తం కార్యకర్తలు ఆనందోత్సాల్లో మునిగితేలారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ యాదవ్‌లు పార్టీ శ్రేణులతో కలిసి నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు నిలోఫర్ ఆస్పత్రి సమీపంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబర్‌పేట నుంచి గాంధీ భవన్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అగ్రనేతలు రాహుల్ జోడో యాత్ర, ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపగా.. తాజాగా కర్ణాటక ఫలితాలు రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపుతాయన్న ఆశలు చిగురిస్తున్నాయి. గాంధీభవన్ కార్యకర్తలతో కళకళలాడింది. కర్ణాటక ఫలితాలతో అక్కడ హడావుడి కనిపించింది. ముఖ్య నేతలు స్వీట్లు తినిపంచుకొని సంబరాలు జరుపుకొన్నారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్‌కు మంచి బూస్ట్ అందించే పరిణామం అంటూ పలువురు నేతలు వ్యాఖ్యానించారు. వాస్తవంగా మునుగోడు ఎన్నికల ఫలితాల ముందు వరకూ గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల హడావుడి గట్టిగానే ఉండేది. ఉప ఎన్నికల్లో సిట్టింగ్ స్థానం చేజారడంతో పార్టీ శ్రేణులు డీలా పడిపోయాయి. తాజాగా కర్ణాటక ఫలితాలతో పూర్తిగా పరిస్థితులు మారిపోయాయి. గాంధీభవన్‌కు పూర్వ కళ వచ్చినట్లయింది.





ఐదో 'సారీ'

నాలుగేళ్ల తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తున్న నగర అభిమానులకు ఆశించిన ఆనందం మాత్రం దక్కలేదు. అప్పుడప్పుడు కొన్ని మెరుపులు తప్ప ఆటగాళ్ల నుంచి అద్భుతమైన ప్రదర్శనలేవీ రాకపోగా, హైదరాబాద్ టీమ్ కూడా పేలవ ప్రదర్శనతో నిరాశపర్చింది. సొంతగడ్డపై ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకిది ఐదో పరాజయం.



విజయానందంలో లక్నో క్రికెటర్లు నికోలస్ పూరన్, మన్కడ్




భార్యతో క్రికెటర్ గ్లెన్ ఫిలిప్స్, కూతురితో భువనేశ్వర్ కుమార్

న్యూస్‌రీల్

హెచ్ఐసీసీలో 'సూత్ర' ఎగ్జిబిషన్



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'సూత్ర' వస్త్ర ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనను పలువురు మోడల్స్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సూత్ర' వస్త్ర ప్రదర్శన నిర్వాహకులు ఉమేష్ మద్యన్ మాట్లాడుతూ.. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లతో కూడిన వస్త్రాలు, చీరలు, లెహంగాలు, నగలు, షూలు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సహజ సంపదను పరిరక్షించుకుందాం

సాక్షి, సిటీబ్యూరో: కుతుబ్ షాహీ టూంబ్స్‌తో పాటు దక్కన్ పార్క్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. శనివారం ఆగాఖాన్ ట్రస్ట్ సాంస్కృతిక విభాగం ప్రతినిధులతో కలిసి ఆయన కుతుబ్ షాహీ టూంబ్స్, డెక్కన్ పార్క్ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఆగాఖాన్ ట్రస్ట్ చేపట్టిన డెక్కన్ పార్కులో మార్గాలు, చెట్ల పెంపకం, సరస్సుల సృష్టి, పాదచారుల బాట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా యునెస్కో అవార్డు ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆరు మెట్ల బావి పనులను తనిఖీ చేశారు. కుతుబ్ షాహీల వైభవ ప్రాముఖ్యత పర్యాటకులకు వివరించేందుకు ఏర్పాటు చేసిన డిజిటల్ మ్యూజియం మార్గదర్శకాలకు (గైడ్స్) శిక్షణ, చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ తదితర విషయాలపై అధికారులతో సందీప్‌కుమార్ సుల్తానియా చర్చించారు. కార్యక్రమంలో ఆర్కియాలజీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ, పురావస్తు, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సందీప్‌కుమార్

కన్నేశారు.. అమ్మేశారు!

కుత్బుల్లాపూర్: కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై కన్నేశారు. 60 నుంచి 80 గజాల వరకు ఒక్కో ప్లాటును రూ.15 లక్షల చొప్పున అమాయకులకు కట్టబెట్టారు. రెవెన్యూ అధికారులు, పోలీసులతో కుమ్మక్కై కబ్జాదారులు ఆడిన ఆటలో సామాన్యులే సమిధులయ్యారు. కుత్బుల్లాపూర్ పరిధిలో గత మూడేళ్లలో 2500 అక్రమ నిర్మాణాలు జరిగినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్

కుత్బుల్లాపూర్ పరిధిలో భూకబ్జాదారులు

- ప్రభుత్వ స్థలాలను ప్లాట్లు చేసి విక్రయాలు
- మూడేళ్లలో 2500 అక్రమ నిర్మాణాల గుర్తింపు
- ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డిపై వేటు..
- ఆర్డీఓ, తహసీల్దార్‌ను వదిలివేయడంపై అనుమానాలు





అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

అమయ్ కుమార్ నివేదిక ద్వారా గుర్తించడం.. సుమారు రూ. 375 కోట్ల లావాదేవీలు జరిగాయని వదంతులు రావడం కలకలం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డిపై వేటు వేసి.. ఆర్డీఓ, తహసీల్దార్లను వదిలేయడంలో ఆంతర్యమేమిటనే ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



గాజులరామారం పరిధిలో ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలు

కేసులపై కేసులు...

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువులు, కుంటలు, ఎస్ఎఫ్‌సీ స్థలాలు, ఖాళీగా ఉన్న హెచ్ఎండీఏ భూముల్లో కబ్జాదారులు ఆక్రమణలకు తెరలేపారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయగానే ఎఫ్ఐఆర్ నమోదు కావడం.. కోర్టుకు వెళ్లి బెయిల్‌పై రావడం తిరిగి కబ్జాలు చేయడం పరిపాటిగా మారింది. పోలీసులు ఒకటి, రెండు, మూడు కేసుల తర్వాత వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి జైలుకు పంపే ప్రక్రియ చేపట్టేవారు.. కానీ ఇక్కడ జరుగుతున్న భూకబ్జా దారులపై ఒకటి నుంచి మొదలుకుంటే 10 కేసుల వరకు 14 మందిపై నమోదు కావడం గమనార్హం. జగద్గిరిగుట్ట పోలీసులు సైతం అక్రమార్కులకు అండగా నిలిచారని, దీంతో కబ్జాదారులు రెచ్చిపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువైన భూములపై కన్నేసిన కబ్జాదారులు అందినకాడికి దండుకొని కార్లు, బహుళ అంతస్తులు నిర్మించుకుని రాజకీయ నాయకుల అవతారం ఎత్తారు.

హడావుడి చేశారు.. చేతులెత్తేశారు....

భారీ కూల్చివేతలు చేపడతామని పోలీస్ ప్రొటెక్షన్ కావాలని జగద్గిరిగుట్ట, జీడిమెట్ల పోలీసులకు గత నెల 30న ఆర్ఐ పరమేశ్వర్ రెడ్డి సమాచారం ఇచ్చారు. ముందుగా 21 మంది భూకబ్జాదారులను బైండోవర్ కింద అదుపులోకి తీసుకున్న తర్వాతే కూల్చివేతలు చేపట్టాలని పరమేశ్వర్‌రెడ్డి లిఖిత పూర్వంగా పోలీసులకు లెటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న తెల్లవారుజామున 342, 329, 307 సర్వే నంబర్లలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు 12 డీసీఎంలు, 12 జేసీబీలు, 20 చిన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు, రెండు వాటర్ ట్యాంకర్లు, ఓ ఫైర్ ఇంజిన్, మల్కాజిగిరి డివిజన్ సిబ్బంది 30 మందితో పాటు 70 మంది కార్మికులు ఈ కూల్చివేతల్లో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసి.. తెల్లవారుజామున 4 గంటల సమయంలో పోలీసులు రావడం లేదంటూ ఆర్డీవో మల్లయ్య, తహసీల్దార్ సంజీవరావు ఇద్దరూ అక్కడికి చేరుకుని కూల్చివేతలను వాయిదా వేయడం వెనుక కబ్జాదారుల హస్తం ఉందనే అనుమానాలు వినిపిస్తున్నాయి. పోలీసులపై, అధికారులపై కబ్జాదారులు ఒత్తిడి తేవడంతో చేతులెత్తేశారని సమాచారం.

డ్రైవర్ అకౌంట్‌లోకి రూ.18 లక్షలు..

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజుల రామారం సర్వే నెంబర్ 329/1 లో అక్రమ నిర్మాణాలను చేపట్టిన ఓ కబ్జాదారు ఏకంగా తహసీల్దార్ సంజీవరావు డ్రైవర్ అకౌంట్‌లో రూ.18 లక్షలు వేశానని బహిరంగంగా వీడియో సందేశం వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొట్టడం విశేషం. 2019 మే 29న 'వీడు ఉన్నంతకాలం కబ్జాలు వద్దు' అని అప్పటి తహసీల్దార్ గౌతంకుమార్‌ను ఉద్దేశించి ఓ కబ్జాదారుతో వీఆర్ఏ సత్యనారాయణ మాట్లాడిన ఆడియో వైరల్ కావడంతో అప్పట్లో కలెక్టర్ ఎం.వి.రెడ్డి ఈ విషయంపై సీరియస్ అయి సదర్ వీఆర్ఏను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే వీఆర్ఓను 2020 సెప్టెంబర్ 9న తిరిగి విధుల్లోకి తీసుకొని బాలానగర్‌లో పోస్టింగ్ ఇస్తూ కుత్బుల్లాపూర్ మండలంలో డిప్యూటేషన్ పై నియమించడం వెనక పెద్ద ఎత్తున చేతులు మారినట్లు విశ్వసనీయంగా తెలిసింది.. అదే విధంగా మరో వీఆర్ఏ (తాత్కాలిక) విధులు నిర్వహిస్తున్న వాసు కార్యాలయంలో అడుగుపెట్టకుండా కట్టడి చేస్తూ తహసీల్దార్‌గా ఉన్న గౌరీ వత్సల ఆదేశాలు జారీ చేయగా ఆమె బదిలీ తర్వాత ఈ ఇద్దరు విధుల్లోకి రావడం విశేషం.

వడివడిగా ఎయిర్‌పోర్టు మెట్రో

ఈ నెలాఖరు వరకు టెండర్లు

- ఈపీసీ పద్ధతిలో నిర్మాణం
- విధివిధానాలపై నోడల్ ఏజెన్సీకి బాధ్యతలు
- ఇప్పటికే ఢిల్లీ ఎయిర్‌పోర్టు మెట్రోపై అధ్యయనం
- అదే తరహాలో లగేజీ తనిఖీలు, చెక్ ఇన్ సేవలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఎయిర్‌పోర్టు మెట్రో రైలు నిర్మాణ కార్యాచరణ వేగవంతమైంది. ఈ ప్రాజెక్టు కోసం ఈ నెలాఖరు వరకు గ్లోబల్ టెండర్లను ఆహ్వానించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ కార్యాచరణ చేపట్టింది. బిడ్డింగ్ విధివిధానాలను, నియమ నిబంధనల రూపకల్పన బాధ్యతలను ఓ నోడల్ ఏజెన్సీకి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. నోడల్ ఏజెన్సీ బిడ్ డాక్యుమెంట్లను రూపొందించిన వెంటనే టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

రూ.6 వేల కోట్లకు పైగా నిధులతో..

ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ నిర్మాణం చేపట్టనున్నారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 31 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఎయిర్‌పోర్టు మెట్రో నగరానికి మరో అందమైన మణిహారంగా భాసిల్లనుంది. దాదాపు రూ.6 వేల కోట్లకు పైగా అంచనాతో చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో రైలు మార్గం వేగవంతం కావడానికి పనులు చకచకా సాగుతున్నాయి.

ఐటీ కారిడార్‌కు వెన్నుదన్ను..



ఎయిర్‌పోర్టు మెట్రో రైలు అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలకు మార్గం సుగమమం చేయడంతో పాటు ఐటీ కారిడార్లలో సేవల విస్తరణకు మరింత దోహదం చేయనుంది. రాయదుర్గం టర్మినల్, మైండ్‌స్పేస్ జంక్షన్, బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్డు, నానక్‌రాంగూడ జంక్షన్ మీదుగా ఔటర్ మార్గంలో ఎయిర్‌పోర్టు వరకు నిర్మించనున్నారు. దీంతో రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులతో పాటు రాయదుర్గం నుంచి నార్సింగి వరకు పెద్ద సంఖ్యలో ఏర్పడిన ఐటీ సంస్థలకు రాకపోకలు సాగించే సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఐటీ ఉద్యోగులకు కూడా రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు బుద్వేల్ వరకు సాఫ్ట్‌వేర్ బూమ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు మెట్రో.. ఐటీ సంస్థల విస్తరణకు సైతం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఆటంకాలను అధిగమించేలా..

ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్‌లో పలు చోట్ల ఆటంకాలు కూడా ఉన్నాయి. చాలా వరకు రోడ్డు మార్గం నుంచే వెళుతున్నప్పటికీ ఒకటి, రెండు చోట్ల గుట్టలపై నుంచి మెట్రో పరుగులు తీయాల్సివస్తుంది. దీంతో ఆయా చోట్ల అలైన్‌మెంట్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఢిల్లీ తరహాలో సేవలు..

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి నేతృత్వంలో ఇంజినీరింగ్ నిపుణుల బృందం ఇటీవల ఢిల్లీ ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్‌ను సందర్శించింది. అక్కడ ప్రయాణికులకు లభిస్తున్న సేవలు, సదుపాయాలు, మెట్రో రైళ్ల రాకపోకలపై అధికారులు అధ్యయనం చేశారు. అదే పద్ధతిలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైలు సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నాలుగు స్టేషన్‌లలో లగేజీ తనిఖీలు..

ఢిల్లీలో రెండు సిటీ మెట్రో స్టేషన్లలో చెక్‌ఇన్ పూర్తి చేసుకొనే సదుపాయం ఉండగా హైదరాబాద్‌లో రాయదుర్గంతో పాటు మరిన్ని స్టేషన్‌లలో చెక్ ఇన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. రాయదుర్గంతో పాటు నానక్‌రాంగూడ, నార్సింగి, రాజేంద్రనగర్ స్టేషన్‌లలో చెక్ ఇన్ సేవలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెక్ ఇన్ స్టేషన్‌ల నుంచి లగేజీ నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకొనేలా ఏర్పాట్లు ఉంటాయి. ఎయిర్‌పోర్టు మెట్రోస్టేషన్ నుంచి లగేజీ తనిఖీలు పూర్తయిన వెంటనే ఆటోమేటిక్‌గా మెట్రో కోచ్‌లోని లగేజ్ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి చేరేలా ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌తో కూడిన కంటైనర్లను వినియోగిస్తారు. రాయదుర్గం, నానక్‌రాంగూడ,నార్సింగి, రాజేంద్రనగర్ స్టేషన్‌లలో ఏదైనా ఒకదానిలో ప్రయాణికులు తమ విమానం బయలుదేరే సమయానికి 2 గంటల ముందు చెక్ ఇన్ చేసుకోవచ్చు. చెక్ ఇన్ చేసిన తర్వాత, ప్రయాణికులు మెట్రో రైలులో ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ సంబంధిత విమానాల్లో ఎక్కడానికి తమను తాము భద్రతా తనిఖీ చేసుకొంటే చాలు.

మినీ బస్సు ఎక్కడ?

- కాలనీల నుంచి ప్రధాన మార్గాలకు కొరవడిన కనెక్టివిటీ
- గ్రేటర్‌లో ప్రజా రవాణాకు దూరంగా సుమారు 2500 కాలనీలు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ కల్యాణ్‌పురి, బ్యాంక్ కాలనీ, స్వరూప్‌నగర్, వెంకటేశ్వర టెంపుల్, తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు స్టేడియం మెట్రో స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తారు. స్టేడియం స్టేషన్ నుంచి మెట్రోలో వివిధ ప్రాంతాలకు బయలుదేరుతారు. ఒక్క ఉప్పల్ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలే కాదు. అటు బోడుప్పల్, మేడిపల్లి చుట్టుపక్కల ఉన్న కాలనీల నుంచి ఇటు, నాగోల్, బండ్లగూడలకు రెండు వైపులా ఉన్న అనేక కాలనీల నుంచి ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు మెట్రో రైలెక్కాలన్నా, తమ కాలనీల నుంచి నగరంలో ఎక్కడికి వెళ్లాలనుకున్నా సెవెన్ సీటర్ ఆటోలను ఆశ్రయించాలి. లేదా మూడు సీట్ల ఆటోలు, క్యాబ్‌లు, క్యాబ్ బైక్‌లు బుక్ చేసుకొని వెళ్లాలి. సొంత వాహనాలను వినియోగించాలి. కాలనీల నుంచి ప్రధాన మార్గాలను కలిపేవిధంగా సరైన రవాణా సదుపాయాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం 25 నుంచి 30 మంది ప్రయాణం చేసేందుకు అనుకూలంగా ఉండే మినీ బస్సులను ప్రవేశపెట్టాలని హైదరాబాద్ మెట్రో రైల్, ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ చాలాకాలంగా ప్రతిపాదిస్తూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఒక్క బస్సు కూడా రోడ్డెక్కలేదు.

ఉన్నవే తుక్కయ్యాయి..

పాతబస్తీలోని ఇరుకు రహదారులు, ప్రధాన మార్గాలకు దూరంగా ఉన్న బస్తీవాసులకు ప్రయాణ సదుపాయాన్ని అందజేసే లక్ష్యంతో గ్రేటర్ ఆర్టీసీ సుమారు 100 మినీ బస్సులను గతంలో అందుబాటులోకి తెచ్చింది. వందలాది బస్తీలకు ఈ బస్సులు అందుబాటులో ఉండేవి. ఫలక్‌నుమా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, డబీర్‌పూర్ తదితర ప్రాంతాలతో పాటు ఇటు కార్వాన్, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, లంగర్‌హౌజ్ వరకు మినీ బస్సులను నడిపారు. పెద్ద బస్సులు వెళ్లలేని రూట్‌లలో ఇవి తేలిగ్గా రాకపోకలు సాగించాయి. తక్కువ దూరం ఉన్న రూట్లు కావడం వల్ల సెవెన్ సిటర్ ఆటోల తరహాలో ఈ బస్సులు అందుబాటులో ఉండేవి. కానీ ఇవి క్రమంగా కాలం చెల్లిపోయి తుక్కుగా మారాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు.

అటకెక్కిన వజ్ర..

ఆ తరువాత ప్రభుత్వం ఏసీ, నాన్ ఏసీ కేటగిరీల్లో 80 వజ్ర బస్సులను ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. నగరంలోని కాలనీలకు కాకుండా ఈ బస్సులను హైదరాబాద్ నుంచి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, తదితర ప్రాంతాలకు నడిపారు.కాలనీల నుంచి నేరుగా బయలుదేరే విధంగా ఏర్పాటు చేశారు.కొద్ది రోజుల్లోనే ప్రయాణికుల ఆదరణ లేదనే కారణంతో రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ బస్సులను పక్కన పెట్టేశారు. ఆ తర్వాత కొంతకాలం నగరంలోని పలు డిపోల నుంచి యాదాద్రి వరకు నడిపా రు. ఇప్పుడు ఆ రూట్‌లోనూ వజ్ర బస్సులు లేవు.

కొరవడిన మెట్రో కనెక్టివిటీ...

నగరంలోని మూడు ప్రధాన కారిడార్‌లలో సుమారు 52 స్టేషన్‌ల నుంచి మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. కనీసం 2500 కాలనీల నుంచి నగరవాసులు మెట్రోస్టేషన్‌లకు చేరుకుంటున్నారు. మినీ బస్సులు అందుబాటులో ఉంటే ఇంటి నుంచి నేరుగా మెట్రోకు చేరుకొనే సదుపాయం ఉండేది. ఆర్టీసీ, మెట్రో రైల్ మధ్య కొరవడిన సమన్వయం కారణంగా లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అనేది ఆచరణసాధ్యం కాని ప్రతిపాదనగానే మిగిలింది.

రుణం చెల్లించినా డాక్యుమెంట్లు ఇవ్వని వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: రుణం చెల్లించిన తర్వాత కూడా ఇంటి డాక్యుమెంట్లు ఇవ్వకుండా వేధిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్‌కు చెందిన హెచ్. వెంకట్‌రెడ్డి వద్ద అదే బస్తీకి చెందిన కె.విజయలక్ష్మి తన ఇంటి డాక్యుమెంట్లు పెట్టి రూ. 2 లక్షలు అప్పు తీసుకుంది. అయితే వడ్డీతో కలిపి ఈ అప్పు కాస్త రూ. 5 లక్షలు కాగా ఆ మొత్తాన్ని చెల్లించినా వెంకట్‌రెడ్డి తన వద్ద పెట్టుకున్న ఇంటి పత్రాలు ఇవ్వకుండా సతాయిస్తున్నాడు. సదానంద్ అనే వ్యక్తిని కూడా ఇదే తరహాలో మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. రూ. 24 లక్షల మేర చీట్ చేసినట్లుగా ఆరోపించింది. తనలాగే చాలా మంది మోసపోయారని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు వెంకట్‌రెడ్డి, ఆయన భార్య నర్మదపై తెలంగాణ మనీ ల్యాండరింగ్ యాక్ట్‌తో పాటు ఐపీసీ సెక్షన్ 420, 384 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అరెస్ట్


నిందితుడు రాజ్‌కుమార్

హస్తినాపురం: వనస్థలిపురంలో కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా గొంతుకోసి హత్య చేసిన కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌ను శనివారం వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గత కొన్ని సంవత్సరాలుగా భార్యపై అనుమానం పెంచుకున్న రాజ్‌కుమార్ ఆమెను చిత్ర హింసలు పెడుతూ వేధింపులకు గురిచేసేవాడని తెలిపారు. శుక్రవారం ఉదయం 9.40 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రాజ్‌కుమార్ అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో తన భార్య శోభను గొంతుకోసి హత్యచేశాడని సీఐ తెలిపారు. భార్యను హత్యచేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆపడానికి ప్రయత్నించిన అతని పెద్ద కొడుకు సాత్విక్‌ను కూడా చంపబోగా..అతడు రెండు చేతులు అడ్డం పెట్టుకుని తప్పించుకున్నాడని, సాత్విక్ రెండు చేతులకు రక్త గాయాలు కావడంతో వెంటనే రాజ్‌కుమార్ అక్కడ నుండి తప్పించుకుని పారిపోయినట్లు సీఐ వెల్లడించారు. సాత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని రాజ్‌కుమార్‌ను శుక్రవారం రాత్రి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అతని వద్ద నుండి కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

‘నా చావుకు నేనే కారణం...’

చెల్లికి వాట్సాప్ మెసేజ్ పెట్టి యువకుడి ఆత్మహత్య


మృతుడు శివగణేష్

జీడిమెట్ల: ‘నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను..నా చావుకు నేనే కారణం’ అంటూ ఓ యువకుడు తన చెల్లికి వాట్సాప్‌లో సందేశం పంపి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం... యాదాద్రి జిల్లా నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన శివ గణేష్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చి చింతల్ చంద్రానగర్‌లో ఉంటూ ఎంటీఆర్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కొన్ని రోజులు చిన్నాన్న శివ స్వామి ఇంట్లో ఉన్నాడు. అనంతరం ఓ గది అద్దెకు తీసుకుని ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 12 గంటలకు తన చెల్లి అంజలికి వాట్సాప్‌లో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్ చేశాడు. ఉదయం మెసేజ్ చూసిన అంజలి చింతల్‌లో ఉండే తన చిన్నాన్న శివస్వామికి ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేసింది. అతను శివగణేష్ ఉండే గదికి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువత

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇందుకు కర్నాటక ఎన్నికలు శుభసూచికమని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సూరారం కాలనీకి చెందిన మండల శివకుమార్ తన మిత్ర బృందంతో కలిసి శనివారం టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జగ్గారెడ్డి, పున్నారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత పార్టీ విధానాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌రాజు నగర్‌లో ‘మలబార్’ షోరూం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఏఎస్‌రాజు నగర్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చే మలబార్‌గోల్డ్‌లో ఆభరణాలు బాగున్నాయన్నారు. మలబార్‌గోల్డ్ చైర్మన్ అహ్మద్ మాట్లాడుతూ ఈ షోరూమ్‌లో గోల్డ్, డైమండ్స్‌తో కూడిన నగలు ఆకర్షణీయమైన డిజైన్లలో లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు షరీఫ్, సిరాజ్, శ్రీనివాస్, షానిబ్ తదితరులు పాల్గొన్నారు.


మలబార్ షోరూమ్‌లో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

క్లుప్తంగా...

ఘనంగా వరల్డ్ లూపర్స్ డే



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని సిటీ న్యూరో సెంటర్ ఆస్పత్రిలో వరల్డ్ లూపర్స్ (కీళ్లవాతం) డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ ప్రసన్న పరిమి మాట్లాడుతూ... లూపర్స్ అనేది కీళ్లవాతంలో ఒక భాగమని ఇది ఎక్కువగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న మహిళల్లో ఎక్కువగా వస్తున్నదని దీన్ని గుర్తించి సరైన వైద్యం అందిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆమె అన్నారు. ఈ వ్యాధిపై ఎక్కువ మందికి అవగాహన కల్పించేందుకు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, లూపర్స్ వ్యాధితో బాధపడుతున్న రోగులు పాల్గొన్నారు.

ర్యాంకర్లకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటేశ్వరకాలనీ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని ఉదయ్‌నగర్ స్కూల్‌లో ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. సి.హెచ్ వినయ్, ఎం.శ్రీలేఖలు 9 జీపీఏ సాధించడంతో పాటు 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మాచుపల్లి శేఖర్, ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

సమయపాలనతో ఉజ్వల భవిత



బహుమతులను అందజేస్తున్న ఏసీపీ

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులు సమయపాలనతో ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని సుల్తాన్‌బజార్ ఈస్ట్ జోన్ ఏసీపీ దేవందర్ సూచించారు. శనివారం నారాయణగూడలోని హెచ్‌ఆర్‌డీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవం సందడిగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం పడుతున్న కష్టాలకు విలువ కట్టలేమన్నారు. వారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ఇష్టపడి చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కళాశాలలో వివిధ సందర్భాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఆర్‌డీ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, ప్రిన్సిపాల్ పి.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మీకాంతరావు, ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి త్రిచక్ర వాహనం అందజేత..

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగుడికి త్రిచక్ర వాహనం అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. మోండా మార్కెట్ డివిజన్‌కు చెందిన రామయ్య అనే దివ్యాంగుడికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా శనివారం వాహనాన్ని అందజేశారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయికిరణ్‌యాదవ్ జన్మదినం కావడంతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈఓ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో నేడు కూరగాయల ధరలు రూ.లలో ఇలా ఉన్నాయి. టమాటా కిలో రూ.13, నల్లవంకాయ రూ.23, పొడుగు వంకాయ రూ.23, బెండకాయ రూ.28, పచ్చిమిర్చి 40, బజ్జీ మిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 19, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 15, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 55, సొరకాయ 7, పొట్లకాయ 15, అరటికాయ ఒక్కటి రూ.10, మునగకాయ ఒక్కటి రూ.3-4, ముల్లంగి రూ.4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

లోటస్‌పాండ్‌కు సొబగులు

- చెరువు వద్ద మెరుగైన వసతులు
- మృత్యువాత పడుతున్న చేపలు
- అప్రమత్తమైన అధికారులు
- పరికరాలకు మరమ్మతులు



మరమ్మతులకు నోచుకున్న ఎయిరేటర్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని లోటస్‌పాండ్‌లో పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. ఇటీవల కాలంలో లోటస్ పాండ్‌లో పెద్ద ఎత్తున చేపలు మృత్యువాతపడ్డ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొన్న జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం మరమ్మతులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే మూలనపడ్డ పరికరాలకు మరమ్మతులు చేపట్టారు.

– చెరువులో నీళ్లు దుర్గంధమయంగా మారి చేపలకు ఆక్సిజన్ అందకనే మృతి చెందినట్లుగా మత్స్యశాఖ అధికారులు నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆక్సిజన్ అందకపోవడానికి గల కారణాలను తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ముందుగా వాటిపై దృష్టిపెట్టారు. నీళ్లు కదలకుండా దుర్గంధం పేరుకుపోవడం వల్లనే ఈ సమస్య తలెత్తినట్లుగా గుర్తించి నీరు కదులుతూ శుభ్రపడే విధంగా ఎయిరేటర్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫౌంటెయిన్ల మాదిరిగా ఈ ఎయిరేటర్లు నీళ్లను పైకి ఎగజిమ్ముతో మళ్లీ చెరువులో పడుతుంటాయి.

- దీని వల్ల నీరు అటూ ఇటూ తిరుగుతూ చేపలకు, ఇతర జలచరాలకు ఆక్సిజన్ అందుతుందని అధికారులు తెలిపారు. ఇంకో వైపు పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు మూలనపడ్డ బోట్లకు కూడా మరమ్మతులుచేపట్టారు.
- ఇక్కడున్న రెండు బోట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. సిబ్బందితో నీళ్లను ఎక్కడికక్కడ శుభ్రం చేస్తూ వ్యర్థాలను తొలగిస్తున్నారు.
- త్వరలోనే ఫౌంటెయిన్లు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటికీ నీళ్లన్నీ పరిశుభ్రంగా మారాయని పార్కుల నిర్వహణాధికారి బాలయ్య తెలిపారు.



లోటస్‌పాండ్‌లో బోట్ల ద్వారా వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

15 రోజులు గడువు విధిస్తున్నా...

- పనుల్లో పురోగతి లేకుంటే అధికారులపై చర్యలు తథ్యం
- వీధి దీపాల విభాగం పనితీరుపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి
- నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే దానం నాగేందర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: కాలనీలు, బస్తీల్లో తిరుగుతుంటే ఎక్కడ తిరుగుతున్నా కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.. అధికారులకు ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు... ఇప్పటికి కూడా అధికారులు కళ్లు తెరుచుకోకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి.. ఈ రివ్యూ మీటింగ్ పూర్తయిన 15 రోజుల తర్వాత మరోసారి సమస్యలపై సమీక్షిస్తాం. పని తీరు మారని, మార్చుకోని అధికారులపై శాఖాపరమైన చర్యలకు సైతం వెనుకాడబోమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పనులపై నియోజకవర్గ స్థాయిలో ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని గౌరీశంకర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌తో పాటు జలమండలి జీఎం, మేనేజర్లు, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు, డీఎంసీలు, ఎలక్ట్రిసిటీ అధికారులు, వీధి దీపాల విభాగం అధికారులు, పారిశుద్ధ్య విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, స్థానిక నేతలు వారు స్థానికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏకరవు పెట్టారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో డివిజన్ల వారీగా సమస్యలు గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాలు, అధికారులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల అధికారులు, ముఖ్య నేతలు సమావేశంలో పాల్గొని తమ సమస్యలను వినిపించారు. ఏ డివిజన్‌లో చూసినా ముఖ్యంగా పెద్ద ఎత్తున వీధి దీపాల విభాగంపై ఫిర్యాదులు రావడంలో ఆ శాఖ అధికారులపై ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు.

క్రమబద్ధీకరణ అవకాశం.. పేదలకు వరం



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: జీవో–58, 59ల కింద పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాలంటూ లబ్ధిదారులకు నోటీసులు జారీ అయ్యాయని నామినల్ ఫీజు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెప్పగా అందుకు ఆయన అంగీకరించారని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఈ విషయంలో ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 38 మందికి జీవో 58 కింద మంజూరైన పట్టాలను ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 గజాల్లోపు ఉన్న స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. జీవో 59కి త్వరలోనే చెల్లించే ఫీజు విషయంలో గైడ్‌లైన్స్ వస్తాయన్నారు.

22 మందికి చెక్కుల పంపిణీ

ఫిలింనగర్ బస్తీల్లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాల కింద 22 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే దానం నాగేందర్ స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో 7 వేల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. పథకాల మంజూరిలో ఏ ఒక్కరికీ పైసా ఇవ్వకూడదని సొంత మనుషులపై కూడా డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

బంజారాహిల్స్: రేషన్ బియ్యం నిల్వ చేసిన గదిపై పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషనింగ్ సర్కిల్–7 సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఆదిత్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ సమీపంలోని గణపతి కాంప్లెక్స్ వద్ద మహ్మద్ సజ్జద్ అనే వ్యక్తి పెద్ద ఎత్తున రేషన్ బియ్యం నిల్వ చేసినట్లుగా సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కిలో రూ. 8కి కొనుగోలు చేస్తూ బహిరంగ మార్కెట్‌లో రూ. 12కు విక్రయిస్తున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు మహ్మద్ సజ్జద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహజీవనం చేస్తున్న హిజ్రాపై బ్లేడుతో దాడి

బంజారాహిల్స్: హిజ్రాతో సహజీవనం చేస్తున్న వ్యక్తి మద్యం మత్తులో బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎం.శైలజ(30) అనే ట్రాన్స్‌జెండర్ బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో ఉంటున్నది. కొన్నేళ్ల క్రితం నుంచి మహారాష్ట్రకు చెందిన రమీజ్ పటేల్‌తో సహజీవనం చేస్తున్నది. నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన రమీజ్ ఆటో నడుపుకొంటూ ఆమెతోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర గొడవ జరిగింది. అలమారాలో ఉన్న రూ. 90 వేలు తీసుకునే క్రమంలో బ్లేడ్‌తో తనపై దాడి చేసి వక్షస్థలంపై గాట్లు పెట్టాడని తలపై కూడా దెబ్బలు తగిలాయని బాధిత హిజ్రా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన బంజారా హిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఘనంగా పంచాహ్నిక ఉత్సవాలు



వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ నుంచి అభయాంజనేయ స్వామి తిరునక్షత్ర పాంచాహ్నిక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు అభయాంజనేయ స్వామికి 108 కలశాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం సీతారామస్వామికి లక్ష కుంకుమార్చన జరిగింది. మధ్యాహ్నం సామ్రాజ్య శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమాన్ని కనులపండువగా ఏర్పాటు చేశారు. ఆయా పూజాది కార్యక్రమాలకు మధురానగర్‌కాలనీ, సిద్ధార్థనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన కుమార ఆచార్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ తోటకూర నరసింహారావు, గౌరవ సలహాదారులు ఇంటూరి రామారావు తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టి.ఎస్.రావు మాట్లాడుతూ... ఆదివారం కూడా స్వామివారికి పూజాది కార్యక్రమాలు కొనసాగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే..



మాట్లాడుతున్న సాయికుమార్

పంజగుట్ట: పిల్లలకు యుక్తవయస్సు వచ్చేవరకు తల్లిదండ్రుల అవసరం ఎంత ఉంటుందో వయస్సు పైబడిన తల్లిదండ్రులకు పిల్లల అవసరం కూడా అంతే ఉంటుందని మెగ్టాక్స్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ ఎండీ బొమ్మ సాయికుమార్ అన్నారు. ప్రస్తుత తరుణంలో వయస్సు పైబడిన వారిని ఇంట్లో పెట్టుకోవడం ఇష్టపడక వృద్ధాశ్రమంలో వేస్తున్నారని, అన్నదమ్ములు ఉంటే వంతులవారీగా పంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వంతులు భరించలేక ఓ వృద్ధుడు తన చితిని తానే పేర్చుకుని ఆత్మహత్య చేసుకోవడం ఎంతో బాధాకరమన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాలు సందర్శించి బలవంతంగా ఆశ్రమంలో చేర్పించిన పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తామని, వారికి ఉచిత వైద్యశిబిరాలు, న్యాయ సలహాలు ఇస్తామన్నారు. షీ టీం వచ్చాక మహిళలపై వేధింపులకు ఎలా ఆగాయో పెద్దలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించే ఒక టోల్‌ఫ్రీ నెంబర్ ప్రభుత్వం తరఫున అన్ని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారిచే వృద్ధుల సమస్యలు తీర్చే కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులకు ఎలాంటి సమస్య ఉన్నా తమ 9429690689 టోల్‌ఫ్రీ నెంబర్‌లో సంప్రదిస్తే తాము అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. త్వరలోనే అమెరికాతో పాటు, భారతదేశం మొత్తం తమ సంస్థను ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో కె.జగన్ కుమార్, నర్సింగ్, అభిలాష్, అక్కినపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ పరీక్షల్లో ఎంజీఎం విద్యార్థుల హవా



శివానీరెడ్డి



శ్రీతేజస్విని

వెంగళరావునగర్: సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల్లో యూసుఫ్‌గూడలోని ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇందులో భాగంగా పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ పాసైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. జి.శివానీరెడ్డి, కె.శ్రీతేస్వినీలు 9.8 పాయింట్లు చొప్పున సాధించారు. ఆయా విద్యార్థినులను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, టీచర్లు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందన



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న సంఘ సేవకుడు ధర్మారావు

యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలు రాసి విజయం సాధించిన పలువురు విద్యార్థులను టీచర్లు అభినందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంఘ సేవకులు ధర్మారావు విద్యార్థులకు రూ. 1500 చొప్పున నగదు బహుమతి అందించారు. వారికి పూలబొకేలను అందించి అభినందించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం నరసింహా, టీచర్లు హనుమంతరావు, మధుసూదన్‌రెడ్డి, మహ్మద్‌అలీ, ప్రభాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు



మిఠాయిలు తినిపిస్తున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి



సంబరాల్లో పాల్గొన్న ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి



రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు



బంజారాహిల్స్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించడంతో ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో సంబరాలు అంబరాన్ని తాకాయి. రానున్న తెలంగాణ ఎన్నికల్లో కర్ణాటక ఫలితాలు పునరావృతం అవుతాయని ఇందులో ఏ మాత్రం సందేహం లేదని ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలతో కలిసి ఆమె భారీ ఊరేగింపు నిర్వహించడమే కాకుండా దారి పొడవునా ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి ఆనందం పంచుకున్నారు.

మతాన్ని అడ్డుపెట్టుకుంటే బోర్లాపడటం ఖాయం...

మతాన్ని అడ్డుపెట్టుకొని కర్ణాటకలో గెలవాలని చూసిన బీజేపీకి అక్కడి ప్రజలు వాతలు పెట్టారని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి మండిపడ్డారు. కర్ణాటక ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించడం పట్ల ఆయన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి బంజారాహిల్స్‌లో సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు తినిపించారు. ర్యాలీలు నిర్వహించారు. ఖైరతాబాద్‌లో సైతం కాంగ్రెస్ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రహమత్‌నగర్‌లో...

రహమత్‌నగర్: కర్ణాటక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల రహమత్‌నగర్‌లో ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. శ్రీరాంనగర్, ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి లియాకత్ అలీ, డివిజన్ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అందుకు కర్ణాటక ఎన్నికలే రెఫరెండమన్నారు. నాయకులు జె.పి.జ్ఞానేశ్వర్, కేశవులు, రాములు, సాయి, అరుణ్, బెన్‌హర్, నయీంఖాన్, రవి, యాదగిరి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

ఖైరతాబాద్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించిన సందర్భంగా టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ డివిజన్‌లో లైబ్రరీ చౌరస్తా, ఖైరతాబాద్ చౌరస్తాలలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు స్వీట్లు పంచి విజయాన్ని పంచుకున్నారు.

సత్తాచాటిన భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



స్కూల్ టాపర్ రోమారెడ్డి

ఫిలింనగర్: భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌లో 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. స్కూల్ టాపర్‌గా రోమా రెడ్డి 95.6 శాతం మార్కులతో విజయఢంకా మోగించారు. 94.4 శాతం మార్కులతో శ్రీకర్ బాలాజీ, 93.8 శాతం మార్కులతో ఆనల్ స్వాదియా టాపర్లుగా నిలిచారు. సైన్స్ గ్రూప్‌లో 92.4 శాతం మార్కులతో జీవీఎన్.సంజన విజయం సాధించారు. స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అరుణశ్రీ అభినందించారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

రహమత్‌నగర్: ఇందిరానగర్ ఫేజ్–2 హనుమాన్ స్టోన్ కట్టర్స్ కాలనీలోని శివదత్త మారుతి షిరిడీ సాయి బాబా ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 10న ప్రారంభమైన ఉత్సవాలు నాలుగు రోజులపాటు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా శనివారం పుణ్యాహవాచనం, మండపారాధన, నవగ్రహపూజ, పంచపాలకతోపాటు సాయంత్రం హోమం నిర్వహించారు. ఆదివారం జరిగే ప్రత్యేక పూజల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొంటారని ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య తెలిపారు.

సురక్షిత డ్రైవింగ్‌తోనే ప్రాణాలకు రక్ష..!

సనత్‌నగర్: రోడ్డు భద్రతా నియమాలను పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. బేగంపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ బ్యాంక్ ఏపీ అండ్ తెలంగాణ రీజనల్ ప్రధాన కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఇన్సూరెన్స్ ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నియమనిబంధనల గురించి వివరించారు. రెడ్‌సిగ్నల్ పడినప్పుడే వాహనాలను ఆపకుండా వెళ్లే క్రమంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

క్లుప్తంగా...

భద్రాద్రిలో హైకోర్టు జడ్జి



భద్రాద్రి ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వరరావు, తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని గురువారం తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆయన పూజలు చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఉద్యానశాఖ సంచాలకుడు హన్మంతరావు, కలెక్టర్ అనుదీప్ కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

పట్నా హైకోర్టుకు జస్టిస్ అభిషేక్‌రెడ్డి

బదిలీ సిఫారసులకు కేంద్రం ఆమోదం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి పట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులకు అనుగుణంగా కేంద్రం ఆమోదం తెలపడంతో గురువారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. 5 నెలల క్రితమే హైకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం తెలిసిందే. వీరిలో ఏపీ నుంచి బదిలీపై వచ్చిన కన్నెగంటి లలితను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలనే ప్రతిపాదన ఇంకా అమలు కాలేదు. ఆ సిఫారసుల మేరకు గత నెలలో జస్టిస్ నాగార్జున్, తాజాగా జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీ అయ్యారు. ప్రస్తుతం హైకోర్టులో సీజే కాకుండా 30 మంది న్యాయమూర్తులు ఉండగా, జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీతో వారి సంఖ్య 29కి తగ్గింది.

శరత్‌బాబుపై వదంతులు సృష్టిస్తే కేసు

సాక్షి, హైదరాబాద్: తీవ్ర అనారోగ్య సమస్యలతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ నటుడు శరత్‌బాబు ఆరోగ్యంపై ఇష్టారాజ్యంగా వార్తలు రాస్తున్న వారిపై ఆయన సోదరుడి కుమారుడు ఆయుష్ తేజస్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలిసీ తెలియకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయడంపై కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆ వార్తల్ని వెంటనే సదరు యూ ట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియాలో తొలగించని పక్షంలో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం శరత్‌బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన త్వరలోనే కోలుకుంటారని వైద్యులు చెబుతున్నారని వివరించారు. శరత్‌బాబు కోలుకోవాలని ప్రార్థిస్తున్న అభిమానులు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

టీఎస్ఐసెట్ దరఖాస్తు గడువు రేపటి వరకే..

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గాను 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న టీఎస్ఐసెట్ దరఖాస్తు గడువు ఈ నెల 6తో ముగియనుంది. రూ.250 అపరాధ రుసుముతో ఈ నెల 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 15వరకు ఏమైనా సవరణలు ఉంటే సరిచూసుకోవచ్చని తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత మగ్గాలను జియో ట్యాగింగ్ చేస్తూ.. కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత, జౌళిశాఖ అధికారులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. కార్మికులకు సంబంధించిన పక్కా సమాచారాన్ని ఆధునిక సాంకేతికత సహకారంతో ఆన్‌లైన్‌లో భద్రపరుస్తున్నారు. ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా, లూమ్ ఫొటోలతో మగ్గం ఉన్న చోటి నుంచే అక్షాంశ, రేఖాంశాలతో సహా జియో ట్యాగింగ్ చేస్తున్నారు. చేనేత మగ్గాలతోపాటు, కండెలు చుట్టే కార్మికుల వివరాలు, ఆ మగ్గాలపై పని చేసే ఇతర అనుబంధ రంగాల కార్మికుల సమాచారాన్ని సైతం క్రోడీకరించి పొందుపరుస్తున్నారు. సిరిసిల్ల

సంక్షేమాన్ని ట్యాగ్ చేసేలా..

- చేనేత మగ్గాలను జియో ట్యాగింగ్ చేస్తున్న జౌళిశాఖ అధికారులు
- కార్మికులు, మగ్గాల సమగ్ర డేటా నమోదు
- సంక్షేమ పథకాలను నేరుగా అందించేందుకు వీలుగా సమాచారం సేకరణ

చేనేత మగ్గాలను ఆన్‌లైన్ చేయడం ద్వారా కార్మికులు, మగ్గాల సమాచారం పక్కాగా ప్రభుత్వం వద్ద ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత మిత్ర పథకం కింద 40 శాతం యార్న్ (నూలు)

పక్కాగా లబ్ధి..బోగస్‌కు చెక్

సబ్సిడీ అందిస్తున్నారు.ఆన్‌లైన్ ప్రక్రియతో ఈ సబ్సిడీ నేరుగా ఎలాంటి బిల్లులు లేకుండానే అసలైన లబ్ధిదారులకు చేరే అవకాశం ఉంటుంది. నేతన్నలకు చేయూత పథకం (త్రిఫ్ట్)లో చేనేత కార్మికులు పొదుపు చేసుకునే అవకాశం ఉంటుంది. గరిష్టంగా ప్రతి నెలా రూ.1,200 పొదుపు చేస్తే.. అంతే మొత్తం అంటే మరో రూ.1,200 ప్రభుత్వం అందిస్తుంది. ఆ సొమ్ము చేనేత కార్మికుల ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. పొదుపు చేసుకున్న సొమ్ము, దానిపై వడ్డీ కలిపి 36 నెలల తర్వాత కార్మికులు తీసుకోవచ్చు. త్రిఫ్ట్ సొమ్మును నెలనెలా నేరుగా కార్మికుల వేతనాల నుంచి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ముద్ర రుణాలను బ్యాంకుల ద్వారా అందించే అవకాశం ఉంటుంది. ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా లబ్ధిదారుల దరికి చేర్చవచ్చు. మరోవైపు బోగస్ చేనేత సహకార సంఘాలు, బోగస్ సభ్యుల బెడద పూర్తిగా తొలగిపోతుంది. నిజంగా శ్రమించే కార్మికులు, కండిషన్‌లో ఉన్న మగ్గాల డేటా ఆన్‌లైన్‌లో ఉంటుంది.

వివరాలు రాసుకున్నారు..

మాది సిరిసిల్ల గణేశ్‌నగర్. కిరాయి ఇంట్లో ఉంటాను. చిన్నప్పటి నుంచి గిదే పని చేస్తున్న. నా భార్య పెంటవ్వకు పక్షవాతం. ఆమెకు పెన్షన్ వస్తుంది. రోజుకు ఐదు మీటర్ల బట్ట నేస్తా. మీటరుకు రూ.28.50 ఇస్తారు. రోజంతా పని చేస్తే రూ.140 వరకు వస్తాయి. మొన్ననే నా వివరాలు రాసుకుని, ఫొటోలు తీసుకున్నారు.

– రాపెల్లి హన్మాండ్లు(89), చేనేత కార్మికుడు, సిరిసిల్ల

క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తున్నాం



క్షేత్రస్థాయిలో చేనేత మగ్గాల, కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. చేనేత మగ్గాలున్న ప్రతి పల్లెకు వెళ్లి సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నాం. ఇది పూర్తి అయితే సంక్షేమ పథకాలు నేరుగా అందించే వీలుంది.

–ఎం.సాగర్, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల



వివరాలు నమోదు చేస్తున్న అధికారిణి

తగ్గిపోయిన చేనేత మగ్గాలు..

రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మరమగ్గాలు ఉన్నాయి. గతంలో ఇవి కేవలం నాలుగు జిల్లాల్లోనే ఉండేవి. రాష్ట్ర వ్యాప్తంగా 36,088 మరమగ్గాలు ఉండగా, చేనేత మగ్గాలు 17,573 మాత్రమే ఉన్నాయి. కాగా మరమగ్గాలకు ఇప్పటికే జియో ట్యాగింగ్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 26,494 మరమగ్గాలు ఉన్నాయి. చేనేత మగ్గాలు మాత్రం165 మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు జౌళిశాఖ చేపట్టిన ఆన్‌లైన్ నమోదు పూర్తి అయితే.. సమగ్ర వివరాలు అందుబాటులో ఉంటాయి. అయితే చేనేత మగ్గాలు, చేనేత కార్మికుల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఫోన్ సిగ్నల్, నెట్‌వర్క్ సరిగా లేక సమాచారాన్ని నమోదు చేయడం కష్టమవుతోంది.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం యాగ మండపంలో గురువారం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదాద్రిలో ముగిసిన శ్రీస్వామివారి జయంతి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం, శ్రీ పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీస్వామివారి జయంతి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ప్రధానాలయంలో ఆచార్యులు నిత్యహవనాలు నిర్వహించిన తర్వాత ప్రథమ ప్రాకారంలోని యాగశాలలో పూర్ణాహుతి, ముఖమండపంలో బంగారు, వెండి, రాగి కలశాలకు పూజలు చేపట్టి స్వయంభూ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావ ప్రవచనం, నివేదన, తీర్థ ప్రసాదగోష్టి, మంగళ నీరాజనం చేసి ఉత్సవాలను ముగించారు.

రోబోతో దరఖాస్తుల క్లియరెన్స్!

- వివిధ డాక్యుమెంట్లు, కార్డుల పరిశీలన కూడా..
- కృత్రిమ మేధ, ఆగ్మెంటెడ్ రియాలిటీతో వినూత్న ఆవిష్కరణలు
- కాప్ జెమిని సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మీరు కారు నడిపే తీరు ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గిస్తే..?
కెమెరా ముందు తీసే ఒక్క గుంజీ.. మీ ఫిట్‌నెస్‌ను తెలియజేస్తే..?
ఇదేదో భలే ఉంది కదా.. ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీలతో ఇలాంటి వినూత్న విధానాలను సాకారం చేస్తోంది హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'కాప్ జెమిని అప్లైడ్ ఇన్నోవేషన్ ఎక్స్చేంజీ (ఏఐఈ)'. అంతేకాదు మీరు ధరించే స్మార్ట్ వాచ్, డయాబెటిస్ కంట్రోలర్ల ద్వారా సేకరించే సమాచారం ఆధారంగా.. మీకు ప్రోత్సాహకాలు అందించేందుకు.. ఇంట్లో విద్యుత్ పొదుపు, నీటి లీకేజీలు వంటివి లేకుండా చూసుకోవడం ద్వారా ప్రాపర్టీ ట్యాక్స్‌లో రాయితీలు పొందేందుకు కూడా ఏఐఈ టెక్నాలజీలను రూపొందించిందని కాప్ జెమిని సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ తెలిపారు. కృత్రిమ మేధ/మెషీన్ లెర్నింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక టెక్నాలజీ రంగాల్లో సంస్థ చేస్తున్న ప్రయోగాలు, అభివృద్ధి చేసిన టెక్నాలజీలను కాప్ జెమిని గురువారం మీడియాకు పరిచయం చేసింది. కోకాపేటలోని జీఏఆర్ ఇన్ఫోభాన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీ–హబ్, స్టార్టప్‌లు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో కాప్ జెమిని చేపట్టిన వినూత్న కార్యక్రమాల వివరాలను వెల్లడించింది.

కార్డుల పరిశీలన మొదలుకొని..

కాప్ జెమిని అభివృద్ధి చేసిన టెక్నాలజీల్లో రోబో హ్యాండ్ వినూత్నమని కంపెనీ సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ తెలిపారు. దీని సాయంతో తక్కువ సమయంలో వందలకొద్దీ వివిధ డాక్యుమెంట్లు, డెబిట్/క్రెడిట్ కార్డుల పరిశీలన చేపట్టవచ్చని వివరించారు. ఉదాహరణకు బీమా కోసం చేసిన దరఖాస్తులను కంప్యూటర్ కెమెరా సాయంతో 'చదివి', వివరాలను పరిశీలిస్తుందని.. అవసరమైన వివరాలు లేకున్నా, తప్పులున్నా దరఖాస్తును తిరస్కరిస్తుందని తెలిపారు. ఉద్యోగులు పునఃపరిశీలన తర్వాత అవసరమైన సమాచారాన్ని తెప్పించుకోవచ్చని వివరించారు. ఇక షాపింగ్ మాల్స్‌లో దుస్తుల కోసం వర్చువల్ ట్రయల్‌రూమ్‌ను, ఆగ్మెంటెడ్ రియాలిటీ సాయంతో ఏదైనా కార్డు (లాయల్టీ, అడ్మిషన్, డెబిట్/క్రెడిట్)లోని వివరాలను తెలుసుకునే టెక్నాలజీని అభివృద్ధి చేశామన్నారు. ఈ టెక్నాలజీల్లో కొన్ని ఇప్పటికే వినియోగంలో ఉన్నాయన్నారు. వర్చువల్ రియాలిటీ ఆధారంగా మెటావర్స్ జోన్ ఒకదాన్ని కూడా సృష్టించామని తెలిపారు. కాప్ జెమినికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం 23 ఏఐఈ కేంద్రాలున్నాయని చెప్పారు.



రంజన్ ప్రధాన్

తుది తీర్పునకు లోబడే నియామకాలు

కాంట్రాక్టు లెక్చరర్లు, ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు లెక్చరర్లు, మహిళా, శిశు సంక్షేమ శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగించుకోవచ్చని.. కానీ నియామక కేటాయింపులు మాత్రం కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 16, అలాగే మహిళా, శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ అయిన జీవో నంబర్ 18ని కొట్టివేయాలని ములుగుకు చెందిన బానోతు సునీత సహా ముగ్గురు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది.

పిటిషనర్ల తరఫున న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. నియామక ఉత్తర్వులు ఇప్పుడే ఇవ్వవద్దని ఆదేశిస్తూ, హైకోర్టు విచారణను జూన్ 9వ తేదీ వాయిదా వేసింది.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సీఎస్ఈ

- కొత్తగా మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీని చేర్చే యోచన
- రాష్ట్రాలకు ఏఐసీటీఈ ముసాయిదా ప్రతిపాదన
- వచ్చే ఏడాది నుంచి అమలుకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కోర్సు స్వరూపాన్ని మార్చాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిర్ణయించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక కోర్సుల మేళవింపుతో మార్పు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే దీనిపై ముసాయిదా రూపొందించి, అన్ని రాష్ట్రాల అనుమతికి పంపింది. నూతన విద్యా విధానం–2020కి అనుగుణంగా ఈ మార్పులు చేపట్టింది. వాస్తవానికి 2023–24 విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమల్లోకి తేవాలని భావించింది. ఒకవేళ ఆలస్యమైతే 2024–25 నుంచి కొత్త బోధన ప్రణాళికను అమల్లోకి తెచ్చే వీలుంది. ప్రధానంగా కంప్యూటర్ సైన్స్‌లో పాత సిలబస్‌ను తొలగించి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. దీనికోసం 2021లో దేశవ్యాప్తంగా నిపుణులతో ఓ కమిటీని కూడా వేశారు. అన్ని సబ్జెక్టుల నిపుణులు, మేధావులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఇందులో చేర్చారు. ఈ కమిటీ గత ఏడాది తుది ముసాయిదా నివేదికను ఏఐసీటీఈకి సమర్పించింది.

కొత్త సబ్జెక్టులు

ప్రపంచవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్ వంటి కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. మార్కెట్ వర్గాలు సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కోరుతున్నాయి. కంప్యూటర్ సైన్స్ కోర్సు చేసిన విద్యార్థులు ఈ కోర్సులను మళ్లీ విడిగా నేర్చుకోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ప్రస్తుతం ఉన్న కంపైలర్ డిజైన్, థియరీ ఆఫ్ కంప్యూటేషన్ సబ్జెక్టులను తొలగించాలని, దీని స్థానంలో మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీని ప్రవేశపెట్టాలని నిపుణుల కమిటీ సూచించింది. ఇప్పటివరకూ ఈ కోర్సులను ఎంటెక్‌లో లేదా ఇంజనీరింగ్‌లో ప్రత్యేక కోర్సులుగా అందిస్తున్నారు. ఇలాకాకుండా వీటిని సీఎస్ఈలో తప్పనిసరిగా చదవాల్సిన సబ్జెక్టులుగా చేయాలని కమిటీ సూచించింది. కమిటీ సిఫార్సులను ఏఐసీటీఈ అన్ని రాష్ట్రాల అనుమతితో అమలు చేయాలని చూస్తోంది.

పటాయా పార్టీతో సంబంధం లేదు

- అలా ఉంటే వెంటనే ఇక్కడికి రాలేను
- మీడియాకు వీడియో విడుదల చేసిన చీకోటి ప్రవీణ్



చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్, కొండపాక(గజ్వేల్): మొన్నటికి మొన్న ఈడీ మనీలాండరింగ్ కేసు... నిన్నటికి నిన్న థాయ్‌లాండ్‌లో గుట్టురట్టయిన అక్రమ కెసినో వ్యవహారం... ఈ రెండింటిలోనూ ప్రధానంగా వినిపించిన పేరు చీకోటి ప్రవీణ్ కుమార్. నగరానికి చేరుకున్న ప్రవీణ్ పటాయా కెసినో వ్యవహారంపై స్పందిస్తూ మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని ఆరోపించారు. ఆ వీడియోలో ప్రవీణ్ మాట్లాడుతూ... 'థాయ్‌లాండ్‌లో నేను ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆ ఈవెంట్ దేవ్, సీత అనే వాళ్లు నిర్వహించారు. పోకర్ టోర్నమెంట్ 4 రోజులు పాటు జరుగుతోందని నాకు ఆహ్వానం పంపారు. నేను అక్కడకు వెళ్లిన నాలుగో రోజు సదరు హోటల్‌లోని కాన్ఫరెన్స్ రూమ్‌ను సందర్శించా. అందులో అడుగుపెట్టిన 15 నుంచి 20 నిమిషాల్లోనే పోలీసులు దాడి చేశారు. అప్పుడే నాకు వాళ్లు పంపింది నకిలీ ఆహ్వానపత్రిక అని తెలిసింది. ఆ అక్రమ కెసినో నిర్వహించింది నేనే అయితే ఇంత తేలిగ్గా తిరిగి రాలేను. అలాంటి వాటికి అక్కడ కఠినమైన శిక్షలు ఉన్నాయి. థాయ్‌లాండ్‌లో అక్రమంగా పేకాట శిబిరాలు నిర్వహిస్తే ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్షపడుతుంది. నా పాస్‌పోర్టు కూడా బ్లాక్‌లిస్ట్ చేసేవాళ్లు. పోలీసులు దాడి చేసిన రోజు అక్కడి న్యాయస్థానానికి సెలవు. మరుసటి రోజు కోర్టులో స్వల్ప జరిమానాతో విడిచిపెట్టారు' అని వివరించారు.

నామీద చాలా కుట్రలు

'నా చుట్టూ చాలా కుట్రలు జరుగుతున్నాయి. నేను రాజకీయ పార్టీలోకి వస్తున్నానని కొందరు అనుకుంటున్నారేమో..! ఇంకా దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పటాయాలో అక్రమ కెసినోతో నాకు ఎలాంటి సంబంధం లేదని నిర్వాహకులు దేవ్, సీత కూడా అక్కడి పోలీసుల వద్ద అంగీకరించారు. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి నేను అక్కడ రూ.50 లక్షలు లంచం ఇచ్చానని జరుగుతున్న ప్రచారం సత్యదూరం. ఆ ఈవెంట్‌కు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని ప్రవీణ్ అన్నారు.

నాకేం సంబంధం లేదు: దేవేందర్‌రెడ్డి

థాయ్‌లాండ్‌లోని పటాయాలో జరిగిన గ్యాంబ్లింగ్ డెన్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విహార యాత్రకు వెళ్లగా.. అక్కడి హోటల్‌లో ఇండియన్ ఫుడ్ తయారు చేయించామంటూ స్నేహితులు చెప్పడంతో ఆ హోటల్‌కు వెళ్లామన్నారు. 10 నిమిషాల్లోనే పోలీసులు వచ్చి పట్టుకున్నారని చెప్పారు. అక్కడ పోకర్ గేమ్ మాత్రమే పెట్టారని తెలిపారు. తమపై పెట్టిన కేసు నిరాధారమంటూ కోర్టు కొట్టివేసిందన్నారు. కొందరు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

కల్తీ కల్లు అమ్మినోళ్లకే మళ్లీ లైసెన్సులు ఎలా?

'మద్యం వ్యాపారం' ప్రాథమిక హక్కుకాదని హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: కల్లు, మద్యం వ్యాపారం నిర్వహించడం ప్రాథమిక హక్కు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. 'అప్పీలుదారులు వర్తకం చేసే కల్లులో డైజోపామ్‌తో కల్తీ అయినట్లు సంబంధిత నిపుణుడు గుర్తించిన తర్వాతే.. రాష్ట్ర ప్రభుత్వం వారి లైసెన్స్‌లు రద్దు చేసింది. అధికారులకు వాటిని పునరుద్ధరించమని చెప్పే ప్రశ్నే లేదు. ఏదేమైనా మద్యం వ్యాపారాన్ని ప్రాథమిక హక్కుగా భావించి కొనసాగించడం చట్టవిరుద్ధం'అని తేల్చిచెప్పింది. నిజామాబాద్‌లోని కల్లు దుకాణాల్లో డైజోపామ్ కల్తీ చేసినట్లు నిర్ధారణ కావడంతో 12 దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తూ 2022, మార్చి 14న అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తర్వాత వారు ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేయడంతో 2022, డిసెంబర్ 31న లైసెన్స్‌లను పునరుద్ధరించారు. దీన్ని సవాల్ చేస్తూ నిజామాబాద్‌కు చెందిన రాజాగౌడ్, రాధాకృష్ణగౌడ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి పిటిషనర్ల వాదనలతో ఏకీభవిస్తూ.. తీర్పునిచ్చారు. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ వై.జయవర్ధన్ గౌడ్, మరో 11 మంది హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున రేసు మహేందర్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున డీఎల్ పాండు వాదనలు వినిపించారు. ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అప్పీల్‌ను కొట్టివేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు (Unmarried)/41 / 5'11" / Govt. ఆఫీసర్/75,000/-PM గల వివాహం ఆలస్యమైన వరునికి 30yrs పై బడిన Unmarried హిందూ వధువు కావలెను. 9177904999 (No Brokers) [H-781206]

కమ్మ/28yrs/5'9"/V.ఫెయిర్/B.Tech, CSO, MS, IT, Working SW కంపెనీ ఆస్ట్రేలియా, 10cr pm,చాలా అందమైన సాంప్రదాయ కుటుంబ ఏకైక వారసుడు గల వరునికి వధువు కావలెను. సంప్ర:9346659936/ 9347576651 [H-797680]

రెడ్డి/35/5'7"/డిగ్రీ/1st మ్యారేజ్/Pvt జాబ్/25K PM/Hydలో Own House/3 కోట్ల ప్రాపర్టీ ఉన్న వరునికి FC/BC మధ్యతరగతి 1 or 2 మ్యారేజ్ పిల్లలులేని వధువు కావలెను (డైరెక్ట్). Ph: 9989125809 [H-781206]

శెట్టి బలిజ/రెండవ పెళ్ళి/45y/ 5'4"బిజినెస్ వరునికి రెండవ/విడో వధువు కావలెను. నో బ్రోకర్స్/డైరెక్ట్. Ph: 6301551811 [H-781206]

కుల ప్రసక్తి లేని 36 సంగల బిజినెస్ వరునికి, రెండవ/విడో, పిల్లలు ఉన్నవారు అయినా సం॥. వారి ప్రసక్తి లేదు. Ph: 73967 30091 [HA-29655]

యాదవ/M.Tech /C.Govt.Officcer (Income Tax Dept)/1 Lakh PM / 5'8" ఎత్తు /28 సంగల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-10779]

మాల క్రిస్టియన్/M.Tech/C.Govt.PO (SBI) /80,000/-PM / 5'8" ఎత్తు /28 సంగల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10779]

మాల హిందూ/ M.Tech / C.Govt. Scientist (DRDO) / 80,000/-PM /5'8" ఎత్తు/28 సంగల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10779]

క్రిస్టియన్ మాల/ C.A / చార్టెడ్ అకౌంటెంట్ /10 Lakhs PA/ 6' ఎత్తు/ 29 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-14619]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/ C.Govt. Asst. ఇంజనీర్/ONGC/ 1 Lakh pm/ 5'11" ఎత్తు/ 29 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-14619]

యాదవ/M.Com/ C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్/FCI/ 73,000/- pm/ 6' ఎత్తు/ 28 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-14619]

గౌడ/కట్నప్రసక్తి లేదు/B.Tech/ C. Govt. డిప్యూటీ మేనేజర్/ మిధాని/95,000/-pm/ 6' ఎత్తు/ 28 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14619]

వడ్డెర/కట్నప్రసక్తి లేదు/B.Tech/ C. Govt. మెకానికల్ ఇంజనీర్/రైల్వే/80,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14619]

క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు/B.Tech/ C. Govt. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్/90,000/-pm/ 5'10" ఎత్తు/ 28 సంగల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14619]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/(Contractor) B.Tech / MBA/ Handsome Boy / 1994/ 5'10"/60Cr/ Needs a Beautiful Bride. No Dowry. *Cont: K.C. Reddy. Ph: 9849321309

Reddy/No Dowry/B.Tech/MS/USA Citizen/1994/5'9"/Needs Beautiful Bride/150Cr. * Cont:K.C.Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/CATHOLIC/Very Handsome Boy/CANADA/B.Tech/MBA/1990/6'/ 90K/15Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee) B.Tech/ MBA / 1994/ 5'10"/Job/300Cr.*Business/Hyd/1981/5'8/ 250 Cr. * 1979/5'9"/300Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Business/ B.Tech / MBA/1989/ 5'11" / 500Cr. *1990 / 6'/ 1000Cr. *1993/ 5' 10" /500Cr. * Cont : K.C. Reddy-Mar-Bur-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Now in Hyd/B.Tech/MS/H1/USA /1991/5'10"/200Cr/150K. *1992/6'/130K/ 10Cr. *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS / H1/USA/Very Handsome Boy/1992/5'9"/185K/50Cr. *Needs India or USA alliance * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/MBBS / PG/DM. * 1994 / 5'10"/ 75Cr. *1993/5'10"/50Cr. *1989/5'9"/30 Cr. * 1995/5'10"/400Cr. *Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/IIT/BITS / 1994 / 5'10" / 35L/yr. *1992/5'9"/25L/yr. *32L/yr/1992/5'7"/USA-1992/400K. *1995/300K/5'7" *1994/5'7"/ 230K. * Cont: K.C. Reddy-Ph: 9849321309

Reddy/(Divorcee USA) B.Tech/MS/USA/ 1986/ 5'11"/350K/40Cr. *1986/6"/220K/15Cr. 1974/5'11"/50Cr. *1988/5'11"/200K/100Cr. *Cont: K.C.Reddy-Hyd- Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/MBBS/ MD/DM / 1994/5'6"/ 100Cr. Needs Doctor or Any Business Settled. *Cont: K.C. Reddy-Hyd-Ph:9849321309/ 9347807015

Reddy/Divorcee/ BBA/MS/Jwellry Designer / 1991 / 5'4" / 17Cr. Hyd. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Divorcee / B.Tech/Interior Designer/Most Beautiful/ 1988/ 5'6"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MDS/Most Beautiful /1996 / 5'8"/*BDS/1996/5'6"/4Cr*MDS/ 1995 /5'6".*Cont:K.C.Reddy-Mar-Bureau-Hyd-Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech / Most Beautiful/ 1997/5'5"/25Cr/Needs any well settled or USA alliance. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/ MS/H1 / USA/Royal Family/1990/5'8"/160K/30Cr & Needs India or USA well settled. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy / Most Beautiful (Divorcee)/ B.Tech/1988/5'6"/50Cr/5L/M Rental income/2.5 Cr-Bank Balance. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Most Beautiful(Divorcee) B.Tech(CBIIT) 1991/5'4"/ SWE/Hyd/ 10Cr. *Needs India or Abroad. *Cont: K.C. Reddy -Hyd Ph: 9347807015

Reddy/Most Beautiful/Rich/Family. *B.Tech /1993/5'3"/1000Cr. *1997/5'4"/ 100Cr. *1994/5'6"/100Cr. * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/Most Beautiful/ V.Young/ 2001/ 5'3"/20Cr. *1998/5'4"/25Cr. *2002/ 5'7"/ 20Cr. *1998/5'7"/50Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

[D-513]

నాయిబ్రాహ్మణ/B.Tech, MBA/C. Govt. Asst. మేనేజర్/FCI/ 78,000/-pm/ 5'10" ఎత్తు/ 28 సంగల వరుడికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-14619]

యాదవ/M.Tech (IT)/ C. Govt. మెకానికల్ ఇంజనీర్/ రైల్వే/14 Lakhs pm/ 5'9" ఎత్తు/ 29 సంగల వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 9515755529 [HA-14619]

డైవర్సీ/కుల పట్టింపులేదు/38yr/ Govt. ఎంప్లాయ్, 3 లక్షలు (pm), సొంత స్కూల్, కోట్ల ప్రాపర్టీ, బాగా స్థిరపడిన అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. (పిల్లలు ఉన్నా Ok). సంప్రదించండి: 9959815362 [H-797680]

కుల ప్రసక్తి లేదు/B.Tech/Govt.Asst. ఇంజనీర్/ఇరిగేషన్ Dept/70,000/-PM/5'8" ఎత్తు/29 సంగల వరునికి వధువు కావలెను. Ph: 9618579861 [HA-13763]

రజక/ఏకైక కుమారుడు/B.Tech/ C.Govt. ఆఫీసర్/ఇన్‌కమ్‌టాక్స్Dept/1 Lakh PM/ 5'10" ఎత్తు/30 సంగల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 8897389698 [HA-13763]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech (సివిల్)/ C.Govt.మేనేజర్/యూనియన్ బ్యాంక్/11 Lakhs. PA/ 5'8"ఎత్తు/28సంగల అందమైన వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529, 9912280929 [HA-13763]

రజక/కట్న ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 80,000/-PM/5'10"ఎత్తు/29 సంగల వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-13763]

మాల : MBBS; MD (Gen. Medicine), DM (Neuro) 5'8 / 30 Y/ Fair/ 10 Cr. /2L మెడిసిన్, IIT, IIM వధువులు అర్జంట్‌గా సంప్రదించండి. సెల్ : 81065 01199, 92484 94810. [M-257]

SC హిందూ మాదిగ : B.Tech./Software Engineer/1,30,000/- PM./ 5.4 ఎత్తు /27 సంగలు / అందమైన వరుడికి వధువు కావలెను. నో బ్రోకర్స్. సంప్ర. సెల్ : 81064 25215. [M-9299]

★

బ్రాహ్మణ (వైదిక)/30y/5'9"/B.Tech/ MS/Software USA, 120K PA, H1B గల Well Settled వరునికి తగిన వధువు కావలెను. 9246960888 [H-781316]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen BS, 27, 6' 0", Microsoft, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech (IIT), MS, 28, 5' 7", Engineer, 330 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK BE (BITS), 28, 5' 10", SWE, 150 K Pounds, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA Citizen BS, 27, 6' 0", SWE, 200 K, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 26, 5' 7", Hyderabad, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), 27, 5' 3", 15 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", SWE, 20 L P/ A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 4", SWE, 72 K, 3 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 23, 5' 8", Engineer, 40 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 6'0", Developer, 150 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK BE, MBA (IIM), 29, 6' 1", Sr. Consultant, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru BE (IIT), MBA (IIM), 32, 5' 10", Manager, 34 L P/A. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 24, Manager, 8 L P/A, 1.5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Accenture, BE, 25, 5' 8", Engineer, 2 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 3", PG Doctor, 15 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 4", Engineer, 200 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి/30y/6ft / B.Tech/MS / Software USA, 300K PA, H1B, 30Cr Property గల వరునికి తగిన USA/India వధువు కావలెను. 9246960888 [H-781316]

మాదిగ క్రిస్టియన్/29yrs, 5'9", B.Com, గవర్నమెంట్ జాబ్, ప్రాపర్టీ 15Cr గల వరుడికి Any Caste, హిందూ/క్రిస్టియన్ అందమైన వధువు కావలెను. 7207930999 [H-781316]

37 Years Boy From Reddy Family Location Hyderabad (New City) MBBS MD (Doctor) is Looking for a Suitable match (080-69070601) [HA-1549]

SC Mala (Christian)/ 39 Years Boy Central Govt. Employee Looking/ Upper Middle Class family is looking for Suitable Match (080-69072073) [HA-1549]

29 Years/ 5'11"/ Working Abroad/ Affluent Family/ is looking for a Suitable Match (080-69070619) [HA-1549]

Christian Boy/ 40 Years/ Senior Software Engineer / 70L PA is looking for a Match (080-69070604) [HA-1549]

Reddy Boy/ 31 Years / 5'11"/ Businessman/ Rich Family/ Only Son/ Looking for a beautiful Girl (080-69070601) [HA-1549]

★★

రెడ్డి: 2nd మ్యారేజ్ Groom, విడోయర్, 55yrs & 60 yrs Govt, Retd, వెల్ సెటిల్ వరులకు వధువులు కావలెను. Caste No. bar. Ph: 9985737295 [HA-13768]

డైరెక్ట్: మంచి వ్యక్తికి ఆస్తి ఉన్న వధువు కావాలి. వయస్సు, కుల, మత పట్టింపులు లేవు. Ph: 9113679022 [WB-4408]

భార్య చనిపోయింది / కుల ప్రసక్తిలేదు / Any BC /61/ 5'7"/ Govt. Pensioner/ 55,000/- pm వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8309208120 [H-781622]

SC మాల హిందూ వయస్సు 35 సంగలు, H-5.5", డబుల్ M.Tech. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు 80 వేల జీతం వరుడుకి వధువు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ కావలెను. నోబ్రోకర్స్ ✆ : 96769 82230 [R-1154786]

క్రిస్టియన్ - వైష్ణవులు (BC-D) వయస్సు 42 సంగలు, ఎత్తు 5'.4", 2వ, ప్రభుత్వ ఉద్యోగి (టీచర్) వరునికి , దేవునియందు భయభక్తులు గల హౌస్ వైఫ్‌గా ఉండే క్రిస్టియన్ (BC/OC) వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ ✆ : 99632 13831 [R-5850]

రెడ్డి, 33/5'6, MBA Swe. Hyd. Sal : 8L-P.A. గల వరుడికి రెడ్డి Caste అయి ఉండి జాబ్ చేస్తున్న అమ్మాయి కావలెను. నో బ్రోకర్స్. ఫోన్ : 94403 18320, 77949 61398 [V- 794525]

వరుడు కావలెను



No Caste bar, 1,2 వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే Ph: W: 7794960803 [H-796835]

కమ్మ: 33సం B.Tech సొంత ఇల్లు 8 ఎకరాల పొలం స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (ఆస్తి కుల పట్టింపు లేదు) Send photos Only Whatsapp 7207516654 [H-778991]

2వ పెళ్ళి: కులప్రసక్తిలేదు/35yrs/ C.Govt ఆఫీసర్ 3 లక్షలు (pm) పిల్లలు లేని తెల్లని అందమైన 10 కోట్ల ఆస్తి గల వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్ర: 8341454870 [H-781678]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/Govt. DWMA PD/1.5L PM/Own House/19 ఎ॥లు/కోట్ల ప్రాపర్టీ గల ఏ బాదర బందీలేని వధువుకు Well Settled వరుడు కావలెను. Ph: 8106824285 [H-781206]

చౌదరి/కుల, ఆస్తి పట్టింపు లేదు/29/5'5"/ డిగ్రీ/ఫెయిర్/కోట్ల ప్రాపర్టీ Own రెస్టారెంట్ గల వధువుకు 1వ, 2వ పిల్లలులేని వరుడు కావలెను (అర్జెంట్) వాట్సాప్: 8886831924 [H-781206]

యాదవ /B.Tech / C.Govt. Officer (Income Tax Dept)/ 50,000/-PM/ 5'4" ఎత్తు/25 సంగల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10779]

మాల క్రిస్టియన్/B.Tech/C.Govt. Asst Manager (Canara Bank)/ 55,000/-PM/ 5'4" ఎత్తు/26 సంగల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10779]

ముదిరాజ్/ఏకైక కుమార్తె/B.Tech/ Govt. Jr. Asst./ MPDO/ 40,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14619]

క్రిస్టియన్ మాల/B.Tech/ Govt. A.E/ ఇరిగేషన్ Dept./ 50,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14619]

ఆస్తి, కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. గవర్నమెంట్ RTD/60Y/ సొంత ఇల్లు/రెంట్స్/50,000PM/పెన్షన్ 50000 PM. పిల్లలులేరు. Ph: 9866244690 [H-781483]

చౌదరి/విడో/60y/ప్రభుత్వ రిటైర్డ్ /Own House / Rents / పిల్లలులేని ఒంటరి వధువుకు కులప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9550629225 [H-781483]

రెడ్డి/ విడో/ 50y / 5'5' / V.Fair / Govt. Teacher/సొంత ఇల్లు/ఆంధ్రాలో 20 ఎకరాల మాగాణి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-781483]

బ్రాహ్మిన్స్/విడో/60y / 5'3" / తెల్లని ఛాయ/ B.Ed/గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్/3 ఎకరాల పొలం, సొంత ఇల్లు గల వధువుకి కుల పట్టింపులేని మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 8688368288 [H-781483]

కుల పట్టింపులేదు/డైవర్సీ/37 Yrs/ MCA చదివిన/ కోట్ల ఆస్తి గల బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం Ok). సంప్రదించండి: 9502046384 [H-797680]

రెడ్డి/30 Yr/ కుల పట్టింపులేదు/Govt. ఎంప్లాయ్, 50K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, బిజినెస్ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం 1st & 2nd మ్యారేజ్ Ok). సంప్ర: 9492081545 [H-797680]

కాపు/విడో/52 Y/ Govt. లెక్చరర్/Fair, పిల్లలు లేరు/1 L pm/ సొంత ఇల్లులు రెంట్స్/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (ఇల్లరికం Ok).(నో బ్రోకర్స్). Ph: 7799083500, 7386660643 [H-797680]

SC మాల/ఏకైక కుమార్తె/B.Tech/Govt. Asst. Exq. ఇంజనీర్/పంచాయతీరాజ్ Dept/60,000/-PM/5'3" ఎత్తు/27 సంగల వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-13763]

2వ పెళ్లి /B.Com / ఇంటీరియర్ డిజైనర్/50,000/-PM/5'5"ఎత్తు/29 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963757612 [HA-13763]

వైశ్య /2వ పెళ్లి/35/5'4"/10th. పిల్లలు లేని అందమైన వధువుకు Any OC/ BC జాబ్/బిజినెస్ వరుడు కావలెను. Ph: 9701743336 [HA-13763]

వడ్డెర / B.Tech / Govt.AE / ఇరిగేషన్ Dept/60,000/-PM/5'4"ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-13763]

SC మాల & క్రిస్టియన్/B.Tech(EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/65000/-PM/5'4"ఎత్తు/25 సంగల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-13763]

SC, మాల హిందు/డైవర్సీ. 37 సంగలు, C. Govt. టీచర్ వధువుకు Any Govt. ఎంప్లాయ్/బిజినెస్ సెటిల్ అయిన 42 సంగల లోపు వరుడు కావలెను. డైరెక్ట్ కాల్. Ph: 7013362957 [HA-13772]

బ్రాహ్మణ/25/ 5'3"/ఇంటర్ *28/5'2"/B.Sc *30/5'3"/ఇంటర్ *27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్ Ok. పురోహితులకు సంబంధాలు కలవు. Ph: 7207634758 [HA-13735]

ఆర్యవైశ్య/23y/5'2" & 25y/5'4 & 27y/5'3 & 29y / 5'4& 31y / 5'3& రెండో పెళ్ళి/33y/ 5'2& 36y/ 5'3& 42y/ 5'4 & 45y/ 5'3 & 48y/ 5'2&54y/5'3/ జి.సుబ్రహ్మణ్య గుప్తా "మా సేవ" Ph WA: 9291503949 [H-781678]

రెడ్డి విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ వయస్సు: 30 చదువు: డిగ్రీ/ మంచి వ్యాపారములు గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం అయినా ok) సం. 9515673282 [H-781678]

రెడ్డి /52 సంగలు/5'4"ఎత్తు, V.Fair, డైవర్సీ, సొంత ఇల్లు, రెంట్లు బిజినెస్, పొలము గల వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. 7386162541 [H-781678]

కాపు: 45yr/ కులపట్టింపు లేదు/Govt ఎంప్లాయ్ 1లక్ష (pm) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు, కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం 1st & 2nd మ్యారేజ్ oK) సంప్ర: 8374802603 [H-781678]

★

రజక/28y, 5'2"/B.Tech, Govt. AE, Hyd, 80,000/-PM గల వధువుకి తగిన Govt/Software వరుడు కావలెను. 9248064777 [H-781316]

రెడ్డి/27y, 5'7" V/F, MS Software USA, 170K PA, H1-B, ప్రాపర్టీ 50 Cr వధువుకి తగిన Well Settled వరుడు కావలెను. 7207930999 [H-781316]

★★

కాపు, 38 సం॥, B.A. వికలాంగురాలు, కన్వర్టెడ్ క్రిస్టియన్, కుల పట్టింపు లేదు. 1వ or 2వ వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK ✆ 89775 99427 [B-1197999]

వేదికలు



మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-7892]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793686]

35+ దాటినా పెళ్లి కాలేదని చింతిస్తున్నారా! కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య బ్రాహ్మణ, OC, BC, ST, SC, 1వ, 2వ Govt, NRI, Pvt, Engr. అన్ని కులాల ఫాస్ట్ సెటిల్‌కై సంప్ర: Ph: 9247217621 [HA-13763]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13766]

Padmashali- Viswabrahmin - Yadava పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13766]

Kamma-Kapu-Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13766]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas. Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13766]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas. Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13766]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-781483]

శెట్టిస్(కోమట్ల)/ 33yrs/5'4"/Govt.జాబ్ వరునికి వధువు (CNB) కావలెను. * క్రిస్టియన్/ 54yrs/Govt.జాబ్ వధువుకు క్రిస్టియన్ వరుడు కావలెను. అన్ని కులాలకు సంబంధాలు చూడబడును. శ్రీ లత. Ph: 72072 11109 [HA-063]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి : 9381553423 [HA-13737]

40 సం॥ వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. అన్ని కులాల/కులాంతర సంబంధాలకై kaakateeya.com. Ph: 9121393060 [HA-10745]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-781479]

పెళ్లి ప్రయత్నాలు చేసి విసిగిపోయారా? మేమున్నాము!! Only సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI, Govt. 20years గా Fast Settlement, పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1349]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-100]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-026]

★★

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 / 8555980066 [HA-10770]

మాల క్రైస్తవ, హిందూ, వివాహ పరిచయ వేదిక 14-05-2023 ఆదివారం సా॥ 4 గం॥ నుండి 8 గం॥ వరకు AP సోషల్ సర్వీస్ సెంటర్, JVR నగర్, ఏలూరు ✆ 94405 45049 [B-1165152]

భద్రాద్రిలో నిత్యాన్నదానానికి ప్రభాస్ రూ.10 లక్షల విరాళం



ఈఓ రమాదేవికి చెక్కు అందజేస్తున్న యూవీ క్రియేషన్స్ బాధ్యులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి సినీ నటుడు ప్రభాస్ శనివారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి కాశ్యపస గోత్రం పేరుతో ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. కాగా, ప్రభాస్ తరఫున యూవీ క్రియేషన్స్ ప్రతినిధులు ఉప్పలపాటి వెంకట సత్యనారాయణ ఆలయ ఈఓ రమాదేవికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ వారికి కృతజ్ఞతలు తెలిపి రశీదు ఇచ్చారు. కాగా, ప్రభాస్ రాముడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఆదిపురుష్'వచ్చే నెల 23న విడుదల కానుంది.

యువత సంప్రదాయ వ్యవసాయం వైపు మళ్లాలి

సుస్థిర వ్యవసాయంపై అవగాహన సదస్సులో వక్తలు

సాక్షి, హైదరాబాద్: యువత సంప్రదాయ వ్యవసాయం వైపు మళ్లాలని అధ్యాపకులు, శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. 'వాతావరణ మార్పు', 'సుస్థిర వ్యవసాయం' థీమ్‌పై కోయంబత్తూర్‌కు చెందిన కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ నిర్వహించిన రెండు రోజుల సదస్సులో పలువురు మాట్లాడుతూ పర్యావరణ అనుకూల జీవనశైలిపై దృష్టి పెట్టాలన్నారు. కారుణ్య డీమ్డ్ విశ్వవిద్యాలయం వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందని వర్సిటీ బాధ్యులు తెలిపారు. వ్యవసాయ రంగంలో మంచి భవిష్యత్తును సృష్టించడమే విశ్వవిద్యాలయం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

కొండంత భక్తి

మల్యాల (చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధి లక్షలాది మంది భక్తులతో కళకళలాడింది. ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని దీక్ష చేపట్టిన, మాలలు ధరించిన భక్తులు శనివారం ఉదయం నుంచే కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. తొలుత కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో దీక్ష, మాల విరమణ చేశారు. ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



అంజన్న సన్నిధిలో భక్తులు (ఇన్‌సెట్లో) విద్యుద్దీప కాంతులతో కొండగట్టు ఆలయం

అమ్మకు ప్రేమతో..

గుడి కట్టిన కుమారులు

రెంజల్ (బోధన్) తల్లికి గుడి కట్టిన తనయులు నిత్య ధూపదీప నైవేద్యాలతో పూజలు చేస్తున్నారు. రెంజల్ గ్రామానికి చెందిన చందూర్ చిన్న పోసాని అనారోగ్యంతో 2021 ఫిబ్రవరిలో మృతి చెందగా వ్యవసాయ క్షేత్రంలో సమాధి చేశారు. 41 రోజుల పాటు కుటుంబ సభ్యులు నియమ నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేసి సమాధి స్థలంలోనే గుడి కట్టారు. ప్రతి శుక్రవారం తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉపవాసం చేస్తున్నారు.

తల్లి చూపిన బాటలో..

సర్వస్వం తల్లి చూపిన మార్గంగా భావించి మా కుటుంబం నడుస్తోంది. నిత్యం అమ్మ గుడికి వెళ్లి దర్శించుకుని ధూప, దీపాలంకరణ చేస్తాం.

– సంతోష్, కుమారుడు



జగిత్యాల మామిడి.. అంకాపూర్ చికెన్..

ఆర్టీసీ హోం డెలివరీ.. ఔట్

- గతేడాది ముమ్మరంగా ఆర్డర్లు
- సకాలంలో డెలివరీ చేయలేక పాడైన 40 శాతం సరుకు
- లాజిస్టిక్ విభాగం హోం డెలివరీ వ్యవస్థలో లోపాలు
- సరిదిద్దేవరకు వాటి జోలికెళ్లొద్దని ఆర్టీసీ నిర్ణయం
- లాస్ట్ మైల్ కనెక్టివిటీని పటిష్టపరిచే చర్యలకు శ్రీకారం

సాక్షి, హైదరాబాద్: "ఆర్టీసీ.. జగిత్యాల బంగినపల్లి మామిడిపళ్లు... ఆర్టీసీ.. అంకాపూర్ చికెన్."గతేడాది ఆర్టీసీలో మారుమోగిన పేర్లు. ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం జగిత్యాల మామిడిపళ్లను, అంకాపూర్ చికెన్‌ను హోం డెలివరీ చేసింది. బంగినపల్లి మామిడి పళ్ల కోసం వేలల్లో ఆర్డర్లు వచ్చాయి. తొలి హోం డెలివరీ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్వయంగా పాల్గొని, ఆర్డరిచ్చిన కుటుంబానికి మామిడి పళ్లను అందించారు. నిజామాబాద్ జిల్లా ప్రత్యేకం అంకాపూర్ చికెన్‌ను రాష్ట్రంలో ఎక్కడికైనా సరఫరా చేస్తున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. దీన్ని మరింత విస్తృతం చేస్తామని అధికారులు చెప్పారు. ఏడాది గడిచింది.. మామిడిపళ్లు ముమ్మరంగా మార్కెట్‌ను ముంచెత్తుతున్న తరుణంలో ఈసారి ఆర్టీసీ జగిత్యాల బంగినపల్లి మామిడి జోలికి వెళ్లలేదు, అంకాపూర్ చికెన్ మాట ఎత్తటం లేదు. వాటి హోం డెలివరీని విరమించుకుంది.

ప్రత్యామ్నాయ మార్గంగా...

ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకునే క్రమంలో ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో అండ్ పార్శిల్) విభాగాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికైనా వస్తువులు, పార్శిళ్లను తరలించే క్రమంలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఉండే పదార్థాలు, వస్తువులు, తయారీలను కూడా హోం డెలివరీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. నిర్మల్ కొయ్య బొమ్మలు, చేర్యాల పెయింటింగ్స్ వంటి వాటితోపాటు జగిత్యాలలో పండే ప్రత్యేకమైన బంగినపల్లి మామిడి పళ్లు, నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో ప్రత్యేకమైన చికెన్ వంటకాలనూ కోరుకున్న వారి ఇంటికి అందించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. సహజసిద్ధంగా పండిన మామిడి పళ్లను రూ.110కి కిలో చొప్పున ఆర్డర్ ఇచ్చిన వారం రోజుల్లో ఇంటికి అందించే 'మ్యాంగో ఎక్స్‌ప్రెస్'కార్యక్రమాన్ని ప్రారంభించింది.

లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సమస్యలతో..

ఆ ప్రాంతం నుంచి లాజిస్టిక్ బస్సుల్లో గమ్యస్థానమున్న ప్రాంతానికి సులభంగానే చేరుతున్నా.. అక్కడి నుంచి ఇళ్లకు తరలించే లాస్ట్‌మైల్ కనెక్టివిటీ బలహీనంగా ఉందన్న విషయాన్ని ఆర్టీసీ గుర్తించలేదు. పళ్లు, చికెన్‌ను సకాలంలో డెలివరీ చేయలేకపోయింది. దీంతో పార్శిల్‌లోని పళ్లు, చికెన్ పాడవడం మొదలైంది. కుళ్లిన పళ్లు, పాచిపోయిన చికెన్ ఇస్తున్నారంటూ బుక్ చేసిన వారి నుంచి విమర్శలు మొదలయ్యాయి. వేల సంఖ్యలో ఆర్డర్లు వచ్చినా, 40% పండ్లు, చికెన్ పాడైనట్టు గుర్తించారు. దీంతో లాస్ట్‌మైల్ కనెక్టివిటీని పటిష్ట పరిచేంతవరకు.. వేగంగా పాడయ్యే పదార్థాలను సరఫరా చేయొద్దని నిర్ణయించిన ఆర్టీసీ ఈ యేడాది మామిడిపళ్లు, చికెన్ జోలికి వెళ్లలేదు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ వ్యవస్థను పటిష్టపరిచే పనిని ప్రస్తుత లాజిస్టిక్ విభాగం చేపట్టింది. ఈమేరకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. మరో ఆరు నెలల్లో ఓ బలమైన సంస్థతో ఒప్పందం చేసుకోనున్నట్టు తెలిసింది. అప్పుడు మళ్లీ ఇలాంటి వస్తువుల హోమ్ డెలివరీ మొదలుపెట్టాలని నిర్ణయించారు.



క్లుప్తంగా...

18న ఎడ్‌సెట్

రాష్ట్ర వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలు

నల్లగొండ రూరల్: ఈ నెల 18న ఎడ్‌సెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎడ్‌సెట్ చైర్మన్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు దశలుగా పరీక్ష ఉంటుందని, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మూడో దశ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 31,725 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, విజయవాడ నగరాల్లో కూడా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

నాలుగు వర్సిటీల్లో కొత్త కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని నాలుగు వర్సిటీలలో (2023–24) విద్యా సంవత్సరం నుంచి కొత్తగా పీజీ, పీజీ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టారు. ఓయూలో మైక్రో బయాలజీ విభాగంలో ఎమ్మెస్సీలో ఫార్మంటేషన్ టెక్నాలజీ, మహాత్మాగాంధీ వర్సిటీలో టూరిజం సబ్జెక్టు కాంబినేషన్‌తో ఎంఏ హిస్టరీ, ఎంఏ సైకాలజీ, కాకతీయ వర్సిటీలో ఎమ్మెస్సీ సెరికల్చర్ (పట్టుపురుగుల పెంపకం), తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో మూడు పీజీ డిప్లొమా కోర్సులను ప్రారంభించనున్నారు. ఏదైనా డిగ్రీ అర్హతతో మహిళలకు ఫ్యామిలీ మ్యారేజీ కౌన్సెలింగ్ కోర్సు, ఫార్మా టెక్నాలజీ, ఫోరెన్సిక్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులతో పాటు ఏదైనా డిగ్రీ కోర్సును పూర్తి చేసిన అభ్యర్థులు ఎంకాంలో ప్రవేశం పొందవచ్చని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తిచేసిన విద్యార్థులకు ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశం కల్పించనున్నట్లు వివరించారు. కాగా, టీఎస్‌పీజీఈటీ–2023కి తొలి రోజు 500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

కేరళ తీరంలో 12వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

2,500 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్‌సీబీ

కొచ్చిన్: భారత సముద్ర జలాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.12 వేల కోట్ల విలువైన సుమారు 2,500 కిలోల మెథాంఫెటమైన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డ్(ఎన్‌సీబీ) స్వాధీనం చేసుకుంది. కేరళ తీరంలోని భారత సముద్ర జలాల్లో సంచరిస్తున్న ఓ ఓడ నుంచి ఈ మత్తు పదార్థం ఉన్న 134 సంచులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్(ఆపరేషన్స్) సంజయ్ కుమార్ సింగ్ శనివారం మీడియాకు తెలిపారు. అఫ్గానిస్తాన్ నుంచి అక్రమంగా తరలించే డ్రగ్స్‌ను పట్టుకునేందుకు ఆపరేషన్ సముద్రగుప్త పేరుతో నేవీ, ఎన్‌సీబీ కలిసి చేపట్టిన ఆపరేషన్‌లో కొన్ని ఇతర వస్తువులను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఒక పాకిస్తానీని అదుపులోకి తీసుకున్నామన్నారు. అఫ్గానిస్తాన్ నుంచి డ్రగ్స్‌తో బయలుదేరిన భారీ ఓడ ఒకటి మక్రాన్ తీరం వెంబడి పాక్, ఇరాన్‌ల మీదుగా డ్రగ్స్‌ను చిన్న పడవల్లోకి పంపిణీ చేసుకుంటూ వస్తోందని చెప్పారు. మట్టన్‌చెర్రీ వద్ద ఈ ఓడను అడ్డగించినట్లు వెల్లడించారు. భారత్, శ్రీలంక, మాల్దీవులకు డ్రగ్స్‌ను చేరవేయడమే స్మగ్లర్ల లక్ష్యమన్నారు. దక్షిణ మార్గంలో గత ఏడాదిన్నర కాలంలో ఇంత భారీగా డ్రగ్స్ పట్టుబడటం ఇది మూడోసారని వివరించారు.

భానుడి భగభగలు

సాక్షి, హైదరాబాద్: భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారంఉష్ణోగ్రతలు మరింత పెరిగి రికార్డు సృష్టించాయి. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా కరీంనగర్ జిల్లా వీణవంకలో 45.8 డిగ్రీల సెల్సియస్, జగిత్యాల జిల్లా జైనలో 45.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇక చాలాచోట్ల ఉష్ణోగ్రతలు 40డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు అవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం
కరీంనగర్(వీణవంక)	45.8
నల్లగొండ	43.0
నిజామాబాద్	42.5
ఆదిలాబాద్	42.5
మెదక్	42.0
రామగుండం	42.0
హనుమకొండ	40.5
భద్రాచలం	40.2
హైదరాబాద్	39.7
ఖమ్మం	39.6
దుండిగల్	39.5
హకీంపేట్	39.2
మహబూబ్‌నగర్	39.0

ప్రపంచ దేశాల మూన్‌రేస్!

జాబిల్లిపై ఆధిపత్యం కోసం తీవ్రమవుతున్న పోటీ ● ప్రయోగాల కోసం వడివడిగా కసరత్తు

దొడ్డ శ్రీనివాసరెడ్డి

అకస్మాత్తుగా అనేక దేశాల దృష్టి జాబిల్లిపైకి మారింది. చందమామపై ఆధిపత్యం కోసం దేశాల మధ్య పోటీ మొదలైంది. 50 ఏళ్ల క్రితమే జాబిల్లిపై తొలి అడుగు వేసిన అమెరికా మొదలు ఇప్పటివరకు ఒక్క రాకెట్ కూడా ప్రయోగించని సౌదీ అరేబియా వరకు ఎన్నో దేశాలు మూన్ రేస్‌కు సిద్ధమయ్యాయి. చందమామపై ఉన్న అపార ఖనిజ నిక్షేపాలు, నీటి జాడలను సొంతం చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో వాణిజ్య స్థాయిలో పర్యాటక అభివృద్ధి నుంచి ఆవాసాల ఏర్పాటు వరకు అక్కడి ఉపరితలంపై ముందుగా పాగా వేయాలని తహతహలాడుతున్నాయి. ఈ దిశగా ఏయే దేశాలు ఎలాంటి ప్రయత్నాలు సాగిస్తున్నాయో ఓ లుక్కేద్దాం.

చందమామపై ఆధిపత్యం కోసం జరుగుతున్న పోటీలో అందరికన్నా చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (కన్సా) ముందుంది. చాంగ్–3, 4, 5 మిషన్‌లతో చంద్రుని ఉపరితలంపై కబ్జా పెడుతోంది! ఈ దశాబ్దం చివరికల్లా చంద్రునిపై అడుగుమోపాలని చైనీయులు తహతహలాడుతున్నారు. 2030 నాటికి చైనా వ్యోమగాములు జాబిల్లిపై అడుగుపెట్టడం తథ్యమని చైనా చంద్రయాన్ కార్యక్రమ అధిపతి వుపీరెన్ ఢంకా భజాయించి చెబుతున్నారు. వ్యోమగాములు చంద్రునిపై దిగడానికి ఉపయోగించే పరికరాల తయారీలో ఎంతో ముందంజ సాధించామని ఆయన చెప్పారు. వ్యోమగాములను తీసుకెళ్లే అత్యాధునిక రాకెట్‌ను, అంతరిక్షనౌకను చైనా సిద్ధం చేసుకుంటోంది. కొత్త తరం రాకెట్ తొలి ప్రయోగం 2027లో నిర్వహించాలని, 2030 నాటికి వ్యోమగాములను చంద్రునిపైకి పంపాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అంతేకాదు వ్యోమగాములు కొంతకాలంపాటు చంద్రునిపై గడిపేందుకు వీలుగా చిన్నపాటి స్పేస్‌స్టేషన్ నిర్మాణానికి కూడా సిద్ధమవుతోంది. చంద్రునిపై ఉన్న మట్టి సాయంతో ఇటుకల తయారీకి అవసరమైన త్రీడీ టెక్నాలజీని కూడా అభివృద్ధి చేస్తోంది. మొత్తం ప్రాజెక్టులో అమెరికా వంటి దేశాలు భాగస్వామ్యాన్ని కూడా చైనా ఆహ్వానిస్తోంది.



రేసులో ఇతర దేశాలు

భారత్: చంద్రయాన్–2 మిషన్ విఫలమైనా చంద్రయాన్–3 ప్రయోగానికి సిద్ధమవుతోంది.

యూఏఈ: రషీద్ రోవర్‌ను చంద్రునిపై దింపడానికి సకల ఏర్పాట్లు చేసుకుంటోంది.

జపాన్: ప్రైవేటు సంస్థ ఐస్పేస్ చిన్నసైజు అంతరిక్ష నౌక హకుతోఆర్‌ను జాబిల్లిపై దించే ప్రయత్నాల్లో ఉంది. అది గనుక విజయవంతమైతే చంద్రునిపైకి అంతరిక్షనౌకను దింపిన తొలి ప్రైవేటు కంపెనీ కాగలదు.

ఇజ్రాయెల్: ప్రైవేటు సంస్థ చంద్రునిపై అడుగుపెట్టడానికి ప్రయోగించిన తొలి బెరిసీట్ మూన్ మిషన్ విఫలమైంది. రష్యా, యూరప్, దక్షిణ కొరియా సైతం వివిధ స్థాయిల్లో చంద్రుడిని చేరేందుకు ప్రయోగాలు చేస్తున్నాయి.

స్పేస్ ఎక్స్: మూన్‌రేస్‌లో ప్రభుత్వాలే కాకుండా ప్రైవేటు సంస్థలు కూడా పోటీ పడుతున్నాయి. ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, జెఫ్‌బెజోస్‌కు చెందిన బ్లూ ఓరియన్ లాంటి పెద్ద ప్రైవేటు స్పేస్ సంస్థలతో పాటు వివిధ దేశాలకు చెందిన అనేక చిన్న, పెద్ద ప్రైవేటు సంస్థలు కూడా పోటీలోకి దిగాయి.

చంద్రుడు ఎవరివాడు?

అంతరిక్షాన్ని ఎవరి స్వప్రయోజనాలకు వాడుకోకుండా, మానవాళి మనుగడకు ఉపయోగించుకోవాలనే ఒప్పందంపై 1967లో 110 దేశాలు సంతకాలు చేశాయి. అలాగే అంతరిక్షాన్ని శాంతియుతంగా, పారదర్శకంగా ఉపయోగించుకోవడం కోసం అమెరికా, మరికొన్ని దేశాలు అనేక ఒప్పందాలు చేసుకున్నాయి. కానీ ఇప్పుడు చంద్రుడి విషయంలో మాత్రం అనేక దేశాలు తమ భౌగోళిక, రాజకీయ, వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకొనేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

అమెరికా తహతహ..

చైనాకన్నా ముందే చంద్రునిపై ఆధిపత్యాన్ని నెలకొల్పాలని అమెరికా ఉవ్విళ్లూరుతోంది. డొనాల్డ్‌ట్రంప్ అధ్యక్షునిగా ఉన్నప్పుడే చంద్రుడిపై దృష్టి పెట్టమని నాసాను కోరారు. దీంతో యాభై ఏళ్ల తరువాత మళ్లీ చంద్రునిపై అడుగు పెట్టేందుకు నాసా కృతకృత్యమైంది. ఆర్టిమిస్ పేరిట ఓ సుదీర్ఘ కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా ఇప్పటికే నాసాకి చెందిన ఓరియాన్ అంతరిక్ష నౌక చంద్రుని చుట్టూ తిరిగి భూమిమీదకు చేరింది. రెండో మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములతో కూడిన అంతరిక్షనౌక చంద్రుడిని ప్రదక్షిణ చేసేందుకు నాసా సన్నద్ధం అవుతోంది. 2025 నాటికి చంద్రునిపై వ్యోమగాములు అడుగు మోపేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించింది. ఇద్దరు వ్యోమగాములు అందులో ఒకరు మహిళ, మరొకరు రంగు జాతికి చెందిన వ్యక్తి చంద్రునిపై కాలుమోపేలా నాసా వ్యూహరచన చేసింది. ఈ బృహత్తర కార్యక్రమం కోసం స్పేస్ ఎక్స్, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్‌లతో నాసా జతకట్టింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఐఎస్ఏ) ఏకంగా చంద్రుడిపై రోబోల సాయంతో ఓ గ్రామాన్ని నిర్మించాలనే సంకల్పంతో ప్రణాళికలు రచిస్తోంది. స్పేస్‌ఎక్స్ ఓ వైపు నాసా కోసం పనిచేస్తూనే మరోవైపు ప్రయాణికుల్ని చంద్రునిపైకి తీసుకువెళ్లే వాణిజ్యపరమైన యాత్రలకు శ్రీకారం చుట్టే వ్యూహాన్ని రూపొందిస్తోంది. మరోవైపు అమెజాన్ అధిపతి జెఫ్‌బెజోస్ చంద్రునిపైకి సరుకులు రవాణా చేసే కార్గో రాకెట్ల రూపకల్పన కోసం బ్లూమూన్ పేరిట మిషన్‌కు రూపకల్పన చేస్తున్నారు.


"చంద్రుని దక్షిణ ధ్రువాన్ని గుప్పిట్లోకి తీసుకోవడానికి చైనా ప్రయత్నిస్తోంది. అందుకే మేము మరోసారి చంద్రుడుపైకి వెళ్లడానికి కృతనిశ్చయంతో ఉన్నాం. ఈసారి అంతర్జాతీయ, వాణిజ్య భాగస్వాములతో కలసి జాబిల్లిపైకి అడుగుపెడతాం.
– నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్‌నెల్సన్

ఒకప్పుడు చంద్రయానాన్ని దేశ గౌరవంగా పరిగణించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సొంత ప్రయోజనాల కోసం దేశాల మధ్య పోటీ ఏర్పడింది."
– ఏరోస్పేస్ సెక్యూరిటీ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ కెతెలిస్ జాన్సన్

స్పేస్ జామ్!

వచ్చే పదేళ్లలో అన్ని దేశాలు, సంస్థలు కలిసి కనీసం 100 వరకు చంద్రయాన్‌లు నిర్వహించనున్నాయి. దీంతో భూమికి చంద్రునికి మధ్య విపరీతమైన రద్దీ ఏర్పడనుంది.! భూమి–చంద్రుడి మధ్యభాగాన్ని సిస్‌లూనార్ అని పిలుస్తారు. వ్యోమగాములను పంపడం, చంద్రుడిపై స్పేస్ స్టేషన్ నిర్మించడం, రోబోలతో కాలనీ నిర్మించడం వంటి అనేక కార్యక్రమాల కారణంగా సిస్‌లూనార్ మొత్తం రాకెట్లు, శాటిలైట్లు, అంతరిక్ష నౌకల ప్రయోగాలతో బిజీగా మారనుంది! సిస్‌లూనార్ స్పేస్‌లోని కొన్ని కక్ష్యలకు ఉన్న ప్రయోజనాల దృష్ట్యా వాటిని ఆక్రమించడానికి కూడా విపరీతమైన పోటీ ఏర్పడనుంది. సాంకేతిక అభివృద్ధి కారణంగా అంతరిక్ష ప్రయోగాల ఖర్చు గణనీయంగా తగ్గిపోయింది. భౌగోళిక, రాజకీయ, వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా వివిధ దేశాలు, సంస్థల మధ్య పోటీ పెరిగిపోయి త్వరలో స్పేస్‌జామ్‌కు కారణం కాబోతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అమెరికా ప్రభుత్వం ఇటీవల సిస్‌లూనర్ స్పేస్‌ని అందరూ శాంతియుతంగా బాధ్యతాయుత, సుస్థిర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఉపయోగించుకోవాలని కోరింది.

ఎవరెస్ట్ ఎక్కించిన తెలుగుపాఠం..



ట్రెక్కింగ్ చేస్తున్న సాయిప్రసాద్

నిర్మల్: ఆయనో చార్టెడ్ అకౌంటెంట్. పక్షంరోజులు పనులన్నీ పక్కనపెట్టి, ఏకంగా ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ పర్వతాన్ని ఎక్కడానికి వెళ్లారు. తొలిసారే అవకాశం లేదనడంతో వెనక్కి తగ్గేది లేదంటూ.. ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకూ వెళ్లారు. ఆయన హిమాలయాలకు వెళ్లడానికి, అంత ఎత్తు ఎక్కడానికి కారణం తొమ్మిదో తరగతిలో ఆయన విన్న తెలుగుపాఠం కారణం. ఎవరా సీఏ, ఏమా తెలుగుపాఠం.. వివరాలివిగో!

'బేస్‌క్యాంప్' వరకు చేరిన నిర్మల్‌వాసి

- తెలుగు మాస్టారు మాటలకు ఆకర్షితుడై..
- హిమాలయాలకు వెళ్లిన చార్టెడ్ అకౌంటెంట్



ఎవరెస్ట్ ఎక్కిన తన బృందంతో సాయిప్రసాద్

నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన ముక్క సాయిప్రసాద్ చార్టెడ్ అకౌంటెంట్. ఆయన కరీంనగర్‌లోని పారామిత హైస్కూల్‌లో చదువుకున్నారు. తెలుగుసార్ సన్యాసిరావు తొమ్మిదో తరగతి పాఠంలో భాగంగా 'అటజని కాంచె భూమిసురుడు..' అనే పద్యాన్ని చెబుతూ హిమాలయాలను అందంగా వర్ణించారు. అది సాయిప్రసాద్ మనసులో బలంగా నాటుకుపోయింది. ఎప్పటికైనా హిమాలయాలకు వెళ్లాలని, ఆ అందాలను చూడాలని అప్పుడే ఫిక్స్ అయ్యారు. తరువాత ఉన్నత చదువులు, కెరీర్‌లో పడిపోయినా.. ఇరవైఏళ్ల కిందట విన్న పాఠం, హిమాలయాలకు వెళ్లాలన్న ఆలోచన ఆయన మదిలో మెదులుతూనే ఉంది.

మొదటిసారి కావడంతో..

అయితే.. గతనెల 28న నేపాల్ రాజధాని ఖాట్మాండు వెళ్లిన ఆయన అక్కడి నుంచి హిమాలయాలకు చేరుకున్నారు. మొత్తం ఎవరెస్ట్ శిఖరం ఎత్తు 8,849 మీటర్లు కాగా, బేస్ క్యాంప్ 5,364 మీటర్లు ఉంటుంది. తొలిసారి ఎవరెస్ట్ ఎక్కాలనుకునేవారిని ఈ బేస్ వరకే అనుమతిస్తారు. సాయిప్రసాద్‌ను సైతం బేస్ వరకే అనుమతించారు. ఏడురోజుల పాటు ఎక్కుతూ ఈనెల 6న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. తన కుటుంబం, మిత్రుల సహకారంతో ఇక్కడి వరకూ వచ్చానని సాయిప్రసాద్ చెప్పారు. తనతో పాటు ఆయన మిత్రుడు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన నార్లాపురం గిరిధర్‌ను కూడా ఒప్పించి వెంట తీసుకెళ్లారు.

హిమాలయాలు అద్భుతం..

"హిమాలయాల గురించి వింటుంటాం. కనులారా చూస్తేనే వాటి అందం తెలుస్తుంది. నాకు ట్రెక్కింగ్ అనుభవం లేదు. కానీ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇస్తాను. అదే నేను ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకు చేరడానికి ఉపయోగపడింది. అక్కడికి వెళ్లి హిమాలయాలను చూడటం మర్చిపోలేని ఫీలింగ్. మరోసారి ఎవరెస్ట్ మొత్తం ఎక్కడానికి ప్రయత్నిస్తా."
– ముక్క సాయిప్రసాద్, సీఏ, నిర్మల్

మహిళను బతికించిన సీపీఆర్

- రోడ్డు ప్రమాదంలో గాయపడి స్పృహ కోల్పోయిన మహిళ
- సీపీఆర్‌తో జీవం పోసిన కారు డ్రైవర్

వైరారూరల్: రోడ్డు ప్రమాదంలో చనిపోయిందని భావించిన మహిళకు అటుగా వెళ్తున్న కారు డ్రైవర్ చేసిన సీపీఆర్ పునర్జన్మను ప్రసాదించింది. ప్రమాదంలో ఓ మహిళలకు తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఖమ్మం జిల్లా వైరా మండలం స్టేజీ పినపాక వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదం వివరాలు.. ఏపీలోని శ్రీకాకుళం సమీపాన సింగుపురం గ్రామానికి చెందిన సులావు ఆటకేశం వరంగల్ ఎస్‌బీఐలో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఆయన బంధువులు మృతిచెందినట్లు తెలియడంతో వరంగల్ నుంచి భార్య సునీత, కుమారుడు స్వాతిక్, కుమార్తె జాన్వి త, తల్లి నాగరత్నంతో కలిసి కారులో సింగపురం బయల్దేరాడు. స్టేజీ పినపాక వద్ద జాతీయ ప్రధాన రహదారిపై వైరా నుంచి తల్లాడ వైపు వెళ్తున్న టిప్పర్ ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేయడంతో ఆటకేశం కుటుంబం ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. టిప్పర్ వెనుక బంపర్‌లో కారు ఇరుక్కుపోవడంతో 200 మీట ర్ల మేర ఈడ్చుకెళ్లింది. అయితే, కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణహాని తప్పినా నాగరత్నం భయంతో కుప్పకూలిపోయింది. దీంతో అందరూ మృతి చెందిందని భావించారు. ఇంతలో అటుగా వెళ్తున్న కారు డ్రైవర్ నాగరత్నంకు సీపీఆర్ చేసి ఊపిరిపోశాడు. ఆమెతో పాటు ఆటకేశం, సునీత దంపతులకు స్వల్పగాయాలు కాగా ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

36 వేల టీచర్ల నియామకం రద్దు

కలకత్తా హైకోర్టు సంచలన ఉత్తర్వులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఏడేళ్ల క్రితం ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో నిబంధనావళి ఉల్లంఘన ద్వారా ఉద్యోగాలు పొందిన 36వేల మంది ఉపాధ్యాయుల నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మూడు నెలల్లోపు ఆ పోస్టులను భర్తీచేయాలని తృణమూల్ కాంగ్రెస్ సర్కార్‌ను జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. 'ఇంతటి అవినీతిని పశ్చిమబెంగాల్‌లో ఏనాడూ చూడలేదు. ఉద్యోగాలు కోల్పోయిన ప్రైమరీ టీచర్లు నాలుగు నెలలపాటు విధుల్లో కొనసాగవచ్చు. అప్పటిదాకా పారా టీచర్ల స్థాయిలో తక్కువ జీతమే తీసుకోవాలి' అని జడ్జి జస్టిస్ అభిజిత్ సూచించారు. 'నాటి రాష్ట్ర ప్రాథమిక విద్యా బోర్డు అధ్యక్షుడు మాణిక్ భట్టాచార్య, బోర్డ్ సభ్యులు ఈ నియామకాల ప్రక్రియను ఒక లోకల్ క్లబ్ మాదిరిగా మార్చేశారు' అని జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2016 నాటి బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల కుంభకోణాన్ని కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు విచారణచేపట్టిన విషయం విదితమే. '2016లో రిక్రూట్ అయిన 42,500 మందిలో 36వేల మంది టీచర్లు ఆప్టిట్యూట్ పరీక్ష అర్హత లేకుండా, ఎలాంటి శిక్షణ లేకుండా ఉద్యోగాలు పొందారు. అందుకే వీరి నియామకం మాత్రమే రద్దయింది' అని కేసు విచారణ సందర్భంగా కోర్టులో ఉన్న ఒక న్యాయవాది వెల్లడించారు. టీచర్ల నియామక కుంభకోణంలో నాటి విద్యా శాఖ మంత్రి, టీఎంసీ నేత పార్థా ఛటర్జీ, రాష్ట్ర ప్రాథమిక విద్యా బోర్డు మాజీ అధ్యక్షుడు మాణిక్, తదితరులు అరెస్టవడం తెల్సిందే.

సవాల్ చేస్తాం: కాగా హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తామని ప్రస్తుత ప్రాథమిక విద్యా బోర్డు అధ్యక్షుడు ప్రొఫెసర్ గౌతమ్‌పాల్ చెప్పారు. 'నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ట్రైనింగ్ మార్గదర్శకాల ప్రకారమే వారి నియామక ప్రక్రియ పూర్తయింది. హైకోర్టు ఉత్తర్వులపై సవాల్‌కు సిద్ధమవుతున్నాం. న్యాయ నిపుణులతో సంప్రతింపులు జరుపుతున్నాం. ఆ 36వేల మందికీ బోర్డు 2019లో ఆన్‌లైన్ లెర్నింగ్ మోడ్‌లో శిక్షణ ఇప్పించింది' అని పాల్ పేర్కొన్నారు.

ఆ టెండర్లు ఎందుకు రద్దు చేశారు?

'మనఊరు – మనబడి'పై అధికారులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మన ఊరు – మన బడి కార్యక్రమం కింద పాఠశాలల్లో టేబుళ్లు, బెంచ్‌లు సమకూర్చుకోవడానికి పిలిచిన టెండర్లను ఎందుకు రద్దు చేశారో చెప్పాలని అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా వివరాలు అందజేయాలని ఆదేశిస్తూ జూన్ 6కు విచారణను వాయిదా వేసింది. 'మన ఊరు– మన బడి'కార్యక్రమంలో భాగంగా టేబుళ్లు, బెంచ్‌లు సరఫరా చేయడానికి తమకు దక్కిన టెండర్లను అధికారులు కారణం లేకుండా రద్దు చేశారంటూ చింతామణి పరస్వంత్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఫిబ్రవరిలో ఎల్–1 కాంట్రాక్టర్‌గా తాము టెండర్ వేయగా, అదే నెలలో తమకు బిడ్ దక్కినట్లు ప్రభుత్వం తెలియజేసిందన్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.2,95,00,000 బ్యాంక్ గ్యారెంటీ కూడా సమర్పించామని చెప్పారు. అయితే ఎలాంటి కారణం తెలుపకుండా తమ టెండర్ రద్దు చేసినట్లు సంబంధిత కమిటీ మార్చి 29న ఈ –మెయిల్ పంపిందన్నారు. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులైన విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ (టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ), దాని చీఫ్ ఇంజనీర్ తదితరులకు నోటీసులు జారీ చేశారు. టెండర్ల రద్దుపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

హైకోర్టు చెప్పినా అంతేనా!

సీసీఎస్‌కు నిధులు చెల్లించే విషయంలో ఆర్టీసీ మౌనం

- ఉద్యోగుల జీతాల నుంచి ప్రతినెలా మినహాయించే రూ.18 కోట్లు ఎక్కడ?
- ఆ మొత్తం సీసీఎస్‌కు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశం
- కానీ కొద్ది మొత్తంతోనే సరిపెట్టిన ఆర్టీసీ
- 7 వేలు దాటిన ఉద్యోగుల లోన్ దరఖాస్తుల సంఖ్య
- నిత్యం సీసీఎస్ కార్యాలయానికి వచ్చి ఉద్యోగుల ఆందోళన

'కూతురి పెళ్లి పెట్టుకున్నా సర్. లోన్ కోసం దరఖాస్తు చేసి మూడు నెలలైంది. చిన్న జీతమున్నోడిని. ప్రైవేటుగా అప్పు తెచ్చి వడ్డీ కట్టగలనా. నా పైసల మీద లోనే కదా నేను అడిగేది.. ఎందుకియ్యరు.?'
– సిద్దిపేట జిల్లాకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆవేదన ఇది.

'రిటైర్ అయిన వెంటనే సెటిల్‌మెంట్ చేసి పంపుతామన్నరు. నేను రిటైర్ అయి మూడు నెలలైంది. నాకు రావాల్సిన డబ్బులు ఇవ్వడానికి ఇంత తిప్పుతరా. మాలాంటోళ్ల బాధలు చూసి, బకాయిలు కట్టమని ఆర్టీసీకి కోర్టు చెప్పినా ఇవ్వకుంటే నాలాంటోళ్లు ఏం చేయగలుగుతరు'
–నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ శ్రామిక్ ఆవేదన ఇది.

–సాక్షి, హైదరాబాద్



ఆర్టీసీకి అనుబంధంగా ఉన్న సహకార పరపతి సంఘం (సీసీఎస్) పరిస్థితి దా'రుణం'గా తయారైంది. రుణాల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న వారు, రిటైర్ అయి సెటిల్‌మెంట్ల కోసం ఎదురు చూస్తున్న వారు సీసీఎస్ కార్యాలయానికి వచ్చి అక్కడి సిబ్బందిపై విరుచుకుపడుతున్నారు. నిత్యం గొడవలు, వాడోపవాదాలతో సీసీఎస్ కార్యాలయం గందరగోళంగా తయారవుతోంది. సీసీఎస్‌కు ఆర్టీసీ దాదాపు రూ.650 కోట్లు బకాయిపడింది. వడ్డీతో కలుపుకొంటే ఆ మొత్తం రూ.1050 కోట్లకు చేరింది. ఆ నిధులు సొంతానికి వినియోగించుకున్న ఆర్టీసీ, వాటిని చెల్లించేందుకు ససేమిరా అంటుండటంతో సీసీఎస్‌లో నిధులు లేకుండాపోయాయి. ఫలితంగా లోన్లకు దరఖాస్తు చేసి నెలలుగా ఎదురుచూస్తున్నవారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. రిటైర్ అయి నెలలు గడుస్తున్నా సెటిల్‌మెంట్లు చేయకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగుల్లో ఆగ్రహావేశాలు పెరిగిపోతున్నాయి. ఇక పదవీ విరమణ పొంది, వారి సెటిల్‌మెంట్ డబ్బులను ఇందులో డిపాజిట్ చేసి వడ్డీ పొందలేక పోతున్న విశ్రాంత ఉద్యోగులూ ఆందోళనకు దిగుతున్నారు.

ఎన్ని మార్లు తిరగాలి?

ఇక బకాయిలకు సంబంధించి ఈనెల 15 లోపు రూ.50 కోట్లు సీసీఎస్‌కు చెల్లించాలని కూడా హైకోర్టు ఆదేశించింది. 13వ తేదీ వచ్చినా, ఆర్టీసీ నుంచి ఇప్పటి వరకు సీసీఎస్‌కు పిలుపు అందలేదు. ఈనెలాఖరులోగా మరో రూ.150 కోట్లు కూడా చెల్లించాలని ఆదేశించింది. ప్రతినెలా ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించుకునే సొమ్ములనే ఇవ్వలేని పరిస్థితుల్లో ఈ బకాయిల చెల్లింపు విషయంలో ఎలా నమ్మకంగా ఉండగలమని ఓ రిటైర్డ్ ఉద్యోగి కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు.

కోర్టు ఆదేశాలను కూడా..

ఇటీవలే ఆ నిధుల ఇప్పించాలని సీసీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించగా, ప్రతినెలా ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించే మొత్తాన్ని యథావిధిగా సీసీఎస్‌కు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలా చెల్లించాల్సిన మొత్తం దాదాపు రూ.18 కోట్లు. ఆ నిధుల నుంచే సీసీఎస్ సభ్యులైన ఉద్యోగులకు రుణాలు అందిస్తారు. కానీ ఆర్టీసీ రూ.ఐదారు కోట్లకు మించి కట్టడం లేదు. దీంతో రుణాల కోసం దాదాపు ఏడు వేల దరఖాస్తులు పేరుకుపోయాయి. రూ.18 కోట్లను సీసీఎస్‌కు కట్టమని స్వయంగా హైకోర్టు చెప్పినా ఆర్టీసీ పట్టించుకోకపోవడంపై రిటైర్డ్ ఉద్యోగులు మండిపడుతున్నారు.



మోకా తుపాను.. బంగ్లాదేశ్ హై అలర్ట్

ఢాకా: భీకర మోకా తుపాను హెచ్చరికలతో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆగ్నేయ తీర ప్రాంతాల నుంచి వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరింది. గత రెండు దశాబ్దాల్లోనే అత్యంత శక్తివంతమైన మోకా తుపాను ఆదివారం బంగ్లాదేశ్–మయన్మార్ సరిహద్దులకు సమీపంలో తీరాన్ని తాకే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్ర తెలిపింది. మోకా ప్రభావంతో భారీ వర్షాలతోపాటు గంటకు 175 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని పేర్కొంది. దీంతో అధికారులు చట్టోగ్రామ్, కాక్స్ బజార్ ఓడ రేవుల్లో అత్యంత ప్రమాదకరమైన 8వ నంబర్ సూచికను ఎగురవేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద రొహింగ్యా శరణార్థుల శిబిరం కాక్స్ బజార్ జిల్లాలోనే ఉంది. వెదురుకర్రలు, పాలిథీన్ కవర్లు, టిన్‌తో తయారైన నివాసాల్లో ఉంటున్న 5 లక్షల మంది రొహింగ్యాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 1,500 షెల్టర్లను ఏర్పాటు చేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.